
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

సజల శ్రద్ధ



సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్



సంపుటి 19 - సంచిక 01
**జూన్ 2014**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**


## నేను

'నేను' అనే మాట అనేక సందర్భాలలో వస్తుంటుంది. ప్రతివ్యక్తి ఈ పదాన్ని సహజంగా ఏదో ఒక సందర్భంలో ఉపయోగిస్తూనే ఉంటాడు. కానీ ఈ పదమందలి అంతరార్థాన్ని మాత్రం తెలుసుకోలేడు. ప్రతి మనిషికి జన్మించిన తరువాత 'నేను' అనే పదంతోనే జీవితం మొదలవుతుంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ ఈ 'నేను' అనే ఆలోచన జీవితాంతం ఎంతో కొంత స్థాయిలో కొనసాగుతుంది. తరువాత మరణ సమయంలో ఈ 'నేను' అనే పదం అంతమవుతుంది. ఈ జనన-మరణాల రెండు అంచుల మధ్యలో ఈ 'నేను' విస్తారంగా వ్యాపించి ఉంటుంది.

ఈ 'నేను' ప్రతి వ్యక్తికి పరిచయమైనదే కానీ తెలియనది కూడా! మానవ భాషలో ఇంతకంటే రహస్యమయమైన పదము మరొకటి లేదు. సాధారణంగా అందరి జీవితాలు ఈ 'నేను' అనే పదము యొక్క రహస్యాన్ని (అంతరార్థాన్ని) తెలుసుకోకుండానే గడిచిపోతాయి. అసలు ఈ 'నేను' ఎవరు? దీనిని ఎవ్వరూ తెలుసుకోడానికి ప్రయత్నించరు. 'నేను విన్నాను' అనే జ్ఞానం అందరికీ ఉంటుంది. కాని నేను ఎవరిని? అనే దానిని గురించి చాలా కొద్దిమంది మాత్రమే తెలుసుకోగలరు. దీనికి కారణమేమిటంటే ఈ జ్ఞానమనేది ఆత్మసాధన వలన మాత్రమే అవగతమవుతుంది. మొత్తం సాధనల యొక్క విధి విధానాలన్నీ కూడా ఈ 'నేను' అనే పదాన్ని అనుభూతి చెందుట కొరకే. అన్ని రకాల దర్శన ప్రణాళికలు, సమస్త ధర్మములు ఈ ప్రశ్నకు సమాధానము తెలుసుకొనుట కొరకే. ఎవరైతే ఈ సాధనలో దిగి, 'నేను' అనే పదములోని అంతరార్థ లోతులలోకి జిజ్ఞాసతో ప్రవేశిస్తారో, వారికి ఈ 'నేను' అనే జ్ఞానమే భగవంతుని యొక్క జ్ఞానము అని తెలుస్తుంది. అందుచేతనే మహాత్ములందరు ఈ 'నేను' అనునది మిక్కిలి అమూల్యమైనదని, పరిపూర్ణంగా దీని లోతులోనికి దిగి, ఆత్మ సంపద (ఆత్మోన్నతి) ను పొందమని చెప్తారు.

*- అనువాదం: శ్రీమతి ఎమ్. సీతామహాలక్ష్మి*

**కోరుకున్నంత మాత్రాన విజయం రాదు, దాని కోసం చాలా శ్రమ చేయాలి**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** నేను 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** ఆనంద(ప్రాప్తి 4
3. **వేదమంత్రం :** సోమరితనాన్ని పార(ద్రోలాలి-2 5
4. **గాయత్రీ విద్య - 44 :** గాయత్రీ సాధన యొక్క వైజ్ఞానిక ఆధారం 6
5. **గాయత్రీ చిత్రావళి - 24 :** సద్గతి - జీవన్ముక్తి 10
6. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 24 :** దీక్షాభూమికి యాత్ర - 1 11
7. **యుగనిర్మాణ యోజన :** మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 17 15
8. **కుండలినీ మహావిజ్ఞానం-10 :** కుండలినీ వశీకరణ - బ్రహ్మీచేతన క్రియాకలాపం 18
9. **గాయత్రీ జయంతి ప్రత్యేకం :** గాయత్రి యొక్క దివ్యశక్తి 21
10. **మనం - మన ఆరోగ్యం :** సరియైన ఆహార విధానం ద్వారా పౌష్టికాహార లోపమును అధిగమించవచ్చును 24
11. **సాధనా విజ్ఞానం :** మూలబంధం, ఉడ్డియాన బంధం, జాలంధర బంధముల రహస్యం 27
12. **యజ్ఞ విజ్ఞానం :** అణువికిరణాల నియంత్రణ 29
13. **పరామనోవిజ్ఞానము ఇప్పుడు నిర్ధారించబడిన అంశము** 31
14. **శరీర విజ్ఞానం :** శబ్దశక్తితో నడుపబడుతున్న శరీరం 33
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మికత యొక్క ప్రథమ పాఠం కర్మయోగం-4 36
16. **నా వారితో నా మాట :** ఇచ్చే సంస్కృతి - దేవ సంస్కృతి 40
17. **స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 2** 42
18. **దేవసంస్కృతి విశ్వవిద్యాలయం** 45
19. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 50




## సద్గురు వాణి

### ఆనందప్రాప్తి

మీ ఇష్టాలను, కోరికలను, మనోభావాలను ఇతరులపై బలవంతంగా రుద్దవద్దు. నామాటే నెగ్గాలి అని అనుకోవడం నీ ఉదారత్వానికి గొడ్డలిపెట్టు. ఎదుటివారి ఆలోచనలను, వారి తర్కవితర్కాలను వారి దృష్టి కోణముతో పరిశీలించి వారు ఉన్న పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని, ఉదార మనస్సుతో వానిని అర్థం చేసుకుంటే అనేక కలహాలు వాటంతటవే తొలగిపోయి శాంతి నెలకొంటుంది.


## యుగశక్తి గాయత్రి

**చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ

ఖాతాపేరు : **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 50/- చందాకు అదనంగా పంప ప్రార్థన. అట్లు పంపించని వారి చందాకాలము దామాషా పద్ధతిలో తగ్గించబడును. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ॥ **12/-** | **3** సం॥ చందా రూ॥ **350/-** |
| సం॥ చందా రూ॥ **120/-** | **10** సం॥ చందా రూ॥ **1116/-** |


**మీకు ఉన్న యోగ్యతను బట్టి విజయం మిమ్మల్ని వరిస్తుంది**

వేద మంత్రం

# సోమరితనాన్ని పారద్రోలాలి-2

త్రాతారో దేవా అధి వోచతా నో
మానో నిద్రా ఈశత మోత జల్పిః ।
వయం సోమస్య విశ్వహ ప్రియాసః
సువీరాసో విదథమా వదేమ ॥ *(ఋగ్వేద 8/48/14)*

**భావార్థం :** సోమరితనము, అనవసరమైన సంభాషణల నుండి తప్పించుకొనుటకు ఎల్లప్పుడూ చురుకుగా ఉండాలి. మనము దుర్గుణాల నుండి దూరంగా ఉందాము. శ్రేష్ఠ సంతానానికి జన్మనిద్దాము. అన్నిచోట్లా జ్ఞానము గురించిన చర్చయే జరగాలి.

**సందేశం :** అనేకమంది పని తక్కువ మాటలు ఎక్కువ' సిద్ధాంతం మీద నడుస్తుంటారు. తమోగుణము మనుష్యుని సోమరిగా ఉండమని ప్రేరేపిస్తుంది. ఈ దుర్గుణాలు అతని స్వభావంలో అంగములుగా మారుతాయి. సోమరిపోతు అప్రాకృతిక జీవితాన్ని జీవిస్తూ తనకే నష్టం కలుగ చేసుకుంటాడు. అజ్ఞానం, సోమరితనంలో ఉన్న వ్యక్తి చీకటిలో తిరుగుతుంటాడు. ఎదురు దెబ్బలు తిని, తన అసఫలతకు బాధ్యత ఇతరుల మీద మోపటానికి ప్రయత్నిస్తాడు. జ్ఞానులకు అతని జిత్తులు తెలిసిపోతాయి. పరమాత్మ దృష్టి నుండి ఎవరము తప్పించుకోలేము. ఆయన అతడిని మళ్ళీ మళ్ళీ హెచ్చరించినా తామసిక, రాజసిక ప్రవృత్తి వలన చెవులు, కళ్ళు పనిచేయవు. అతడేది వినడు, చూడడు. ప్రకృతి సందేశాన్ని గ్రహించే సామర్థ్యం అతనిలో వికసించదు. అతడు సోమరితనంలో అణచబడి, ఆత్మ వంచనలో మునిగి ఉంటాడు.

మనలను మనమే నిగ్రహించుకోవాలి. ఆహారం, నిద్ర, విశ్రాంతి విషయంలో తగిన నియంత్రణ ఉండాలి. అవి మన మీద పెత్తనం చేయనివ్వకూడదు. అలా చేయగలిగితే మనం శ్రేష్ఠులమవుతాం. నలువైపులా మాధుర్యం, స్వచ్ఛత, నిరాడంబరత, సజ్జనత్వపు వాతావరణం ఉత్పన్నం చేయగలుగుతాం. మనం సమయ సంయమనం నేర్చుకొంటే అన్ని పనులు చేసిన తర్వాత కూడా ఎంతో సమయం మిగిలే ఉంటుంది. దానిని మనం సమాజంలోని దురాచారాల నిర్మూలనకు వినియోగించవచ్చు.

మనం, మన పిల్లలు, స్నేహితులు, ఆశ్రితులకు సోమరితనం నుండి దూరంగా ఉండటం నేర్పాలి. శ్రమశీలుడు, సంయమనం ఉన్న వ్యక్తిని ఆదర్శంగా చూపించాలి. బాల్యం నుండి సద్గుణాల బీజారోపణ చేయాలి. ఇది ఒకరోజులో అయ్యేది కాదు. నిరంతర ప్రయత్నం కావాలి. పిల్లల మనస్సు త్వరగా దోష దుర్గుణాల ప్రలోభంలో చిక్కుకుంటుంది. వారిలో దుర్గుణాలే ఉత్పన్నం కాకుండా పూర్తి జాగరూకత వహించాలి. ఒక మంచి రైతు పొలంలోని గడ్డిని తొలగించుటలో తీసుకొనేంత జాగ్రత్త తీసుకోవాలి. దుర్గుణాలను ప్రారంభంలోనే తొలగించి వ్యాపించకుండా, పెరగకుండా తగిన శ్రద్ధ వహించాలి. పిల్లలను ఎల్లప్పుడూ సత్కర్మలలో ప్రేరేపిస్తూ, వారు సృజనాత్మక కార్యకలాపాలలో నిమగ్నమయ్యేటట్లు చేయాలి. దానివలన సమాజంలో ఒక శ్రేష్ఠపౌరుడిగా యశస్సును పొందగలుగుతాడు. సంతానం మంచి సంస్కారవంతులగుటకు, సచ్చరిత్రులగుటకు తల్లిదండ్రులు తమ సుఖసౌకర్యాలను త్యాగం చేయవలసి వస్తుంది. దోష-దుర్గుణాలను మన ఆచరణ ద్వారా తొలగించుకొని ఒక ఆదర్శాన్ని నెలకొల్పాలి. ఇదే వేదము యొక్క సందేశం.

సోమరితనం, పోసుకోలు కబుర్ల నుండి ఎల్లప్పుడూ దూరంగా ఉండాలి.

★★★

## పండుగలు

**జూన్ 2014**

**08-06-2014 గాయత్రీ జయంతి**

**13-06-2014 కబీర్‌దాస్ జయంతి**

**జులై 2014**

**12-07-2014 గురుపౌర్ణిమ**

**"నాకు అన్నీ తెలుసు" అని అనుకుంటుంటే ఎదగటం ఆగిపోతుంది**



గాయత్రీ విద్య-45

# గాయత్రీ సాధన యొక్క వైజ్ఞానిక ఆధారం

భగవంతునికి అనంతమైన శక్తులు ఉన్నాయి. అందులో కొన్ని మనకు అనుకూలమైనవిగా, మరికొన్ని ప్రతికూలమైనవిగా ఉంటాయి. భగవంతుడు సింహమును, పులిని సృష్టించాడు. అలాగే గోవును, గుఱ్ఱమును కూడా సృజించినాడు. సృష్టిలో సింహము, పులులకు కూడా ఉపయోగమున్నది. కానీ అవి మనిషికి వ్యతిరేకముగానే ఉంటాయి. సహస్ర పశు జాతులలో కేవలము గోవు మాత్రమే అన్నింటికన్నా ఎక్కువగా ఉపయోగకరమైనది అని నిరూపించబడినది. వృక్ష-వనస్పతులను కూడా భగవంతుడే సృష్టించాడు. అయితే అందులో కొన్ని విషపూరితమైనవి, కంటకప్రాయమైనవి, కష్టదాయకమైనవి అగుటవలన అవి మనిషికి ప్రతికూలమైనవి. ఫలములు, ధాన్యము, పూలతోట, ఔషధగుణములున్న మొక్కలు మనిషికి ఉపయోగకరమైనవిగా ఉంటాయి. మానవులు వాటిని ఎంతో జాగ్రత్తగా పెంచి పోషిస్తుంటారు.

ఈశ్వరుడికి ఉన్న లెక్కలేనన్ని అదృశ్య దైవీశక్తులలో మనకు ఉపయోగపడనివి ఎన్నో ఉన్నాయి. భూకంపము, పిడుగులు పడటం, విస్ఫోటనము, యుద్ధము, మహమ్మారి, దుర్భిక్షము, అతివృష్టి, వేడి, అగ్నికాండ, సంహారము, అలాగే మిడతలు, ఎలుకలు మొదలగు అనేక జంతువుల ద్వారా సృష్టికి మరో ప్రయోజనమేదో పూర్తవ్వవచ్చునేమోకాని, వాటివలన మనిషికి కష్టనష్టములే ఎదురవుతాయి. కానీ ప్రకృతి వీటన్నింటిని సృజించింది. మానవుడి సృష్టికి, సుఖశాంతులకు దోహదపడే శక్తులే అతనికి ఉపయోగకరమైనవి. సూర్యుడుకూడా శక్తుల భాండాగారమే! వైజ్ఞానికులు సూర్యకిరణములను గురించి విశ్లేషణ చేసి, వాటిలో ప్రాణాంతకమైన 'మృత్యుకిరణములు' ఉన్నాయని కనుగొన్నారు. కానీ మనిషి పృథ్విపై మనుగడ చేయటానికి కారణం సూర్యుని నుండి వెలువడుతున్న వెలుగు, వేడియే.

ప్రపంచములో ఉన్నవన్నీ మనకు మేలు చేకూర్చేవి కావు. మనకు లాభమును కలిగించేవాటిని మనమే వెతికి పట్టుకోవాలి, పరిశోధనలు చేసి కనిపెట్టాలి. ప్రయత్నపూర్వకముగా వాటిని ఎక్కువ మోతాదులో ప్రాప్తింపజేసుకుని, ఉపయోగించుకోవాలి. అప్పుడే మనము భగవంతుడు సృజించిన లెక్కలేనన్ని వస్తువుల నుండి సుఖశాంతులను పొందగలిగే సామర్థ్యమును పొంద గలము. ఆవు, గుఱ్ఱం, ధాన్యం, ఫలములు, ఔషధములు, పత్తిచెట్టు, ఖనిజపదార్థములు, ధాతువులు, రత్నములు మొదలగువాటిని పొందటానికి మనిషి నిరంతరము ప్రయత్నములు సాగించి వాటిద్వారా సుఖశాంతులకు అధికారి కాగలిగాడు. ఒకవేళ మనిషి వాటిని ఉపేక్షించినా లేక హానిని కలిగించే వస్తువులను గురించి తప్పుగా అర్థము చేసుకున్నా దుఃఖము, దుర్భాగ్యము, సంకటము మరియు నాశనము తప్ప మరేదీ మిగిలేదికాదు.

ప్రపంచము స్థూలము, సూక్ష్మము అని రెండు రకములుగా విభజించబడి ఉన్నది. ప్రత్యక్షముగా కళ్ళకు కనిపించేవి స్థూలపదార్థములు. కంటికి కనిపించకపోయినప్పటికీ తమ ఉనికిని కలిగి ఉండేవి సూక్ష్మ పదార్థములు. చలి, వేడి, గాలి, ఈథర్, శబ్దము, విద్యుత్తు, పరమాణువులు, రోగకారక క్రిములు, రేడియో తరంగములు మొదలగునవి అదృశ్యముగా ఉన్నప్పటికీ, చూడగలిగేవాటితో సమానముగానే అస్థిత్వమును కలిగి ఉన్నాయి. మరణము తరువాత ఆత్మ శరీరమునుండి వెడలిపోతుంది. అయినా అది అదృశ్య రూపములో అస్తిత్వమును కలిగి ఉంటుంది.

భగవంతునికి చెందిన అనేకానేక అదృశ్యశక్తులు ఉన్నాయి. యోగశాస్త్రమును మరియు ఆత్మవిద్యను వైజ్ఞానికముగా బోధించే ఆచార్యులు తమ సూక్ష్మమైన దివ్యదృష్టితో వాటన్నింటిని దర్శించి అవగతము చేసుకున్నారు. గుణముల ఆధారముగా వాటికి నామరూపములను స్థిరపరచినారు. వాటి పేరే 'దేవతలు!' భగవంతుని యొక్క ధనశక్తిని 'లక్ష్మి' అని; బుద్ధినిచ్చే శక్తిని 'సరస్వతి' అని; యుద్ధము చేసే శక్తిని 'దుర్గ' అని; ఉత్పాదకశక్తిని 'బ్రహ్మ' అని; పాలనాశక్తిని 'విష్ణువు' అని; సంహారకశక్తిని 'శివుడు' అని; బలశక్తిని 'హనుమంతుడు' అని;

**విద్యార్థిగా ఉంటేనే నిరంతరం నేర్చుకోవచ్చు**

సిద్ధినిచ్చే శక్తిని 'గణేశుడు' అని; శాసనశక్తిని 'ఇంద్రుడు' అని అంటారు. మనకు లాభము కలిగించేవి, గ్రహించటానికి తగినవిగా ఉన్నవాటితో సంబంధమును ఏర్పరచుని, వాటిని అత్యంత సమీపమునకు ఆకర్షించి లాభమును పొందేందుకు చేసే ప్రయత్నము పేరే 'దేవతోపాసన!'

పశువులన్నింటిలో గోమాత, సమస్త నదులలో గంగానది, ఔషధీయ మొక్కలలో తులసి మనకు విశేష లాభమును కలుగజేస్తాయి. అలాగే భగవంతుని గుప్తదైవీశక్తులలో గాయత్రీ శక్తి మానవజాతికి అన్నింటికంటే ఎక్కువ ఉపయోగకరమైనది. సాత్వికత, శాంతి, ఆనందం అనే ప్రధాన అంశములను కలిగిన జ్ఞానమయమైన అదృశ్య చేతనత్వమే గాయత్రి. గాయత్రి 'త్రిపదా' అని చెప్పబడుతుంది. హ్రీం అనగా జ్ఞానము, బుద్ధి, వివేకము, ప్రేమ, సంయమము, సదాచారము. శ్రీం అనగా ధనము, వైభవము, పదవి, ప్రతిష్ఠ, భోగము, ఐశ్వర్యము. క్లీం అనగా ఆరోగ్యము, బలము, సాహసము, పరాక్రమము, తేజస్సు, పురుషార్థము. ఈ మూడు విశేషతలు కలిగిన త్రిగుణాత్మక ఈశ్వరీయ శక్తే గాయత్రి. ఈ మూడు తత్వములే మానవునికి అత్యంత ఉపయోగకరమైనవి మరియు ఆవశ్యకమైనవి. అందువలన శ్వాసపీల్చుట, అన్నపానాదులను స్వీకరించుట, శుభ్రత, స్నానము చేయుట, నిద్రించుట వంటి నిత్యకర్మలు ఎంత ఆవశ్యకమో, గాయత్రీ ఉపాసన కూడా అంతే ఆవశ్యకమైన నిత్యకర్మ అని ఋషులు నిర్ధారించారు. నిత్య నైమిత్తికకర్మల వలన శరీర సంరక్షణ, వృద్ధి జరుగుతుంది. గాయత్రీ ఉపాసనతో ఆత్మబల రక్షణ మరియు అభివృద్ధి అనే లాభము ఒనగూడుతుంది.

శారీరిక పరిపుష్టి, గొప్పబలము, అపరిమిత తేజస్సు, సామర్థ్యము, ఆరోగ్యము చేకూరినచో, ఆ శారీరిక బలము ఆసరాతో అనేకరకములైన లాభములను పొందవచ్చును. శత్రువులను అణచుట, బాగా కష్టపడి పనిచేసి ధనమును సంపాదించుట, సుదూర యాత్రలను చేయుట, రోగముల నుండి రక్షింపబడుట, దీర్ఘాయువును కలిగి ఉండుట, అందమైన శరీరమును పొందుట, పరిపూర్ణముగా ఇంద్రియభోగములను అనుభవించుట, ఎవరి మీదా ఆధారపడకుండా జీవించుట మొదలైన వాటన్నింటిని శారీరిక బలము ద్వారా మనిషి పొందగలడు. ఆరోగ్యము చేజార్చుకున్నవారిని, నిత్యం శారీరిక బాధలతో అల్లాడేవారిని, అశాంతి, హాని, అపజయములనే దురదృష్టములు వరించినప్పుడు నిరాశకు గురైనవారిని చూసి శారీరిక బలము ద్వారా వచ్చిన లాభములు ఎంత గొప్పవో అని మనిషి స్పష్టముగా అర్థము చేసుకొనగలడు. శారీరిక బలము కంటే ఆత్మబలము మరెంతో అధిక మహత్వపూర్ణమైనది. మరెన్నో రెట్లు గొప్పది. ఆ లాభములను లెక్కించలేము. మానవ జీవితములో ఎన్ని సుఖదుఃఖములున్నాయో, వాటిలో 3/4 మానసికమైనవి, 1/4 శారీరకమైనవి. భార్య, పుత్రుడు, మిత్రుడు, బలము, యశస్సు, పదవి, ప్రతిష్ఠ, నాయకత్వము, వైభవము మొదలైన సుఖములన్నీ వాస్తవానికి మానసిక సుఖములు. వీటివలన శరీరమునకు ప్రత్యక్షముగా ఏ లాభము ఉండదు. ఈవిధముగానే శోకము, వియోగము, హాని, భయము, చింత, తృష్ణ, అవమానము, పరాజయము, అసఫలత మొదలగు దుఃఖములన్నీకూడా మానసికమైనవే. శరీరము ఆరోగ్యముగా ఉన్నప్పటికీ ఈ రోగములన్నీ మనస్సును ఆవరించి ఉండవచ్చును. **ఆత్మబలము వృద్ధి చెందితే మానసిక సుఖములు వృద్ధిచెంది, దుఃఖములు తగ్గుముఖము పట్టే క్రమము కొనసాగుతుంది.** తత్ఫలితముగా గాయత్రీ సాధన ద్వారా ఆత్మబలమును వృద్ధిచేసుకునే మనిషి అనాయాసముగానే దుఃఖములనుండి బయటపడి, సుఖశాంతులను పొందే దిశగా ముందడుగు వేస్తుంటాడు.

స్థూలవస్తువుల సహాయముతో స్థూలవస్తువులను పట్టుకునే పద్ధతి అందరికీ తెలిసినదే. చేతితో కలమును పట్టుకోవడం, కాళ్ళను చెప్పులలో దూర్చడము, అగ్గిపుల్లతో నిప్పు రాజేయటము, శ్రమించి డబ్బును సంపాదించటము, డబ్బుతో వస్తువులను కొనటము వంటి విషయములు అందరికీ తెలుసు. కానీ అదృశ్య సూక్ష్మశక్తులను ఎవరి ద్వారా, ఏరకముగా ఒడిసిపట్టుకొని, తన లాభము కొరకు ఏవిధముగా ఉపయోగించుకోవాలి అనే జ్ఞానము చాలా కొద్దిమంది మనుష్యులకే ఉంటుంది. వైజ్ఞానిక ఆవిష్కారములకు ముందు కూడా విద్యుత్తు, ఆవిరి, గ్యాస్, పరమాణువువంటి శక్తులు ఉన్నాయి కానీ, వాటిని అందిపుచ్చుకొని ఉపయోగములోకి తెచ్చుకునే జ్ఞానము మనుషులకు లేదు. తత్ఫలితముగా వాటి లాభముల నుండి వంచితులయ్యారు. వైజ్ఞానికులు ఏ క్రొత్త శక్తినీ సృష్టించలేదు, కేవలము ప్రకృతిలో ఉన్నవాటి ద్వారా లాభమును పొందగలిగే

**ఏమి తెలియనప్పుడు అన్నీ తెలుసనుకుంటుంటారు**

పద్ధతిని ఆవిష్కరించారు. తత్ఫలితముగా మానవులు ఈనాడు సర్వత్రా ఆ ఆవిష్కారములనుండి లాభమును పొందుతున్నారు. ఆవిరి, విద్యుత్తు, గ్యాస్, అణుశక్తివంటి సూక్ష్మశక్తుల కన్నా దైవీశక్తులు మరింత సూక్ష్మమైనవి అయిన కారణముగా వాటిని యంత్రముల ద్వారా పట్టుకొనలేము, గ్రహించలేము. అయినా కూడా కొన్ని పద్ధతుల ద్వారా వాటిని పట్టుకొనగలము, వాటి ద్వారా లాభాన్వితులవగలము. పూజనీయులైన మన పూర్వీకులు యుగయుగాలపాటు నిరంతరము తీవ్ర ప్రయత్నములు చేసిన పిమ్మట ఆధ్యాత్మికవిద్య, యోగసాధనలు వంటి వైజ్ఞానిక పద్ధతులను ఆవిష్కరించారు.

ఆత్మకు, సూక్ష్మశక్తులకు మధ్య సామ్యం, ఆకర్షణ ఉత్పన్నమయ్యే విశేష పరిస్థితులను కల్పించినచో, వాటిని పట్టుకొనుట సంభవమవుతుంది. ఆత్మవిద్యను వైజ్ఞానిక పద్ధతిలో బోధించే అనేకమంది ఋషులు వేల సంవత్సరముల పాటు నిరంతరము తీవ్ర ప్రయత్నము, అధ్యయనము చేశారు. చివరకు వారికి ఫలితము లభించినది. మన ఆంతరిక శక్తిని ఎలాంటి యోగ్యతలు, విశేషతలతో నింపాలంటే, ఏ దైవీశక్తితో సంబంధము స్థాపించుకోవాలో, దానికి అనుకూలముగా మారి, దానిని మన ఆకర్షణశక్తిద్వారా పట్టుకొనగలిగే పద్ధతిని ఆవిష్కరించగలిగారు ఋషులు. మైనము నూనెలో కలవదు, కానీ మైనమును నిప్పుమీద కరిగించినప్పుడు మాత్రము అది నూనెలో కలసిపోతుంది. ఈ రీతిలోనే సూక్ష్మదైవీశక్తులు సాధారణముగా అందరికీ ప్రాప్తించవు, అయితే సాధన ద్వారా అంతరంగమును దైవీశక్తులకు అనుకూలముగా మలచుకుంటే కనుక అవి ఆత్మలో కలసిపోతాయి. ఈ క్రియను, పద్ధతిని ఆధ్యాత్మికభాషలో 'సాధన' అని పిలుస్తారు.

యోగమహావిజ్ఞానము ఆధారముగా ఇప్పటివరకు అసంఖ్యాకమైన వ్యక్తులు ఈశ్వరుని నుండి అభీష్ట శక్తులను ప్రాప్తింపజేసుకునేందుకు యోగ్యమైన విధముగా తమ ఆత్మ నిర్మాణమును కావించుకున్నారు. అనేకమంది సాధకులు భిన్నమైన దేవతలకు చెందిన విభిన్నమైన విధానముల ద్వారా సాధన చేసి వేర్వేరు వరములను పొందారు. మన ప్రాచీనకాలపు పురాణసాహిత్యములో ఇలా వరములు పొందినవారి వర్ణనలు చాలా లభిస్తాయి. ఆ సాధకులందరు ఈశ్వరుని నుండి తమ అభీష్టశక్తులను పొందేందుకుగాను సాధన ద్వారా అంతరంగమును తదనుగుణ్యమైన రీతిలో మలచుకుని, దానినుండి లాభమును పొందారు అని దీని అర్థము. గాయత్రీ సాధన వైజ్ఞానికమైనది. ఆ పద్ధతి ద్వారా ఈశ్వరునికి చెందిన హ్రీం-శ్రీం-క్లీం అనగా జ్ఞానము, వైభవము, బలముల సమ్మిళిత శక్తిని ఆకర్షించుకొని తనలో ధారణ చేసుకొనవచ్చును. గాయత్రీ సాధన ద్వారా జీవితములో అనేక మానసికమైన, ప్రాపంచికమైన ఆనందములను పొందవచ్చును.

స్థూలదృష్టితో చూసినప్పుడు గాయత్రీ సాధనలు సామాన్యమైనవిగా అనిపిస్తాయి. వీటిద్వారా ఏ రీతిలో ఏ లాభము కలుగుతుంది అన్న విషయము సాధారణముగా అర్థము కాదు. కానీ లభించిన పరిణామములను చూసి ఇందులో తప్పకుండా ఏదో ఒక తథ్యమున్నది అన్న విషయము అవశ్యము అంగీకరించవలసి ఉంటుంది. ఉచ్చరించినంత మాత్రముననే నాలుక, నోరు, కంఠము, అంగిలికి సంబంధించిన నరములు ఒక క్రమమైన పద్ధతిలో స్పందించి, తత్కారణముగా శరీరములోని విభిన్న భాగములలో నెలకొని ఉన్న యోగ సంబంధితమైన లఘుచక్రములు జాగృతమయ్యే రీతిలో గాయత్రీ మంత్రాక్షరములను కూర్చటం జరిగినది. కుండలినీ జాగరణ కొరకు షట్చక్రములను జాగృతము చేసి దివ్యశక్తులను పొందినట్లే, గాయత్రీమంత్రమును ఉచ్చరించినంత మాత్రముననే ఈ లఘుగ్రంథులు జాగృతమై ఆశాజనకమైన పరిణామములను ఉత్పన్నము అయ్యేటట్లు చేసుకొనవచ్చును.

శరీరములోని ఏయే భాగములలో ఏయే రహస్య గ్రంథులున్నాయి? గాయత్రీ మంత్రములోని ఏయే అక్షరములను ఉచ్చరించుట చేత శరీరమములోని ఏయే గ్రంథులు జాగృతమవుతాయి, ఆ గ్రంథిచక్రములు జాగృతమగుట వలన మనకు ఏయే శారీరక, మానసిక శక్తులు ప్రాప్తిస్తాయి అన్న విషయములను ఇక్కడ ప్రస్తావించలేము. కానీ ఋషులు చాలా రహస్యమైన రీతిలో గాయత్రీమంత్రాక్షరములను కూర్చారు అన్న విషయమును ఇక్కడ చెప్పగలము. గాయత్రీ మంత్రాక్షరములను పలుకుట వలన శరీరము లోలోపల కొన్ని సూక్ష్మప్రక్రియలు జరుగుతాయి. తత్కారణముగా మన అంతర్ భూమిక ఈశ్వరుని యొక్క గాయత్రీ శక్తిని అతి తేలికగా ఆకర్షించి తనలో ధారణ చేసుకొనగలిగే సంపూర్ణమైన గురుత్వాకర్షణ శక్తితో నిండిపోతుంది.

**నేర్చుకోవడం మొదలుపెట్టాక మనకు ఏమీ తెలియదని తెలుస్తుంది**

సృష్ట్యాదినుండి ఇప్పటివరకు లెక్కలేనంతమంది మహనీయులు గాయత్రీ సాధన చేశారు. ఎంతోమంది మహా పురుషులు అత్యధిక కాలముపాటు తమ యొక్క అపరిమితమైన మనోబలముతో చేసిన గాయత్రీమంత్రము యొక్క శక్తి ఒకచోట ప్రోదిచెంది ఉన్న కారణముగా అది అత్యంత ప్రభావవంతంగా రూపొందినది అన్న విషయమును ఆలోచనల యొక్క శక్తి గురించి తెలిసిన విద్యావేత్తలందరు సహజముగానే తెలుసుకొన గలరు. ఆలోచనలు నశించవు, ఆలోచనా మేఘములు ఆకాశములో నలుదిశలా తిరుగాడుతూ ఉంటాయి. ఆ ఆలోచనా మేఘమాలికలు తమ వంటి ఆలోచనాశైలి కలిగిన ఇతర మేఘముల సముదాయము లను కలసినప్పుడు, వాటితో ఏకత్రితమై, అనుకూల పరిస్థితులు ఏర్పడినప్పుడు తమకై తామే వర్షిస్తాయి. దీనివలన మంచి-చెడు అనే ఆలోచనలకు అదృశ్య రూపములో బలము చేకూరుతుంది. నూతన గాయత్రీసాధకుని మీద పూర్వకాలపు గాయత్రీ సాధకుల ఆలోచనా మేఘములు వర్షిస్తాయి, అతను శీఘ్రముగా సఫలతవైపు సాగిపోగలుగుతాడు.

వివిధ రేడియో స్టేషన్‌ల ద్వారా విభిన్న కార్యక్రమాలు ప్రతి నిముషం ప్రసారితమవుతూ ఉంటాయి. అయితే రేడియో ఉన్నచోట మాత్రమే మనకు అవి వినిపిస్తాయి. ఆ రేడియోలో కూడా ఏ సంఖ్యమీద ముల్లు ఉంటుందో ఆ స్టేషన్ కార్యక్రమాలే వినిపిస్తాయి. ఈశ్వరుని అనేక శక్తులు పలు కేంద్రముల నుండి ప్రసరించబడుతు సర్వత్రా వ్యాపిస్తూ ఉంటాయి. కానీ సాధన ద్వారా తమను తాము రేడియోవలె మార్చుకున్న సాధకులే ఆ శక్తులను గ్రహించగలరు. రేడియోలో కావలసిన కార్యక్రమమును ప్రసారము చేయగలిగే సంఖ్య మీద ముల్లును నిలిపినట్లుగా; ఏ దైవీశక్తిని పొందాలనుకుంటే ఆ దేవతయొక్క విశేష సాధన చెయ్యవలసి ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా ఈశ్వరుని మహాశక్తి సాగరము నుండి, విపుల వైభవము నుండి మనము మనకు ఆవశ్యకమైన శక్తులను మరియు సంపదలను పొందగలము. భగవంతుని యొక్క అక్షయ భాండాగారములో ఏ వస్తువుకు కొదవ లేదు. ఈశ్వరుని అమర యువరాజైన మనిషికి తన తండ్రికి చెందిన ప్రతి వస్తువుమీదా సంపూర్ణమైన అధికారమున్నది. కాకపోతే మనము మన పాత్రతను సిద్ధింపజేసుకోవాలి. పురుషార్థము, శ్రమ, నిరంతర ప్రయత్నము మరియు సాధన ద్వారా మనము మన అభీష్టవస్తువులను పొందగలిగిన అధికారము కలిగి ఉన్నట్లయితే కనుక మనకు సంతోషకరమైన సుఖశాంతులు ప్రాప్తించకుండా ఉండవు అని నిరూపించాలి.

అత్యంత గొప్పదైన గాయత్రీసాధన ఆధ్యాత్మిక మహావిద్యకు చెందిన వైజ్ఞానిక పద్ధతిమీద ఆధారపడిన ఒక మహత్వపూర్ణమైన ప్రక్రియ. శ్రద్ధతో, విశ్వాసముతో ఈ సాధనను చేసినచో ఆశాజనకమైన సత్పరిణామములు ఎల్లప్పుడూ లభిస్తాయి.

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 14 (3.1) నుండి*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## రామ్‌దేవ్


*ఆ రోజుల్లో అనేకమైన చిన్న చిన్న రాజ్యాలుండేవి. ఢిల్లీ సమీపంలోని ఒక చిన్న రాజ్యంలో ఆనంద్‌పాల్ రాజుగా ఉండేవాడు. కొన్ని కారణాల వలన ఈయన ఉత్తరాధికారిగా 15 సం॥ల రామ్‌దేవ్ అనే బాలునికి బాధ్యతను అప్పగించడం జరిగింది. సరిగ్గా ఆ సమయములో ఆ ప్రాంతమంతా అత్యాచారాలు చేసే దుండగులతో భయంకరమైన పరిస్థితులు చుట్టుముట్టాయి. రామ్‌దేవ్ ప్రజలకు దుండగుల భయం లేకుండా చేయటం తన ప్రథమ కర్తవ్యంగా భావించి సైన్యాన్ని వెంట పెట్టుకొని వెళ్ళి, సాహసంతో దుండగుల సమూహాన్ని చుట్టుముట్టి మట్టు బెట్టాడు. ఈ 15 సం॥ల బాలుడు కోశాగారంలోని ధనాన్ని యావత్తు ప్రజాహిత కార్యక్రమాలకు ఖర్చుచేసి, తానొక సాధారణ రైతులాగా, నాగలి పట్టి క్షామ పీడిత ప్రాంతాలలో పొలం దున్నటం, నూతులు త్రవ్వటం, స్వయంగా నిర్వహించేవాడు. రాజు-ప్రజల మధ్యగల గాఢమైన మైత్రికి ఆశ్చర్యచకితులైన ముసల్మానులు వీరిపై దండెత్తడానికి సాహసించేవారు కాదు. రామ్‌దేవ్ యొక్క చరిత్ర నిష్ఠ, ఔదార్యం పట్ల ఆనందపరవశులైన ప్రజలు ఇతన్ని దైవంగా భావించి ఈయన కోసం ఒక మందిరాన్ని నిర్మించి, ప్రతి సంవత్సరం ఆలయం దగ్గర ఉత్సవాలు జరుపుతుంటారు.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఎదుటివారికి మంచిని పంచితే నీకు మంచే వస్తుంది**

గాయత్రీ చిత్రావళి - 24

# సద్గతి-జీవన్ముక్తి




ఆత్మను పరమాత్మతో కలుపుట, సన్నిహితము చేయుటయే యోగం యొక్క ఉద్దేశ్యము. పరమాత్మ నుండి విడవడిన ఆత్మ ఎప్పటివరకైతే ఉద్గమ (పుట్టినచోటు) కేంద్రం చేరుకోదో అప్పటి వరకు, తల్లికి దూరమైన పిల్లవాడివలె దుఃఖిస్తూ అశాంతితో ఉంటుంది. జీవి జనన-మరణ చక్రములో 84 లక్షల యోనులలో తిరుగుతూ ఉంటాడు. నానావిధ కష్టాలు సహిస్తూ, వాసన, కోర్కెల సంస్కారములతో బంధించబడి అరగదీయ బడుతూ ఉంటాడు.

ఈ దుర్భర పరిస్థితి నుండి రక్షించుకొనేందుకు ఆధ్యాత్మిక సాధనా మార్గమున్నది. యోగులు ప్రపంచాన్ని త్యజించి, అత్యంత కష్టసాధ్య తపశ్చర్యలు చేసి దానితో భవబంధనాలు నుండి విముక్తులై పరమాత్మను పొందగలుగుతారు. సత్సంగం, స్వాధ్యాయం, పురాణశ్రవణం, జపం, యజ్ఞం, తీర్థం, దానం మొదలైన వాటి ప్రధాన ఉద్దేశ్యము బంధనముల నుండి విముక్తి పొంది తన ఉద్గమ కేంద్రమైన పరమాత్మ సాక్షాత్కారము చేసుకొని, దానిలో విలీనమగుటయే. ఇదియే జీవితం యొక్క పరమలక్ష్యం. ముక్తియే అన్నింటికంటే గొప్ప పురుషార్థంగా భావించబడింది. ఎవరికి ఈ సఫలత లభించిందో వారు జీవిత లాభాన్ని పొందగలిగారని, ధన్యులయ్యారని భావించాలి.

ఊర్ధ్వగతి కొరకు ఉన్న సాధనలన్నింటిలో గాయత్రీ ఉపాసన సర్వశ్రేష్ఠమైనది. ఏ విధంగా ముడుచుకొని ఉన్న మొగ్గ సూర్యుని ఉష్ణతను పొంది వికసిస్తుందో, కొద్దికాలంలో సువికసిత పుష్పంగా మారుతుందో, అదే విధంగా ఆత్మబంధనం కూడా గాయత్రితో తనంతట తాను విడిపోతుంది. అంతః భూమిక వికసించి కొద్ది సమయంలోనే పరమహంసగతి, సిద్ధావస్థ సమాధి, ఆత్మ సాక్షాత్కారము, బంధనముక్తి, ఈశ్వరప్రాప్తి, బ్రహ్మనిర్వాణం, పరమానందం అని అనదగిన స్థితికి చేరుకొంటుంది.

ఆమ్రపాలి, అజామిళుడు, హిరణ్యకశిపుడు మొదలైన దుష్టులు ఉద్ధరించబడ్డారు. శబరి, అహల్య, ద్రౌపది, బృంద మొదలైన స్త్రీలు; జటాయువు, గుహుడు, నరసీ మెహతా వంటి సాధారణ వ్యక్తులు సద్గతిని పొందారు. కొద్దిపాటి అభ్యాసము తోనే జీవి తరించేటటువంటి భగవంతుని కృప గాయత్రీమాత అనుగ్రహంతో ప్రాప్తిస్తుంది.

*- అనువాదం : డా॥ తుమ్మూరి*

**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**


**చదివించండి !!**

**మాటలను సందేహించడం, చేతలను విశ్వసించడం మానవ సహజం**

# దీక్షా భూమికి యాత్ర-1

1930 ఆగస్టు 15 ఉదయం సంధ్యా వందనం ముగించుకుని, శ్రీరామ్ తల్లిగారికి ప్రణామం చేయడానికి వెళ్ళాడు. తాఈజీ బయట ఎవరికో పనులు పురమాయిస్తున్నారు. ప్రణామం చేసి శ్రీరామ్ నించున్నాడు. తన చిరంజీవి ఏదో చెప్పదలచు కున్నాడని ఆమె గ్రహించింది. ఆ వచ్చిన వ్యక్తితో సంభాషణ త్వరత్వరగా ముగించి కుమారుడిని తీసుకుని లోపలికి వచ్చింది. విషయం ఏమిటని అడిగింది. కొద్ది సంకోచంతో, కొద్ది పట్టుదలతో శ్రీరామ్ ఇలా అడిగాడు. "సరిగ్గా సమయానికి తిరిగి వస్తానని మాట ఇస్తే, కాశీ వెళ్ళి నెల రోజులు ఉండడానికి అనుమతి ఇస్తావా?"

ఈ ధోరణిని, ఈ పట్టును చూచి, తాఈజీ మంత్రముగ్ధురాలు అయింది. పెద్దగా ఆలోచించ కుండా ఆమె అనుమతి ఇచ్చింది. ఆ కాలంలో ఆగస్టు 15కు ఇప్పటి ప్రాముఖ్యం లేదు. జనవరి 26న లాహోరు మహాసభలో పండిత జవహర్ లాల్ నెహ్రూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఆ రోజుని స్వాతంత్ర్యదినంగా జరపాలని ప్రకటించారు. అయితే, ఆధ్యాత్మిక రంగంలో పనిచేసేవారికి ఆగస్టు 15 మరో కారణంవల్ల ప్రాముఖ్యం సంతరించుకుంది. అప్పటికి నాలుగు సంవత్సరాల క్రితం మహాయోగి శ్రీఅరవిందులు నవంబరు 26ను సిద్ధిదినంగా ప్రకటించారు. ఆ రోజున భగవత్ చేతన పృథ్విపై అవతరించింది. శ్రీ అరవిందులు ఆ చేతనకు అతిమానసం (సూపర్‌మైండ్) అని పేరు పెట్టారు. మనస్సుకు, బుద్ధికి అతీతమైన ప్రాణమయ సత్తాకు ప్రాతినిధ్యం వహించేది, సత్తాలోని విశిష్టతలు కలిగిన వ్యక్తిత్వం యొక్క ఆవిర్భావం అతిమానసం (సూపర్‌మైండ్) అని క్లుప్తంగా చెప్పవచ్చు. ఆ సంవత్సరమే శ్రీరామ్ ఈ పురశ్చరణ సాధనను ప్రారంభించాడు. ఆగస్టు 15 ఆ మహాయోగి జన్మదినం. సిద్ధి దినం తర్వాత ఆయన ప్రజలను కలుసుకోవడం నిలిపివేశారు. శ్రీ అరవిందుల జీవితం, ఆయన భవిష్య పథకాలు శ్రీరామ్‌కు బాగా పరిచితమైనవే. హిందీలో లభించిన అరవిందుల సాహిత్యాన్ని శ్రీరామ్ చదివాడు.



### కాశీ యాత్రకు అనుమతి

కాశీ వెళ్ళడానికి అనుమతి లభించగానే, శ్రీరామ్ అందుకు సన్నాహాలు ప్రారంభించాడు. సన్నాహాలకు పెద్దగా అనుభవం లేదు. శ్రీరామ్ తండ్రిగారు భాగవత పురాణాల కోసం, సప్తాహాల కోసం క్రమబద్ధంగా యాత్రలు చేసేవారు. తాఈజీయే ఆ యాత్రలకు సన్నాహాలు చేసేది. అందువలన ఆమెకు మంచి అనుభవం ఉన్నది. నెల రోజులకు సరిపడా దుస్తులు, పక్క బట్టలు, నిల్వ ఉండే ఆహారం, ధనం మున్నగు ఏర్పాట్లు ఆమే చేసారు. శ్రీరామ్ నాలుగైదు రోజులపాటు తన మిత్రులకు, సహచరులకు ఉద్యమం గురించి వివరిస్తూ వచ్చాడు. తాను వెళ్ళిన తర్వాత గ్రామంలో ఉద్యమం క్రియాశీలంగా కొనసాగడానికి ఏమేమి చేయాలో వారికి వివరించాడు. ప్రభాతభేరీ, ఊరేగింపు, క్రమబద్ధంగా ఉదయం వ్యాయామం చేయడం ఇవన్నీ కొనసాగించాలని శ్రీరామ్ వారికి నొక్కి చెప్పాడు. ఏదైనా క్రొత్త సంఘటన జరిగితే, ఊహించని పరిస్థితులు ఏర్పడితే – తమ కర్తవ్యాన్ని తక్షణం నిర్ణయించుకోవాలి; భారతమాత శిరస్సు గర్వంతో ఉన్నతంగా నిలవాలన్నది ఆ కర్తవ్య నిర్వహణకు గీటురాయి కావాలి – ఇదే శ్రీరామ్ వారికి చేసిన మార్గదర్శనం.

ఆగ్రాలోని పాలీవాల్‌జీ శ్రీరామ్ బసకు తగు ఏర్పాటు చేయవలసిందిగా ఆయన కాశీలోని దివ్యజ్ఞాన సమాజం (థియోసాఫికల్ సొసైటీ) కార్యకర్త శ్రీ గంగాబాబుకు ఉత్తరం వ్రాశారు. గంగాబాబు పూర్తిపేరు గంగాశరణ్ సింగ్. ఆయన థియోసాఫికల్ సొసైటీతో పాటు కాంగ్రెసు కార్యక్రమాలలో కూడా పాల్గొనేవారు. మిత్రుల, పరిచయస్థుల కోరికవల్ల ఈ పాల్గొనడం జరిగేది అయితే ఆయన అభిరుచి మాత్రం ఆధ్యాత్మిక రంగంలోనే ఉండేది. నెలరోజులు పూర్తికాగానే తిరిగిరమ్మని, ఆ తర్వాత అక్కడ ఉండవద్దని, ఆవల్‌ఖేడా వదలి వెళ్ళే

**మీరేమిటి అన్నది మీ చేతలలో తెలుస్తుంది**

ముందురోజున తాఈజీ హెచ్చరించింది. అంతకుముందు శ్రీరామ్ కాశీలో ఎక్కడ బస చేసేదీ, ఇతర ఏర్పాట్లు ఎలా ఉన్నవి అని ఆమె వివరంగా తెలుసుకున్నది.

19 సంవత్సరాల యువకుడు శ్రీరామ్ కాశీ రైలుస్టేషన్‌లో దిగగానే, పండాలు చుట్టుముట్టారు. ఆ పద్మ వ్యూహాన్ని ఛేదించుకుని, శ్రీరామ్ గంగాబాబు గృహానికి వెళ్ళడానికి బదులు విశ్రామ్‌ఘాట్‌వైపు వెళ్ళాడు. ఘాట్‌కు ముందే ఒక కుటీరం ఉంది. దాని తలుపు తెరచి ఉన్నది. లోపల కొందరు వ్యక్తులు కూర్చొని ఉన్నట్లు కనిపిస్తోంది. శ్రీరామ్ మనస్సు అతి సహజంగా ఆ ఇంటిలోకి వెళ్ళాలని ఉవ్విళ్ళూరింది. శ్రీరామ్ లోపలికి వెళ్ళాడు. అక్కడ కూర్చున్న వ్యక్తుల మధ్య దృఢ కాయుడైన ఒక సన్యాసి పద్మాసనంలో కూర్చొని ఉన్నారు. ఆయన పేరు స్వామి శుద్ధానంద అని, అనేక దశాబ్దాలుగా ఆయన అక్కడ నివసిస్తున్నారని అక్కడ కూర్చున్న వ్యక్తుల ద్వారా తెలిసింది. శ్రీరామ్ ఆయనకు ప్రణామం చేసి, ఇతర వ్యక్తులతోపాటు కూర్చున్నాడు. శ్రీరామ్ కూర్చొనగానే, స్వామి శుద్ధానంద దృష్టి ఆయనపై పడింది. ఆయన ఇలా అన్నారు. "వచ్చావా శ్రీరామ్! నీవు ముందు స్నానం చేసి రా. నీవు వచ్చేటప్పటికి గంగాబాబు కూడా ఇక్కడే కలుస్తారు."

గంగాబాబు గురించి కాని, తాను వచ్చిన పని గురించి కాని శ్రీరామ్ ఎవరికీ చెప్పలేదు. స్వామీజీ గంగాబాబును గురించి ప్రస్తావించేసరికి, శ్రీరామ్‌కు ఆశ్చర్యం కలిగింది. ఆ ఆశ్చర్యాన్ని కూడా స్వామీజీ పసికట్టారు. ఆయన ఇలా అన్నారు – "ఆశ్చర్యపడకు. గంగాబాబు ఇక్కడికి రోజూ వస్తూ ఉంటాడు. ఆయన వచ్చే సమయం ఇదే. నీవు స్నానం చేసేటప్పటికి ఆయన వచ్చేస్తాడు."

స్వామీజీ వ్యవహరణపట్ల ఆశ్చర్యపడడం మాని, శ్రీరామ్ స్నానానికి వెళ్ళాడు. అరగంట తర్వాత తిరిగివచ్చాడు. స్వామీజీ తమ స్థానంలో యథాప్రకారం కూర్చొని ఉన్నారు. ఆయన చుట్టూ వ్యక్తులు కూర్చొని ఉన్నారు. వారిలో పలువురు క్రొత్త వారు ఉన్నారు.

స్వామీజీ శ్రీరామ్‌ను చూసి, ప్రక్కనే కూర్చొని ఉన్న ఒక నడివయస్సు వ్యక్తితో, "గంగాబాబు! నీ అతిథి వచ్చాడు" అని అన్నాడు. గంగాబాబు శ్రీరామ్‌కు అభివాదం చేశాడు. శ్రీరామ్ కూడా ప్రత్యభివాదం చేశాడు.

గంగాబాబు ఇలా అన్నారు "నేను ఇవాళ సాయంత్రం ఇక్కడికి వచ్చేవాడిని. మిమ్మల్ని పాలీవాల్‌జీ పంపారని స్వామీజీయే మా ఇంటికి వచ్చి చెప్పారు. కాశీలో మీరు నెల రోజులు బస చేయడానికి ఏర్పాటు చేయాలి. ఇప్పుడు మీరు మా ఇంటికి రండి. నచ్చితే అక్కడ ఉండండి. లేకపోతే మరో ఏర్పాటు జరుగుతుంది."

స్వామి శుద్ధానంద మౌనంగా ఈ సంభాషణ వింటున్నారు. శ్రద్ధాళువులు ఆయన చుట్టూ కూర్చున్న తీరు చూస్తే, ఆయన లేచి గంగాబాబు ఇంటికి వెళ్ళి ఆయనకు కబురు చెప్పి తిరిగి వచ్చి కూర్చొని ఉండడం ఎంతమాత్రం సాధ్యం కాదు. స్వామీజీ కుటీరం నుండి గంగాబాబు ఇంటికి మూడుకిలోమీటర్ల దూరం ఉంది. మామూలుగా నడిస్తే అక్కడికి వెళ్ళడానికే అరగంట పడుతుంది. స్వామి శుద్ధానంద ఒకే సమయంలో రెండు మూడు స్థలాలలో ఉండగలుగుతారని గంగాబాబు ఆ తర్వాత తెలిపాడు. అందుకు శ్రీరామ్ ఇలా అన్నారు – "నేను వచ్చినట్లు కబురు తెలపడానికి ఈ సిద్ధిని వినియోగించడం, ఆ దివ్యశక్తిని దుర్వినియోగం చేయడం కాదా?"

గంగాబాబు ఇలా జవాబిచ్చాడు– "స్వామీజీ తమ సిద్ధులను దుర్వినియోగపరచరు. వృథాగా ఖర్చుచేయరు. ఆయన ఇలా చేశారంటే అందుకు ఏదో ప్రయోజనం ఉండి తీరుతుంది." ఆ తర్వాత కలుసుకున్నప్పుడు స్వామి శుద్ధానంద ఆ ప్రయోజనం ఏమిటో స్పష్టం చేశారు. తమ సాధనలో, తమ ఇష్టదైవంలో శిష్యులకు విశ్వాసం బలపడడానికి ఇలాంటి ప్రమాణాలు చూపడం ప్రయోజనకరం. స్వామీజీ ఇలా వివరించారు – "శ్రీరామ్! నీ గురించి ఒకరిద్దరికి కాక పదుల సంఖ్యలో సిద్ధపురుషులకు, ఈ మార్గంలో ముందుకు వెళ్ళిన వ్యక్తులకు బాగా తెలుసు. కాశీలో నీవు పలువురు వ్యక్తులను కలుసుకుంటావు. వారు నీకు నీ ఆధ్యాత్మిక శక్తిని పరిచయం చేస్తారు. అందుకు ప్రమాణాలు చూపుతారు. నీ లక్ష్యం వైపు ముందుకు పోవడంలో ఆ ప్రమాణాలు నీకు సహాయ పడతాయి."

గంగాబాబు శ్రీరామ్ బసకు ఏర్పాటు చేశాడు. ఆ స్థలం నుండి గంగకు వెళ్ళే త్రోవలో కొందరు సాధకులు, సత్పురుషులు బసచేసే స్థలాలు ఉన్నాయి. శ్రీరామ్‌కు ఆ స్థలం నచ్చింది. సాధువులను, సత్పురుషులను సునాయాసంగా కలుసు

**గుండె నిండా ధైర్యం, నమ్మకం నింపుకుని అడుగువేయాలి**

కోవడానికి వీలవుతుందనే కాక, అక్కడ ఏకాంతం లభిస్తుందని. గంగాబాబు మొదట తన ఇల్లు చూపారు. పనిలో పనిగా ప్రత్యామ్నాయాలుగా మరికొన్ని స్థలాలు చూపారు. వాటిలో ఈ స్థలం శ్రీరామ్‌కు నచ్చింది. బాంస్ ఫాటక్ వీధిలో ఉన్న ఆ ఇంటిలో శ్రీరామ్ బస చేశాడు. తన నిర్ణీత కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఒక్క రోజయినా ఆలస్యం చేయలేదు. ఆ సాయంత్రం నుండి సాధన-స్వాధ్యాయంలో నిమగ్నం అయ్యాడు.

## గంధబాబాతో సంభాషణ

శ్రీరామ్ బసచేసిన స్థలానికి కొద్ది దూరంలో గంగ ఒడ్డున హనుమాన్ ఘాట్ వీధిలో స్వామి విశుద్ధానంద కుటీరం ఉన్నది. స్వామి విశుద్ధానంద సూర్యవిజ్ఞాన ప్రణేత (expert). గంధబాబా అని ఆయనను పిలిచేవారు. ఆయన కాశీ వచ్చిన తర్వాత మొదట ఇక్కడే నివసించారు. సిద్ధుల ప్రదేశం జ్ఞానగంజ్‌తో జోడించ బడడం వల్ల, తమ దివ్య సామర్థ్యం వల్ల ఆయన కీర్తి ఆయన ఇక్కడ ఉన్నప్పుడే కాశీ అంతటా వ్యాపించింది. శ్రద్ధాళువుల సంఖ్య బాగా పెరిగింది కనుక స్వామీజీ మల్‌దహియా వీధిలోకి మారారు. ఆ స్థలంలో ఇప్పుడు "విశుద్ధానంద కానన్" ఉన్నది. శ్రీరామ్ కాశీలో ఉన్న రోజులలో స్వామి విశుద్ధానంద క్రొత్త ఆశ్రమంలోనికి వెళ్ళిపోయారు. అయినా, ఆయన ఈ కుటీరానికి వచ్చిపోతూ ఉండేవారు.

శ్రీరామ్ ఉదయం స్నానానికి గంగ ఒడ్డుకు వెళ్ళేవాడు. అక్కడ ఆయనకు స్వామి విశుద్ధానంద గురించి తెలిసింది. శ్రీరామ్ ఆ రోజు సంధ్యా వందనం గంగ ఒడ్డునే ముగించాడు. స్వామి విశుద్ధానందను దర్శనం చేసుకోవాలని అనుకున్నాడు. 'విశుద్ధానంద కుటీర్' ఒక పెద్ద మూడంతస్థుల భవనం. దానిలో వారి శిష్యులు పలువురు ఉండేవారు. శ్రీరామ్ కుటీర్‌లో ప్రవేశించాడు. తనను పరిచయం చేసుకున్నాడు. వ్రజ క్షేత్రానికి చెందిన ఒక సాధకుడు అజరామరమైన కాశీ నగరానికి వచ్చాడనే ఈ విషయం ఆ శిష్యులను పరవశింపజేసింది. వారు వెంటనే తమ గురువుగారికి ఆ వార్త తెలిపారు. ఆశించిన విధంగానే స్వామి విశుద్ధానందజీ వెంటనే శ్రీరామ్‌ను పిలిచారు.

స్వామీజీ ఉన్న గదిలో మరి అనేకమంది ఉన్నారు. వారంతా కాషాయరంగు జంపఖాన మీద కూర్చొని ఉన్నారు. ఆ జంపఖాన మీద తివాచీ పరచి ఉన్నది. స్వామీజీ దానిపై విరాజమానులై ఉన్నారు. స్వామి విశుద్ధానందది నిండైన విగ్రహం. సమ్మోహపరచే నేత్రాలు. కొనతేలిన నాసిక. దట్టమైన గడ్డం. మొదటి చూపులోనే ఆకర్షించే వ్యక్తిత్వం. ఆయనకు ప్రణామం చేసి, శ్రీరామ్ అక్కడ ఉన్న శ్రద్ధాళువులమధ్య కూర్చున్నాడు. ఆ వెంటనే ఎవరో గుసగుసగా ఇలా అన్నారు- "బాబా (స్వామీజీ) ఎదుట వెదజల్లబడి ఉన్న పువ్వులలో వాసన లేదు. బాబా వాటిలో ఏ పువ్వు వాసనను అయినా తెప్పించ గలరు.'

శ్రీరామ్ మౌనంగా విన్నాడు. శ్రద్ధాళువులతో మాట్లాడుతున్న బాబా దృష్టి శ్రీరామ్ మీద పడింది. ఆయనను చూడగానే బాబా కళ్ళు మిలామిలా మెరిశాయి. ఏదో గహనమైన సత్యాన్ని చూసినట్లు. ఆయన ఇలా అడిగారు - "నాయనా! నీవు ఎప్పుడు వచ్చావు? నీకు ఏమి కావాలి? ఏ పువ్వు వాసన కావాలి?"

## ఆత్మకమలపు సువాసన

శ్రీరామ్ అన్నారు - "మీ లోపల ఉన్న ఆత్మ కమలపు సువాసన."

బాబా ఇలా అన్నారు - "అందుకోసం స్వయంగా సాధన చేయవలసి ఉంటుంది."

"అందుకోసమే నాకు ఆశీస్సులు ఇవ్వండి" అని శ్రీరామ్ తన కోరిక తెలిపారు.

బాబా చప్పట్లు చరచి తన సంతోషాన్ని వ్యక్తపరచారు. కొద్దిసేపు ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పారు. ఆ తర్వాత అసలు విషయానికి వస్తూ ఇలా అన్నారు -

"నీవు సవితా దేవత ఉపాసకుడవు. ఆ దేవత స్థూల ప్రతీక అయిన సూర్యుని శక్తిని ఉపయోగించి ప్రజలను ఆశ్చర్య చకితులను చేస్తున్నాను. ప్రజలను సృష్టికర్తవైపు ఆకర్షించడానికే ఈ అద్భుతాలు చేస్తున్నాను"

"నాకు కనిపించింది ఏమంటే ముందు ముందు నీవు స్వయంగా ఈ విషయం తెలుసుకుంటావు. నీ మార్గదర్శక సత్తా నీ వ్రేలు పుచ్చుకుని నిన్ను ఆ మార్గంలో తీసుకువెళ్తున్నది"

చాలాసేపు మాట్లాడిన తర్వాత బాబా ఇలా అన్నారు - ఇక్కడికి వస్తూ ఉండు. కాననకు కూడా ఎప్పుడు కావాలంటే

**అపజయానికి అసలైన కారణం మన చేతకానితనమే కానీ గ్రహాలు కాదు**

అప్పుడు రావచ్చు." ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు – "కాస్త దగ్గరకురా." శ్రీరామ్ ఆయన దగ్గరకు వెళ్ళారు. బాబా అడిగారు – "నీకు ఏ రంగు ఇష్టం?"

"మంచి గంధం రంగు."

"ఎందువల్ల?"

శ్రీరామ్ ఇలా జవాబిచ్చాడు – "ఎందుకంటే – దానిని ఎంత నూరితే అది అంత సువాసన వెదజల్లుతుంది."

బాబా తిరిగి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆయన ఇలా అన్నారు – "నీవు నీ అరచేతిని రుద్దు." శ్రీరామ్ తన అరచేతిని రుద్దారు. ఆ అరచేతిలో చందనపు సువాసన గుప్పుమంటోంది.

బాబా ఇలా అన్నారు – "ఈ సువాసనను నీవు ఎప్పుడు కావాలంటే అప్పుడు వెదజల్లగలుగుతావు. నీవు ఎవరిని తాకితే వారు ధన్యులు అవుతారు. జ్ఞానగంజ్‌లోని యోగుల అనుగ్రహంగా దీనిని పరిగణించు."

ధన్యవాదం తెలిపి, శ్రీరామ్ తన నివాసానికి చేరాడు. మధ్యాహ్నం శ్రీరామ్‌ను చూడడానికి గంగాబాబు వచ్చాడు. స్వామి విశుద్ధానందతో జరిగిన సంభాషణను గురించి శ్రీరామ్ ఆయనకు చెప్పాడు. అందుకు గంగాబాబు ఇలా అన్నాడు – బాబాకు అలౌకిక సామర్థ్యం ఉన్నది. ఆ సామర్థ్యాన్ని వినియోగిస్తే – ప్రపంచం నుండి ఆకలిని, దారిద్ర్యాన్ని నిర్మూలించవచ్చు.

గంగాబాబు పేర్కొన్న సామర్థ్యం కోరుకున్న వస్తువులను సృష్టించే సిద్ధి. స్వామి విశుద్ధానంద ఈ సిద్ధిని విజ్ఞానంగా పేర్కొంటారు.

ఏ వస్తువును అయినా సృష్టించగలిగే సామర్థ్యం గురించి తెలుసుకున్నప్పుడు శ్రీరామ్ మనసులో ఉత్సుకత జనించింది, రాత్రి వరకు దానిని గురించి ఆలోచించాడు. ఈ విషయం బాబాతో మాట్లాడాలని అనుకున్నాడు. విస్తృతంగా ధాన్యాన్ని, సాధనాలను కోరే బదులు – దేశ స్వాతంత్ర్యాన్ని ఎందుకు కోరకూడదని ఆయన తలపోశాడు.

★★★

## స్వామి వివేకానంద

*ఒకప్పుడు చైనాలోని ప్రత్యేకమైన పట్టణాలను మినహాయించి మిగిలిన ప్రదేశాలలో విదేశీయులు అడుగుపెట్టరాదని శాసనం చేశారు. ఒకవేళ ఎవరైనా పొరపాటున అడుగుపెడితే ప్రభుత్వంతో పనిలేకుండా ప్రజలు శారీరక శుద్ధి చేసి పంపేవారు. సందర్భాన్ని బట్టి ప్రాణాలు తియ్యటానికి కూడా వెనుకాడేవారు కాదు.*

*ఒకసారి స్వామి వివేకానంద చైనా పర్యటనకు వెళ్ళారు. అక్కడే ఇద్దరు జర్మను పర్యాటకులు కూడా కలిశారు. వారందరికి చైనాలో గ్రామీణ జీవనవిధానం చూడాలని కోరిక కలిగింది. జర్మనులు చాలా భయపడ్డారు. వివేకానందులు ధైర్యం చెప్పారు. మానవజాతి అంతా ఒక్కటే. మనం నిర్మల హృదయంతో వెళ్ళినట్లైతే మనపై ఎవ్వరు దాడి చెయ్యరు. ప్రేమతో స్నేహహస్తం చూపుతారు" అని. సరే అంటే సరే అనుకున్నారు. అందరు కలసి ఒక గ్రామంలో ప్రవేశించారు.*

*భయం భయంగానే ఇరువురి భాషలు తెలిసిన వ్యక్తి కూడా వారితో కూడా వెళ్ళాడు. విదేశీయులను చూస్తూనే గ్రామస్థులంతా లాఠీలతో పరుగున వచ్చారు. స్వామి వివేకానంద ఏమాత్రం తొణకకుండా చిరునవ్వుతో స్నేహపూర్వకంగా పలుకరించారు. "మీరు మీ సోదరులను ప్రేమతో చూడరా?" అని ప్రశ్నించారు. అనువాదకుడు ఆ ప్రశ్నను చైనాభాషలో వారిని అడిగాడు. అంతేవారంతా మంత్రబద్ధులైనట్లు చేతిలో లాఠీలను విసిరి వేశారు. స్వామిజీకి నమస్కరించి సాదరంగా స్వాగతించారు. ఇదంతా గమనిస్తున్న జర్మనులు స్వామికి నమస్కరించారు. "మనం నిజమైన సత్యాన్ని గ్రహించాము" అన్నారు. ఏ దేశమైనా, ఏ భాష అయినా మానవులంతా ఒక్కటే.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసి జీవితాన్ని గందరగోళం చేసుకోకూడదు**

యుగ నిర్మాణ యోజన

# మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 17

## మానవుడు తన భాగ్యానికి తానే నిర్మాత, ఈ విశ్వాసం ఆధారంగా మేము ఉన్నతమైనవారిగా మారి ఇతరులను కూడా శ్రేష్ఠులుగా చేస్తే యుగం తప్పక మారుతుందని మా విశ్వాసం

పరిస్థితులు మనపై చాలా ప్రభావాన్ని చూపిస్తాయి. అందువల్ల చుట్టుప్రక్కల ఉన్న వాతావరణానికి అనుగుణంగా జీవించాలనే మానసికస్థితి ఏర్పడుతుంది. సాధారణ జీవితం గడిపేవారు ఆయా పరిస్థితులకు అనుగుణంగా మారిపోతారు. అక్కడ జరిగే సంఘటనలు మనలను ప్రభావితం చేస్తాయి. వ్యక్తుల యొక్క ప్రభావం కూడా మనపై పడుతుంది. అయినప్పటికీ అన్నింటికంటే మన విశ్వాసాల ప్రభావమే మనపై ఎక్కువగా పడుతున్నదని ఒప్పుకోవాలి. **పరిస్థితులకు తలవంచినప్పుడే అవి మనపై వాటి ప్రభావాన్ని చూపిస్తాయి.** వాటి ఒత్తిడికి మనం లొంగకపోతే ఎట్టి పరిస్థితులల్లోను మనపై వచ్చే ఒత్తిడి ఎక్కువకాలం ఉండదు. విశ్వాసాలతో పోలిస్తే పరిస్థితులు కూడా బాగా ప్రభావం చూపిస్తాయి. మనిషి భాగ్యాన్ని బ్రహ్మదేవుడు వ్రాస్తాడని చెప్తారు. మన నుదుటి వ్రాతలు మన జన్మకు ముందే వ్రాయబడి ఉంటాయని వింటుంటాము. తలవ్రాత ముందు ఉపాయాలు పనిచేయవు. ఇటువంటి మాటలు కొంతవరకే నిజమవుతాయి. జన్మతోనే గ్రుడ్డివారుగా, వికలాంగులుగా, శక్తిహీనులుగా, బుద్ధి మాంద్యులుగా పుట్టేవారికి ఆ బాధలను భరించక తప్పదు. దాని నుండి వారిని మనం రక్షించలేము. అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, యుద్ధాలు, మహమ్మారులు, అకాలమృత్యువు, దుర్భిక్షము, రైళ్ళు, మోటారు వాహనాలు పట్టీలు కొట్టడం, దోపిడీలు, దొంగతనాల వంటి ప్రమాదాలు ఎన్నో ఆపదలను తీసుకొచ్చి పెడతాయి. వీటిని కూడా మనం ఆపలేము. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు మన అదృష్టం అలా ఉందని, అది జరగాలని ఉన్నదని కనుక జరిగిందని సరిపెట్టుకోవడం తప్ప మరేమీ చేయలేము. ఈ పరిస్థితుల వల్ల బాధలకు గురైన వ్యక్తుల ఆంతరిక క్షోభను శాంత పరిచేందుకు, తమ అదృష్టమును గురించి వారు పడే ఆవేదనను దూరం చేసేందుకు వైద్యులు నిద్ర మాత్రలు ఇస్తారు. మార్ఫియా ఇంజక్షన్లు చేస్తారు. కొకైన్ వంటి మత్తుమందులిచ్చి బాధకు గురైన ప్రాంతాన్ని శాంతపరుస్తారు. ఇది కొన్ని విశేష పరిస్థితులలో చేసే విశేషమైన చికిత్స. అప్పుడప్పుడు జరిగే ఇలాంటి సంఘటనలను కూడా ఆపదలనే చెప్పాలి.

తీవ్రమైన పురుషార్థము (ప్రయత్నము) చేయాలనేది నియమము. భాగ్యమనే పేరు దానికి సరియైన పేరు కాదు. దానిని ఆధారంగా చేసుకొని మనం ఎలాంటి విధానాలను, కార్యక్రమాలను తయారు చేయకూడదు. ఒక్కొక్కసారి స్త్రీ గర్భం నుండి లోపాలతో పిల్లలు జన్మించవచ్చు. కొన్ని చెట్లు అకాలంలో పూలు పూస్తాయి, పండ్లనిస్తాయి. ఒక్కోసారి ఎండా కాలంలో కూడా మేఘాలు వర్షిస్తాయి. సాధారణ నియమానికిది భిన్నమైనది. ఇలాంటివన్నీ మనం కుతూహలంతో గమనించ వలసిన విషయాలే తప్ప వీటికి ఎలాంటి నియమాలు లేవు. మానవజీవితము అంతా ముందే నిర్ణయించబడిన అదృష్టము, భాగ్యాన్ని అనుసరించే జరుగుతాయనడం తప్పు. ఇలా జరిగితే కనుక ఇక మనిషి ఎటువంటి ప్రయత్న, పురుషార్థములు చేయనవసరం లేదు.

**బ్రహ్మదేవుడు ఎవరి భాగ్యమును ముందే వ్రాసి ఉంచడని తెలుసుకోవాలి. ప్రతి మనిషి తన భాగ్యాన్ని తనే స్వయంగా నిర్మించుకుంటాడు.** ఏ విధంగా ముందురోజు తోడుపెట్టిన పాలు మరుసటిరోజుకు పెరుగుగా మారతాయో, అదేవిధంగా **నిన్న మనం చేసిన పురుషార్థం ఈనాటి మన భాగ్యంగా మన ముందుకు వస్తుంది.** ఈనాడు మనం చేసిన కర్మకు ఈ రోజే ఫలితం లభించదు. దాని పరిణామం వచ్చేందుకు, పరిపక్వ

పనివాళ్ళతో కూడా మంచి బంధాన్ని ఏర్పరచుకోవాలి

స్థితికి వచ్చేందుకు, ఫలితం వెలువడేందుకు కొంత సమయం పడుతుంది. పరమాత్మ సమదర్శి, న్యాయమూర్తి. ఆయన తన పిల్లలందరిని సమానంగా ప్రేమిస్తాడు. అటువంటప్పుడు కొందరి భాగ్యాన్ని మంచిగా, కొందరిది చెడుగా వ్రాసి అన్యాయం ఎందుకు చేస్తాడు? ఆయన తన పిల్లలందరికి మంచి, చెడు కర్మలు ఏవైనా చేసేందుకు సంపూర్ణమైన స్వేచ్ఛను ఇచ్చాడు. దానితోపాటే మనం చేసే ఆయా కర్మల ఫలితాలు తప్పక లభిస్తాయి, వాటిని మనిషి తప్పనిసరిగా అనుభవించాలనే ముఖ్యమైన విషయాన్ని కూడా చెప్పాడు. అందువల్ల కర్మను భాగ్యంగా చెప్పుకుంటే అది అతిశయోక్తి కానేరదు. మన జీవితం ఎన్నో సమస్యలలో చిక్కుకొని ముళ్ళు పడిపోయి ఒక వింత రూపం దాల్చి మనముందుకు వచ్చి నిలబడింది. కటువైన ఈ సత్యాన్ని మనం అంగీకరించక తప్పదు. ఇది మనం చేతులారా చేసుకున్నదే అనే సత్యాన్ని ఒప్పుకొని మన అలవాట్లను, ఆలోచనా విధానాన్ని, విశ్వాసాలను, పద్ధతులను సంస్కరించుకునేందుకు సిద్ధపడితే ఈ సమస్యలన్నింటిని మనమే పరిష్కరించుకోగలుగుతాము.

నవరాత్రుల యందు ప్రతి సంవత్సరం నవదుర్గలను పూజిస్తాము. ఆమె మనకు అనేక రిద్ధి-సిద్ధులను ప్రసాదిస్తుందని నమ్ముతాము. సుఖసాధనాలను పొందేందుకై ఆమె కృపను, సహాయాన్ని అర్థిస్తాము, పూజిస్తాము. దేవలోకంలోని నవదుర్గలవలె భూలోకవాసినులైన 9 మంది దేవతలు మన శరీరంలోనే, మస్తిష్కంలోనే ఉన్నారు. వారిని ఉపాసించడం వల్ల మనకు ప్రత్యక్ష ఫలితాలు లభిస్తాయి. దేవలోకనివాసినులైన దేవతలు ప్రసన్నులు అవుతారా లేదా అనేది అనుమానమే కానీ శరీరమనే లోకంలో నివసించే 9 మంది దేవతల సాధన మాత్రం వ్యర్థం కాదు. సాధన చేసేందుకు కొద్దిపాటి ప్రయత్నం చేసినా సముచితమైన లాభం మనకు లభిస్తుంది. మన మనోక్షేత్రంలో విహరించే 9 మంది దేవతల పేర్లు 1) ఆకాంక్ష, 2) వివేచన, 3) భావన, 4) శ్రద్ధ, 5) ప్రవృత్తి, 6) నిష్ఠ, 7)క్షమత, 8) క్రియ, 9) మర్యాద. వీటిని సంతులితంగా ఉంచుకో గలిగితే మనిషి అష్టసిద్ధులకు, నవనిధులకు స్వామి అవుతాడు. ప్రపంచంలో ప్రగతిపథంలో ముందుకు సాగే ప్రతివ్యక్తి తెలిసో, తెలియకో వీరిని ఉపాసిస్తాడు. వీరి అనుగ్రహం వల్లనే ఉన్నతి అనే అగ్రస్థానానికి చేరుకుంటాడు.

మనలను మనం ఉన్నతులుగా మార్చుకోగలిగితే మన సంపర్కంలోకి వచ్చేవారిని కూడా ఉన్నతులుగా మార్చవచ్చు. ఆదర్శములు ఎప్పుడూ ఉన్నతంగానే ఉంటాయి. ఆదర్శములను పాటించాలనుకునేవారు సామాన్యులకంటే ఉన్నతంగానే ఉండాలి. ప్రపంచాన్ని ఎంత మంచిగా తయారు చేసి చూడాలని మనం అనుకుంటున్నామో దానికంటే ముందు మనం కూడా అంత ఉన్నతంగా మన ఆదర్శములను పాటించాలి. అత్యున్నతంగా జీవిస్తేనే శ్రేష్ఠమైనవారమని కీర్తింపబడతాము. పరిపక్వమైన శరీరముగల తల్లే చక్కని బిడ్డను పొందగలదు. ఆదర్శవంతుడైన తండ్రే మంచి సంతతిని పొందే అదృష్టానికి అర్హుడు అవుతాడు. ఆదర్శవంతుడైన భర్తయే పతివ్రతయైన భార్య సేవను పొందగలడు. శరీరంతో పోలిస్తే దాని నీడ చాలా అస్తవ్యస్తంగా ఉంటుంది. శరీరంకన్నా దాని ఫోటో ఎప్పుడూ చిన్నదిగానే ఉంటుంది. మనలను మనం ఏ స్థాయికి వికసింప చేసుకుంటామో మన సమీపంలో ఉన్నవారిని కూడా అంత ప్రభావితం చేయగలుగుతాము. అప్పుడే వారిలో కొంతైనా ఉన్నతి కలుగుతుంది. అయినప్పటికీ వారు మనకంటే క్రిందనే ఉంటారు. అందుచేత మనం ఇతరులను ఎంత మంచివారుగా, శ్రేష్ఠులుగా ఉండాలని కోరుకుంటామో మనం కూడా అంతకంటే కొంచెం ఎక్కువగానే మన ప్రామాణికతను నిరూపించుకోవాలి. ఉన్నతంగా లేకుండా శ్రేష్ఠత రాదు అనే విషయం మనం ఖచ్చితంగా అర్థం చేసుకోవాలి.

రచనల, ఉపన్యాసాల యుగం గడిచిపోయింది. డప్పులు కొట్టుకొని, బడాయిలకు పోయి కాగితాలను నల్ల అక్షరాలతో నింపేసి ప్రపంచాన్ని సంస్కరించాలని ఆశించడం వృథా. ఈ సాధనాల వల్ల కొద్దిపాటి సహకారం లభిస్తుంది కానీ లక్ష్యం మాత్రం పూర్తి కాదు. యుగనిర్మాణమనే మహత్తర కార్యం కొరకు ఈ సాధనాలు ఎప్పటికీ సరిపోవు. మానసిక స్థితి ఉన్నతంగా ఉండాలి, వ్యక్తిగత నడవడిక ఉన్నతంగా ఉండాలి. ఈ రెండింటిని ఆచరణలో చూపించడం వల్లనే ఇతరులను ప్రభావితులను చేసి శిక్షణ ఇవ్వగలుగుతాము. వ్యక్తుల నిర్మాణం చేయాలంటే తీర్చిదిద్దిన వ్యక్తిత్వమున్నవారు కావాలి. ఇందుకు మనమే ముందుకు రావాలి. అప్పుడు మన

**జీవితం అంటేనే ఇచ్చిపుచ్చుకోవడం**

ఉత్కృష్టతతో పాటు ప్రపంచము యొక్క శ్రేష్ఠత కూడా దానంతటదే పెరుగుతుంది. మనం మారితే యుగం మారుతుంది. మన యుగనిర్మాణ ప్రణాళిక సత్సంకల్పం సుసంపన్నమై తీరుతుంది.

ఆదర్శవంతమైన వ్యక్తిత్వముల ద్వారా ప్రజలందరికి శిక్షణ ఇచ్చి వారి స్థాయిని పెంచగలిగే ఆనాటి ఋషులు, మునులు ఈనాడు లేరు. అద్భుతమైన, లోతైన తమ జ్ఞానంతో నమస్కరించ దగిన త్యాగములు చేసి తమ ప్రబల పురుషార్థములతో, పశు ప్రవృత్తులతో చిక్కుకుపోయి పతనావస్థకు చేరుకున్న ప్రజల మనస్సులను ప్రక్కకు త్రిప్పి దైవత్వము వైపు మరలించే బాధ్యతను తమ భుజాలపైకి ఎత్తుకున్న ఆనాటి బ్రాహ్మణులు ఈనాడు లేరు. వృక్షములు లేని చోట ఆముదపు వృక్షమే మహావృక్షంగా చెప్పబడుతుంది. ఈ ఆలోచనాధారతో తమను కలుపుకున్న విశాల దేవపరివార్ పరిజనులు తమ చిన్న చిన్న వ్యక్తిత్వాలను ఆదర్శముల వైపు నడిపించగలిగినా లక్ష్యము ఎంతోకొంత నెరవేరుతుంది. కనీసం ఒక్క అడ్డుగోడైనా తొలగించ బడుతుంది.

యుగపరివర్తన అనే దానిపై విశ్వాసం ఉంచడం అనేది గాలిలో మేడ కట్టడం వంటిది కాదు. ఇది ఎన్నో వాస్తవాలపై ఆధారపడ్డ ఒక పరమ సత్యము. పరిస్థితులు ఎంత వికటరూపం దాల్చినా సదాశయ సంపన్నులైన, సంకల్పశీలురైన వ్యక్తులందరు కలిసి కార్యమును పూర్తిచేయ గలిగితే పరిస్థితులు తప్పక మారతాయి. అసురుల దాడి నుండి విముక్తి గురించి చెప్పే పౌరాణిక గాథలయందుగాని, రవి అస్తమించని సామ్రాజ్యము యొక్క కబంధహస్తముల నుండి విముక్తికై జరిగిన స్వాతంత్ర్య సంగ్రామ ఉద్యమాలన్నింటిని ప్రజలు తమకున్న స్వల్పశక్తితోనే పూర్తిచేశారు. అటువంటి సంకల్పశీలురైన వ్యక్తుల సముదాయములు లక్ష్యం కొరకు పనిచేసి యుగశక్తి అవతరణకు మాధ్యమాలుగా ఉపయోగపడతాయి. యుగనిర్మాణ ఉద్యమము గురించి తెలిసిన వ్యక్తులకు ఇది ఈశ్వరుని ప్రేరణ ద్వారా జరుగుతున్న ప్రక్రియ అని అర్థమవుతుంది. ఈ సంకల్పాన్ని తీసుకున్న వ్యక్తులందరు ఈశ్వరీయ సంకల్పంలో భాగస్వాములుగానే చెప్పబడతారు. అంతేకాదు అందులో సాఫల్యం పొందేంత వరకు పూర్తిగా విశ్వాసముంచి దానితో జీవితమును చరితార్థము చేసుకొని, చేయించేందుకు సంపూర్ణ శక్తిని వినియోగించిన వారు అందరి కంటే గొప్ప వివేకమున్న వారిగా నిరూపించబడతారు.

*– అనువాదం: శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

## రెడ్‌క్రాస్

*ఆ రోజుల్లో ఇటలీ, ఆస్ట్రియాల మధ్య ఘోరయుద్ధం జరుగుతోంది. జయించాలనే మహత్వకాంక్ష, శత్రువులను సంహరించాలనే ఆరాటం తప్ప ఇరుపక్షాలకు కూడా చనిపోయిన వారి గురించి గాని, గాయపడిన వారి గురించి గాని, ఆలోచన లేదు. హృదయ విదారకంగా ఉన్న ఈ పరిస్థితిని చూసి కరిగి, నీరైన జెనీవా బ్యాంకు ఉద్యోగి జీన్ హెన్రీడ్యూమా అనే ఒక పౌరుడు వెంటనే ఉద్యోగాన్ని వదలివేశాడు. ఇరుపక్షాల వారిని కలిసి భావ సంవేదనతో సలహా సంప్రదింపులు జరిపాడు. తరువాత, మరణించిన వారికి అంతిమ సంస్కారాలు జరపడం, గాయపడిన వారికి చికిత్స చేయటం ఈ రెండు బాధ్యతలు తన భుజస్కంధాల మీద వేసుకొన్నాడు. ఈ సేవకు "రెడ్‌క్రాస్" అని పేరు పెట్టాడు. దీని ఆరంభం అతి సాధారణ స్థాయిలో జరిగినా క్రమంగా దీని అవసరం బాగా పెరిగింది. వివిధ దేశాల ప్రభుత్వాలు దీనికి సహకారాన్ని అందించటానికి ముందుకు రాసాగాయి. అంతేకాక యుద్ధభూమిలో గాయపడిన సైనికులను లేవనెత్తటానికి తీసుకొని వెళ్ళే "రెడ్‌క్రాస్" వాహనాలను ఎంత పెద్ద అధికారియైనా అడ్డుపడడానికి, ఆపటానికి ప్రయత్నించరాదని ఒక నియమం పెట్టబడింది. ఒక సాధారణ పౌరుని భావ సంవేదనకి ఈనాడు సంఘంలో "రెడ్‌క్రాస్" కు ఎంత ఉన్నతస్థానం ఇవ్వబడిందో అందరికి తెలిసినదే.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**పని మనిషిని కూడా మన మనిషిగా చూడగలగాలి**

# కుండలినీ వశీకరణ - బ్రహ్మీచేతన క్రియాకలాపం

మనిషి శరీరంలో దివ్య సచేతన విద్యుత్తు భాండాగారం ఉన్నది. దీనిలోని కొంతభాగం శరీరం మనుగడ సాగించడానికి ఉపయోగపడుతుంది. ఆహారం సంపాదించుకోవడానికి, నిద్ర పోవడానికి, నిత్యకర్మలకు, వినోదానికి దీనిలో కొంచం మాత్రమే ఉపయోగపడుతుంది. మిగిలినదంతా నిద్రాణమై పడి ఉంటుంది. దానిని జాగృతం చేయగలిగితే ఎంతో గొప్ప మహత్తర కార్యములకు వినియోగించుకోవచ్చు. సాధారణంగా శరీరంలో, మస్తిష్కంలో వ్యాపించి ఉన్న విద్యుత్తు శక్తిలో ఏడు శాతం మాత్రమే మామూలు మనుష్యులు ఉపయోగించు కోగలుగుతారు. మిగిలినదానిని కుండలినీ జాగరణ ప్రక్రియ ద్వారా ఉపయోగించుకోవచ్చు. ఈ భాండాగారంలో ఎవరు ఎంత తీసుకోగలుగుతారో, అంత సుసంపన్నులు అవుతారు.

మానవ మస్తిష్క నిర్మాణం అతి జటిలమైనదని వైజ్ఞానికుల అభిప్రాయం. అందులోని ప్రతి న్యూరాన్ (neuron) 60000 సినాప్సిస్‌తో (synopsis) కలుపబడి ఉంటుంది. ఒక న్యూరాన్ నుంచి ఇంకొక న్యూరాన్‌కు 360 మైళ్ళ వేగంతో సంకేతాలు వెళ్తాయి. ఈ సంకేతాలు మస్తిష్కం యొక్క విద్యుచ్ఛక్తితో వెళ్తాయి. ఈ కోశికల (న్యూరాన్‌ల) స్ఫురణ పరిణామంగా ప్రతిభ, పరాక్రమం, వివేకం జాగృతమవుతాయి.

సువిఖ్యాత వైజ్ఞానికుడు ఐన్‌స్టీన్ అనుసరించి మానవ స్మృతి కోశంలో 100 అరబ్బుల (1 అరబ్బు=100 కోట్లు) సూచనలను సంగ్రహించే శక్తి ఉన్నది. ఇది 30 సంపుటముల ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా (Encyclopedia Britanica) కన్నా ఐదురెట్లు ఎక్కువ. 10 అరబ్బుల న్యూరాన్లు, 10 ఖరబ్బుల (1ఖరబ్బు=10వేల కోట్లు) సినోప్సిస్ సమూహములతో కూడిన మస్తిష్కము ఒక అద్భుతమైన, విలక్షణమైన భాండాగారము, ఒక మేజిక్ బాక్స్. డా॥ డి.సి.రోఫ్ ఎల్.హెచ్.స్నీడర్, డా॥విలియం హార్‌విజ్, డా॥ మార్టిన్ మొదలైన అనేక వైజ్ఞానికులు మస్తిష్కం యొక్క విలక్షణతకు చకితులై ఇటువంటి సూపర్ కంప్యూటర్‌ను తయారుచేయడం మనిషికి అసాధ్యం అని అన్నారు.

కొందరిలో అద్భుతమైన విలక్షణమైన ప్రతిభ చిన్నతనం లోనే కనిపిస్తుంది. ఇది జాగృతమైన కుండలినీ యొక్క చమత్కారమే. ఆదిశంకరచార్యులవారు మూడు సంవత్సరముల వయస్సులోనే మాతృభాష మళయాళమును నేర్చుకున్నారు. తల్లిదండ్రుల నుండి పురాణాదులు విని వంటబట్టించుకున్నారు. ఆయనకు ఐదు సంవత్సరాల వయస్సులోనే యజ్ఞోపవీత సంస్కారం జరిపించి విద్యాధ్యయనమునకు పంపించారు. ఏడు సంవత్సరాలు వచ్చేసరికి ఆయన వేదవేదాంత పారంగతుడు అయ్యాడు. 8వ యేట సన్యాస దీక్ష తీసుకున్నారు. కొద్దిరోజుల లోనే సిద్ధయోగి అయ్యారు. 16 సంవత్సరముల వయస్సులో ప్రముఖ భాష్యములు వ్రాశారు.

భారతీయ సంస్కృతి యొక్క పురాతన ఇతిహాసాలు ఈ తథ్యమునకు సాక్షులు. ఆత్మిక ప్రగతి క్షేత్రంలో ఋషిగణ జీవితం ప్రారంభం నుండే అగ్రగామిగా ఉండేది.

దీనిలో కొన్ని అతిశయోక్తులు ఉండవచ్చు. కానీ అలాంటి సంఘటనలు ఆధునిక కాలంలో కూడా జరిగాయి. గ్రహంబెల్ 20 సంవత్సరముల వయస్సులో టెలిఫోన్ తయారుచేశాడు. విల్బర్ రైట్ 32 సంవత్సరాల వయస్సులో విమానం తయారు చేశాడు. ఎలీ వ్హిటలీ 28 సంవత్సరాల వయస్సులో జిన్నింగ్ మిషన్ కనిపెట్టాడు. బ్లేస్ పాస్కల్ 32 సంవత్సరాల వయస్సులో కాలిక్యులేటర్‌ను మొదటిసారి తయారుచేశాడు. జేమ్స్ క్రిస్టన్ 12 సంవత్సరాల వయస్సులో అరబ్, గ్రీకు, యాహూదీ ఇతర అనేక భాషలు నేర్చుకున్నాడు. మానవస్థాయి ఎంత సూక్ష్మంగా చేసుకోవాలంటే ప్రకృతి యొక్క అంతరాళమును మైక్రోస్కోప్‌లో చూసినట్లు చూడగలగాలి, అర్థం చేసుకోవాలి. ఇటువంటి స్థాయి కుండలినీ క్షేత్రంలో ప్రచండతను ఉత్పన్నం చేసి సాధించుకోవచ్చు.

సంతానోత్పాదన యవ్వనానికి సంబంధించినది మాత్రమే కాక గుణసూత్రముల వరకు, జీన్స్ వరకు వెళ్ళింది. ఈ శాఖను జెనెటిక్స్ (genetics) అనే పేరు ఇచ్చారు. సాధారణ పశు, పక్షులవలె మనుష్యులకు పిల్లలు కలుగుతారు. పిల్లలలో ఉచ్చస్తరీయమైన విశేషతలు ఉత్పన్నం చేయడం మనిషి వశంలో లేదు. శరీరం యొక్క రంగు, ముఖాకృతి తెలుసుకోగలము కానీ శిశువు అంతరంగం ఎలా ఉండాలి? వాని వ్యక్తిత్వంలో

**16. పని మనిషి కూడా మనిషే, తను ఒకింటి ఇల్లాలే**

ఎటువంటి విశేషతలు ఉండాలి? ఇవి నిర్ధారించడం సామాన్య మానవుడు నిర్ధారించలేడు. కానీ జాగృతమైన కుండలినీ ఈ పనిని పూర్తిచేయగలదు. సాధనా బలంతో సూక్ష్మ అదృశ్య దేవశక్తులను ఆకర్షించుకుని ఎటువంటి శారీరిక సంపర్కం లేకుండా గర్భాదానము పొందడం, ప్రతిభావంతులైన పుత్రుల జననం భారతీయ పురాణాలలో చూడవచ్చు.

కుంతి సూర్యశక్తితో కర్ణుని, యమధర్మరాజు నుండి యుధిష్ఠరుని, వాయువు నుండి భీముని, ఇంద్రుని నుండి అర్జునునికి జన్మను ఇచ్చింది. కుంతి సహపత్ని మాద్రికి కూడా ఈ విద్యను నేర్పింది. ఆమె అశ్వనీకుమారుల శక్తితో నకుల సహదేవులకు జన్మను ఇచ్చింది. ఇదేవిధంగా అంజనీమాత కూడా వాయుదేవుని శక్తితో పవనపుత్ర హనుమంతుడిని పొందింది. ఈనాటి విజ్ఞానం చేయదలచుకున్న జెనిటిక్ ఇంజనీరింగ్ ప్రయోగములు ఆనాడే జరిగాయి. విశిష్ఠ ఆధ్యాత్మిక ప్రయోగాలతో అసాధారణ క్షమత కలిగిన సంతానాన్ని పొందేందుకు చేసిన ప్రయోగాలు పురాణకాలంలో ఎన్నో జరిగాయి. రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు జననం పుత్ర కామేష్ఠి యజ్ఞం ద్వారా జరిగింది. ద్రుపదుడు కూడా యజ్ఞ ప్రయోగంతోనే ద్రౌపది, దృష్టద్యుమ్నులను పొందాడు. ద్రౌపది యొక్క సౌందర్యం, వివేకం, శౌర్యం అసాధారణమైనవి. దృష్టద్యుమ్నుడు మహాభారతంలో పాండవసేనకు ప్రధాన సేనాధిపతి.

వృత్తాసురుని జన్మ కూడా యజ్ఞ తంత్ర ప్రయోగంతోనే జరిగింది. అతని శరీరంపై ఎటువంటి అస్త్ర–శస్త్రముల ప్రభావం చూపలేకపోయాయి. ఆధ్యాత్మిక సాధనతో ప్రాణవంతుడైన దధీచి మహర్షి యొక్క వెన్నెముకతో తయారయిన వజ్రాయుధం తోనే అతనిని చంపడం వీలయింది. ప్రాణవంతమైన వాతావరణంలో సాధన ద్వారా జాగృతమైన జీవవిద్యుత్తు గర్భస్థ శిశువులలో విలక్షణ ప్రతిభలను జాగృతం చేస్తుంది. ఈ ఆధారంతోనే వాల్మీకి ఆశ్రమంలో లవకుశులు, కణ్వమహర్షి ఆశ్రమంలో భరతుడు, జమదగ్ని మహర్షి ఆశ్రమంలో వత్సరాజు ఉదయనుడు అద్భుత ప్రతిభలతో జన్మించారు.

మనిషి కావాలనుకుంటే తన ఆధ్యాత్మిక శక్తితో బ్రహ్మాండం యొక్క, భూలోకం యొక్క పరిస్థితులలో అవసరమైన, ఉపయోగకరమైన పరివర్తనలు తీసుకురావచ్చు.

దక్షిణేశ్వర్‌లో ప్రకృతిపై చేతనత్వ ప్రభావం గురించి చర్చిస్తున్నారు. ఒక భక్తుడు ఇలా అన్నాడు – "ప్రకృతి యొక్క ప్రభావం చేత ఒక చెట్టుకు ఒకే రకమైన పూలు ఉంటాయి. చేతనత్వ ప్రభావంతో రెండు రకాల పూవులను పూయించ వచ్చునా?" శ్రీరామకృష్ణ పరమహంస ఇలా అన్నాడు – "చేతనత్వ స్థాయిలో ఎటువంటి పరివర్తన అయినా సాధ్యమే."

రెండవ రోజు ఆ భక్తుడు వచ్చినప్పుడు ఆ గులాబి చెట్టు ఒక కొమ్మకు ఒక ఎరుపు రంగు గులాబి, ఒక తెలుపు రంగు గులాబి పూయడం చూసి చాలా ఆశ్చర్యపోయాడు. శక్తి సంపన్నులైన మహాపురుషులకు ఇది చాలా చిన్న విషయం ప్రజలకు విశ్వాసం కలిగించడానికి అప్పుడప్పుడు ఇలాంటిది సంఘటనలు చూపిస్తారు. ఇవి ప్రదర్శన కొరకు కాదు.

భగీరథుని తపశ్చర్యతో స్వర్గంలో ప్రవహించే గంగను పృథ్విపై ప్రవహింపచేశారు. ఇది ప్రకృతి యొక్క చేతనత్వంతో తాదాప్యం చెందడం వలన మానవ చేతనత్వానికి దానిపై అధికారం లభిస్తుంది అని అనడానికి ఒక ఉదాహరణ. అత్రి మహర్షి పత్ని అనసూయదేవి చిత్రకూట క్షేత్రంలోని "సురసరి" యొక్క ఒకధారను "మందాకిని" రూపంలో తన తపోబలంతో ప్రవహింపచేసింది. ఈ ఉదాహరణలు ఆ విజ్ఞానం యొక్క మహత్వాన్ని అర్థం చేసుకునేందుకు ఇవ్వబడ్డాయి. ఇటువంటి ప్రకృతిగత పరివర్తనలు ఈనాడు కూడా సంభవమే.

బ్రాహ్మీ చేతనత్వాన్ని పరమాత్మ సత్తా అని అంటారు. ఆయన సృష్టి యొక్క అధిపతి. ఇంతేకాదు, ఆయన తన సమగ్ర ప్రకృతి యొక్క మూసలో మానవ కాయకళేబరాన్ని తయారుచేశాడు. బ్రహ్మాండంలో ఉన్నదంతా పిండాండంలో ఉన్నది. పరమాత్మలో ఉన్నదానిని ఆత్మలో చూడవచ్చు, దానిని పొందవచ్చు.

పరమాత్మ ఒక ఒంటరి వ్యక్తి వంటివాడు కాదు. ఆయనతో పాటు స్థూల, సూక్ష్మ, కారణ శరీరముల అగణిత ఆత్మలు జోడింపబడి ఉన్నాయి. వీటిలో కొన్నింటి స్థాయి సాధారణ మైనది, కొన్ని ప్రముఖ దేవశక్తుల వంటివి. ఏవీ స్వచ్ఛందంగా లేవు, మాలలో పూసలవలె గుదిగ్రుచ్చబడి ఉన్నాయి. విద్యుత్తు తీగలలో ప్రవహిస్తూ ఉంటుంది. ఆ తీగలు ఎక్కడెక్కడికో పోతుంటాయి. ఈ తీగలలోని విద్యుత్తు ప్రవాహమును గమనించవచ్చు, దానిని ఉపయోగించుకోవచ్చు.

ఇదే విధంగా కుండలినీ బ్రహ్మాండీయ చేతనత్వంలో (పరాకృతి)లోని ప్రతి క్షేత్రంలో సంబంధం పెట్టుకోగలగటమే కాక అన్ని స్థాయిల ఆత్మలతో ఆవశ్యకతానుసారం తన

**ప్రశ్నించకపోతే సమాధానం ఏముంటుంది**

సంబంధాన్ని పెట్టుకోగలదు. ఈ సంబంధం ఉద్దేశ్యం లేకుండా జరుగదు. దాని వెనుక మహత్వపూర్ణమైన కారణం ఉంటుంది. ఇది చాలా పెద్ద ఉపలబ్ధి. సాధకుడు ప్రకృతి పరమేశ్వరులతో సంబంధం పెట్టుకోగలిగితే, ఇంధనం అగ్నితో జోడింపబడి అగ్నిగా మారినట్లు అవుతుంది.

టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నుండి టెలిఫోన్ కనెక్షన్ తీసుకుంటే ప్రపంచంలో ఏ వ్యక్తితోనైనా ఎక్కడ ఉన్నా మాట్లాడవచ్చు. ఇదేవిధంగా బ్రాహ్మీ చేతనత్వంతో సంబంధం పెట్టుకోగలిగితే విశ్వంలోని ఏ వ్యక్తికైనా, ఏ ప్రాణికైనా సందేశం, సంకేతం, ఆదేశాలు కోరిక పంపవచ్చు, ఒత్తిడి చేయవచ్చు. దానితోపాటే వారి సామర్థ్యానుసారం జవాబు కూడా అందుకోవచ్చు.

బ్రహ్మ సంస్థానమే బ్రహ్మరంధ్రము. దీనిపైనే సహస్రార కమలము ఉన్నది. దానిని ఉత్తరధృవమని కూడా అంటారు. బ్రహ్మాండీయ చేతనత్వం – ప్రకృతి శక్తి శరీరంలో ఉన్న క్షేత్రం మూలాధార చక్రం. విద్యుత్తు ప్రసారణకు మూలకేంద్రం ఇదేనని భావిస్తారు. మూలాధారం నుండి సహస్రారం వరకు గల దేవయాన మార్గమును వెన్నెముక కలుపుతుంది. ఇదే బ్రహ్మ దండం. షట్చక్రాలు, ఇడ, పింగళ, సుషుమ్నల త్రివేణి సంగమం కూడా ఇదే. కుండలినీ శక్తి యొక్క వివరణ మొత్తం ఈ పురాతన విద్య యొక్క మహత్తును ఆ సాధనా విధానము తెలియజేస్తుంది, చేతనత్వంపై నియంత్రణ సాధించేందుకు మానవ సామర్థ్యంపై రహస్యోద్ఘాటన చేస్తుంది.

*– అఖండజ్యోతి, జనవరి 1987*

## ఆత్మ యొక్క సంగీతము

*ఒక యువకుడు రమణ మహర్షి వద్దకు వెళ్ళి, మానవుడు తన జీవిత పరమార్థాన్ని తెలుసుకునే విధానమేది? అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నను విన్న రమణమహర్షి ఆ యువకుడిని చూసి, చిరునవ్వుతో ఇలా వివరించారు. "తన ఆత్మను మరియు దాని సంగీతాన్ని మౌనంగా వినుట ద్వారా జీవిత పరమార్థాన్ని తెలుసుకొనవచ్చు." ఆ జవాబును విన్న ఆ యువకుడు విస్మయముతో మౌనంగా కూర్చున్నాడు. మహర్షి మరల ఇలా తన అనుగ్రహ సంభాషణమును ఆ యువకునితో కొనసాగించారు. "ఎవరైతే తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారో, వారు అన్నింటినీ పొందగలరు. ఎవరు దానిని (కర్తవ్యాన్ని) నిర్వహించరో వారు తమ సర్వస్వాన్ని కోల్పోతారు."*

*దీనికి ఉదాహరణగా మహర్షి ఒక వృద్ధ కళాకారుని గురించి వివరించారు. ఒక వృద్ధుడైన సంగీత కళాకారుడు ఒక రాత్రి ఒక దట్టమైన అడవిలో ఒంటరిగా వెళ్తున్నాడు. అతని వద్ద చాలా బంగారు నాణాలు ఉన్నాయి, అతని చేతిలో ఒక వీణ కూడా ఉన్నది. మార్గమధ్యంలో బందిపోటు దొంగలు అతనిని చుట్టుముట్టి, అతని వద్దనున్న ధనాన్ని మొత్తం దోచుకుని, అతని చేతిలో ఉన్న వీణను కూడా లాక్కున్నారు. దానికి ఆ వృద్ధ సంగీత కళాకారుడు ఆ దొంగలతో ధనమును మీరు తీసుకోండి కానీ ఆ వీణను మాత్రం నాకు తిరిగి ఇవ్వండి అని వారిని ప్రార్థించాడు.*

*అతని మాటలు విన్న బందిపోటు దొంగలు ఆశ్చర్యపడ్డారు. బంగారు నాణెములను వదిలి, ఈ వీణను ఎందుకు అడుగుతున్నాడు. ఈ పనికిరాని వస్తువును మనము మాత్రం ఏం చేసుకుంటాము? అని ఆలోచించి, ఆ వీణను అతనికి తిరిగి ఇచ్చారు. ఆ వీణను తీసుకుని ఆ కళాకారుడు మిక్కిలి సంతోషించాడు. ఇక ఆ సంతోషముతో ఆ వీణను సవరించి, (శృతిచేసి) అలౌకికమైన రీతిలో వాయించాడు. అమావాస్య చీకటి రాత్రి నిర్జనమైన ప్రదేశమునందు ఆ స్వరాలలోని మాధుర్యం, మార్దవాల ప్రభావానికి ఆ దొంగల కన్నులు చెమ్మగిల్లాయి. తరువాత వారంతా గాయకుని పాదాల మీదపడి, అతని ధనమును అతనికి తిరిగి ఇచ్చివేశారు.*

*ఈ కథను చెప్పిన తరువాత రమణ మహర్షి ఆ యువకునితో ఈ విధముగా అన్నారు. "ఇదే ప్రతి మనిషి యొక్క పరిస్థితి. ప్రతిరోజు ప్రతి మనిషి కొల్లగొట్టబడుతూనే ఉన్నాడు. కాని వారిలో బుద్ధిమంతుడు మాత్రం తన ఆత్మ పట్ల ధ్యానమును నిలుపుకుని ఉంటాడు. ఎవరైతే ఈ విధంగా చేస్తారో, వారు అన్నింటినీ పొందగలరు."*

*– అనువాదం: కె. సరోజినిదేవి, ఒంగోలు*

**'ప్రశ్న' అనేది అనితరమైన సమాధానాన్ని అన్వేషించడానికి సాధనమవుతుంది**



గాయత్రీ జయంతి ప్రత్యేకం

# గాయత్రి యొక్క దివ్యశక్తి

గాయత్రీ సాధన చేసేవారు అనేక లాభాలు పొందుతారనేది మనమంతా చూసాము, విన్నాము. 24 అక్షరములతో కూడిన మంత్రమును జపించినా, సాధన చేసుకున్నా ఇన్ని లాభాలు ఏ విధంగా వస్తాయనేది ఆశ్చర్యకరమైన విషయము. ఈ అంశాన్ని సవ్యంగా అర్థం చేసుకోకపోవడం వల్ల చాలామందికి కొన్ని తప్పు అభిప్రాయాలున్నాయి.

గాయత్రీమంత్రము అనేది విశ్వవ్యాప్తమైన దివ్యతత్వము. ఇదే హ్రీం-బుద్ధి, శ్రీం-సమృద్ధి, క్లీం-శక్తి అనబడే త్రిగుణాత్మక విశేషములకు ఉద్గమస్థానముగా చెప్పబడింది. మహాచైతన్య మయమైన ఈ దైవీశక్తి విశ్వమంతా వ్యాపించియున్న పంచ తత్వములను ఆలింగనము చేసుకున్నప్పుడు అందులో రహస్యమయ ప్రతిక్రియలు ఎన్నో జరుగుతాయి. ఈశ్వరీయ దివ్యశక్తి, గాయత్రి పంచభౌతిక ప్రకృతియైన సావిత్రితో సమ్మిళితం అయ్యే సమయమునందు ఏ స్థితి ఉంటుందో ఆ స్థితిని ఋషులు తమ సూక్ష్మమైన దివ్యదృష్టితో చూసి సాధన కొరకు దానికి మూర్తిరూపాన్నిచ్చారు. విశ్వవ్యాపిని అయిన గాయత్రీ శక్తి ఆకాశతత్వమును ఢీకొట్టి శబ్దతన్మాత్ర రూపంలో ప్రతిధ్వనిస్తుంది. ఆ సమయంలో 24 అక్షరములతో కూడిన గాయత్రీ మంత్రముతో సమానమైన ధ్వనితరంగములు ఉత్పన్నమవుతాయి. స్థూలమైన మన చెవులతో ఆ శబ్దములను మనం వినలేము. ఋషులు తమ దివ్య కర్ణేంద్రియములతో సృష్టి యొక్క అంతరాళములో ఒక దివ్య ధ్వని తరంగములు ప్రతిధ్వనిస్తూ ఉన్నాయని వినగలిగారు. ఆ ధ్వని లహరులను వారు 24 అక్షరముల గాయత్రీ మంత్రములో పట్టుకోగలిగారు. ఈ ప్రకారంగానే అగ్నితత్వమునకు ఈ సూక్ష్మశక్తి తోడవు తున్నప్పుడు రూపతన్మాత్రలో ఉత్పన్నమైన ఆకృతి గాయత్రీ రూపంగా చెప్పబడింది. ఈ ప్రకారంగా వాయువు, జలము, పృథ్వీల యొక్క తన్మాత్రలతో అవి సమ్మిళితమైనప్పుడు జరిగే ప్రతిక్రియలైన స్పర్శ, రస, గంధములు గాయత్రితో జోడింప బడ్డాయి.

మానవశరీరమునందు ఉండే మనస్సు పంచతత్వములతో నిర్మితమై ఉంటుంది. పంచతత్వములతో గాయత్రీశక్తి సమ్మిళిత మవుతున్నప్పుడు సూక్ష్మజగత్తునందు జరిగే ప్రతిక్రియలు, వాటికనుగుణమైన మానసిక ప్రతిక్రియలను మనవైపు నుండి మనం మన మనోక్షేత్రములో ఉత్పన్నం చేసుకోగలిగితే చాలా తేలికగా గాయత్రీ శక్తి వరకు చేరుకోగలుగుతాము. ఈ పాంచభౌతిక జగత్తు మరియు సూక్ష్మ దైవీజగత్తుకు మధ్యగా ఋషులు ఒక త్రాడువలె, ఒక నిచ్చెనవలె ఉండడాన్ని మనం గమనించవచ్చు. వీటన్నింటిని వారు గాయత్రీ ఉపాసన రూపంలో మనముందుంచారు. మంత్రోచ్చారణ, ధ్యానము, తపశ్చర్య, వ్యవస్థ మొదలైనవాటితో పాటు చేసే సాధన అనేది ఒక వ్రేలాడుతున్న త్రాడువంటిది. దానిని పట్టుకొని మన భౌతిక చేతనత్వము, గాయత్రీ యొక్క సర్వశక్తివంతమైన దివ్యచేతనతో కలిసిపోతుంది. నందనవనంలోకి చేరుకోగానే ఎలాగైతే ఆకలి, దాహము తీరేందుకై అన్ని సాధనాలు లభిస్తాయో అదేవిధంగా గాయత్రీ సాన్నిధ్యము లభించగానే ఆత్మకుండే అన్ని దోషాలు, వాసనలు, తృష్ణలు, మలినాలు దూరమైపోతాయి. అప్పుడు స్వర్గీయ సుఖమును ఆస్వాదించ గలిగే అవకాశము లభిస్తుంది.

ప్రప్రథమంగా గాయత్రీసాధన ప్రభావము సాధకుని అంతఃకరణపై పడుతుంది. వారి ఆత్మభూమికయందు సత్త్వగుణ ప్రధానమైన తత్వములు అభివృద్ధి చెందడం మొదలవుతుంది. నీళ్ళతో నిండిన పాత్రలో కంకరరాళ్ళు వేస్తే నీళ్ళు పొర్లిపోవడం మొదలవుతుంది. ఈ ప్రకారంగా సత్త్వగుణము పెరిగినప్పుడు దుర్గుణములు, చెడు ఆలోచనలు, చెడు స్వభావము, చెడు భావములు తగ్గడం మొదలవుతుంది. ఈ మార్పువల్ల సాధకునిలో ఉత్పన్నమయ్యే విశేషతలు జీవితమును సరళముగా, శాంతితో, విజయాలతో నింపుకునేందుకు సహాయము చేస్తాయి. దయ, కరుణ, ప్రేమ, మైత్రి, త్యాగము, సంతోషము, శాంతి, సేవాభావము, ఆత్మీయత, సత్యనిష్ఠ, నిజాయితి, సంయమనము, నమ్రత, పవిత్రత, శ్రమశీలత, దయాపరాయణత వంటి మంచి గుణాలు రోజురోజుకీ వేగంగా పెరగడం మొదలవుతుంది. దానివలన వారి పట్ల అన్నిచోట్లా ప్రశంసలు, కృతజ్ఞత, ప్రత్యుపకారము, శ్రద్ధ, సహాయము, గౌరవ భావములనేవి లభిస్తాయి. అలా ప్రజలు వారికి తాము చేసిన ప్రత్యుపకారమునకు తృప్తిపడుతుంటారు. ఇవి మాత్రమే కాక ఈ సద్గుణములు ఎంత మధురమైనవంటే అవి ఏ

ప్రశ్నించనిదే అన్వేషణ జరుగదు

హృదయంలో నివాసముంటాయో అక్కడ ఆత్మసంతోషము అనే చల్లని ప్రవాహము నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఇటువంటి వారు జీవించి ఉన్నా, మరణించినా నిరంతరం స్వర్గీయ సుఖమును ఆస్వాదిస్తూ ఉంటారు.

గాయత్రీ సాధనలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే చతుష్టయము అసాధారణంగా చుట్టుముడుతుంది. అయితే వివేకము, ముందు చూపు, తత్వజ్ఞానము మరియు ఋతుంభరా ప్రజ్ఞ విశేషంగా ఉత్పన్నము కావడం చేత అజ్ఞానముతో కూడిన దుఃఖము నివారింపబడుతుంది. ప్రారబ్ధం వల్ల అనేక కష్టములతో కూడిన విపత్కర పరిస్థితులు ప్రతి ఒక్కరి జీవితములోను ఎదురవుతాయి. హాని, శోకము, వియోగము, ఆపదలు, రోగాలు, ఆక్రమణలు, విరోధము, అనుకోని దెబ్బలు వంటి విపత్కర పరిస్థితులలో సాధారణ మానసిక స్థితి ఉన్న ప్రజలు ఎక్కడైతే మృతతుల్యమైన మానసిక కష్టములను పొందుతారో సరిగ్గా అక్కడే ఆత్మబలముతో సుసంపన్నమైన గాయత్రీ సాధకులు తమ వివేకమును, జ్ఞానమును, వైరాగ్యమును, సాహసమును, ఆశను, ధైర్యమును, సంతోషమును, ఈశ్వరునిపై ఉన్న విశ్వాసము అనే ఆధారముల సహాయముతో ఈ కష్టాలనన్నింటిని నవ్వుతూ-నవ్వుతూ చాలా తేలిగ్గా దాటేస్తారు. భరించలేని పరిస్థితులలోనైనా, సాధారణ పరిస్థితుల లోనైనా తమ ఆనందము కొరకు మార్గమును వెతుక్కుని ఆనందంగా, ప్రసన్నంగా, ఎటువంటి వ్యాకులతలు లేకుండా జీవితాన్ని గడుపుతారు.

ప్రపంచంలోని కష్టాలన్నింటికీ మూడు కారణాలున్నాయి. 1) అజ్ఞానము 2) అశక్తి 3) లేమి. అంతఃకరణయందు సత్త్వగుణము పెరగడం వల్ల దుఃఖమును కలుగచేసే ఊహలు, భ్రాంతులు, కోరికలు అన్నీ సమాప్తమైపోయి మంచి గుణములు అభివృద్ధి చెందడం మొదలవుతుంది. ఈ గుణముల వల్ల సరైన ఆహార-విహారాదులు సంయమనముతో కూడిన, సువ్యవస్థితమైన జీవిత విధానము అలవడుతుంది. తద్వారా శారీరిక, మానసిక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యము, స్వచ్ఛత, మంచి రక్షణ అనేవి ఏర్పడతాయి. ప్రజల నుండి లభించే సహకారము మెరుగవుతుంది. అవసరాలు పరిమితమై, సామర్థ్యాలు ఉన్నా దేనికీ లోటు ఉండదు. అతనికి అన్ని వైపులా నిండుదనమే కనిపిస్తుంటుంది. ఎలాగైతే సారవంతమైన భూమిలో పెంచబడిన మొక్కలోని ప్రతిభాగము, అందులోని ఉపభాగాలు పరిపుష్టంగా, చక్కగా వికసించి ఉంటాయో, అదేవిధంగా గాయత్రి అనే ఆధారమును పట్టుకున్న మనిషి యొక్క శారీరిక, మానసిక, ప్రాపంచిక జీవితము నిరంతరము శాంతంగా, ఆరోగ్యంగా, సమృద్ధిని కలిగి ఉంటుంది.

ప్రాచీనకాలంలోని యోగులు, తపస్వులు, ఋషులు మునులు గాయత్రి ఆధారముగానే యోగసాధనలు చేసుకునే వారు. ఈ మహాశక్తిని ఆశ్రయించిన అనేకమంది రిద్ధి-సిద్ధులను ఎన్నింటినో పొంది ఆత్మసాక్షాత్కారమును, బ్రహ్మ నిర్వాణము యొక్క పరమానందమును పొందారు. గాయత్రిని భూలోకమందలి కామధేనువుగా చెప్తారు. ఎందుకంటే ఆమె ఉపాసన వల్ల అన్ని తృష్ణలు-అవసరంలేని, తీర్చడానికి వీలులేని అవాంఛనీయమైన కోరికలన్నీ స్థిమితపడి శాంతస్థితికి చేరుకుంటాయి. దానితో మనస్సు కోరికలన్నీ సంపూర్ణంగా తీర్చుకున్నంత తృప్తిని పొందగలుగుతుంది. కామధేనువు యొక్క పాలు త్రాగితే సమస్త పాపతాపాలు దూరమవుతాయంటారు. గాయత్రి అనే దివ్యరసమును త్రాగిన వారికి కూడా అటువంటి స్థితే లభిస్తుంది. గాయత్రిని బ్రహ్మాస్త్రమని కూడా చెప్తారు. అస్త్రము అంటే ఇతరుల ప్రాణములు తీయడానికి ఉపయోగించే ఇనుముతో చేసిన కత్తికాదు, ఆ శక్తితో జీవితమును దుఃఖ మయం చేసే సమస్యలన్నీ పరిష్కరించబడి, కష్టాల నుండి విముక్తి లభిస్తుంది. సొరంగం త్రవ్వాలంటే పెద్ద పెద్ద కొండలను కూడా డైనమేట్లతో పేల్చివేస్తారు. గాయత్రి అనే బ్రహ్మాస్త్రము యొక్క శక్తి కూడా అటువంటిదే. దీని ద్వారా ఉత్పన్నమయ్యే అగ్నిలో మానవుల, పదార్థాల, ప్రాంతాల, సమూహాల, పాపాల, దుఃఖదరిద్రములనే కుప్పలు మాడిమసైపోతాయి. ఈ కామధేనువును, ఈ బ్రహ్మాస్త్రమును పొందిన ఋషుల యొక్క బలం ముందు చక్రవర్తి కూడా తలదించుకోవలసిందే!

ఈ రెండు, మూడు శతాబ్దములలో వచ్చిన సంత్, మహాత్ములు అందరూ గాయత్రీసాధన చేసి మహత్వపూర్ణమైన స్థితిని పొందారు. ఈనాడు ఉన్నతస్థితిలో ఉన్న మహాపురుషులు ఎందరో గాయత్రీసాధన అనే తపస్సు ద్వారానే ఆ స్థితిని పొందారు. వేదమాత గాయత్రి కొంగుపట్టుకొని ఆమె ఒడిలోకి చేరిన గృహస్థులు, విరక్తులైన సంత్ మహాత్ములెందరో మాకు స్వయంగా తెలుసు. ప్రాపంచిక ఆనందానుభూతిలో ఓలలాడుతున్న సంపదలకన్నా ఆత్మిక సంపదలు చాలా విలువైనవి. మనస్సులో ఉండే అభిలాషలను తీర్చుకునేందుకు వేదమాత చాలా సహాయము చేస్తుంది.

ఆత్మ ఈశ్వరుని అంశ అయినందువల్ల ఏ శక్తులైతే ఈశ్వరునిలో ఉంటాయో ఆ శక్తులన్నింటినీ అది తనలో బీజరూపంలో దాచుకుంటుంది. అయితే పాప-తాపాలు,

**ఓటమి ఒప్పుకోకూడదు, ఓరిమి వదులుకోకూడదు**

విషయ-వికారాలు, దోష-దుర్గుణాలతో నిండిపోయినందువల్ల అది నిద్రాస్థితిలో అజ్ఞాతంగా పడి ఉంటుంది. అగ్నిపైన వరిపొట్టు పోస్తే అది అణిగి ఉంటుంది. వరిపొట్టును తొలగిస్తే తిరిగి జ్వాల పైకి లేస్తుంది. ఇంత చిన్న అగ్ని రవ్వ కూడా అవకాశం కలిసి వస్తే ప్రచండ దావానలంగా మారిపోతుంది. గాయత్రీ సాధన చేయడం వల్ల ఆత్మపై మలినాలతో పేరుకున్న ఆవరణ తొలగిపోతుంది. ఆ పొర తొలగిపోతే తుచ్ఛమైన ఈ మనిషి మహత్తరమైన ఆత్మగా, మహాత్మునిగా, పరమాత్మగా మారతాడు. అయితే ఆత్మలో జ్ఞాన-విజ్ఞానములు, సాధారణమైన-అసాధారణమైన, అద్భుతమైన, ఆశ్చర్యకరమైన శక్తుల భాండారము దాగి ఉంటుంది. అది తెరుచుకున్నప్పుడు సాధకుడు సిద్ధయోగి రూపాన్ని పొందుతాడు. సిద్ధులను పొందేందుకై బయట నుండి ఏమీ తెచ్చుకోనవసరం లేదు. దేవ-దానవుల కృపవంటివి ఏమీ అవసరం లేదు. కేవలం మన అంతఃకరణపై పడి ఉన్న ఆవరణను తొలగించుకుంటే చాలు. సాధనారూపియైన సూర్యుని వల్ల మనలో ఉండే అయోగ్యత, మనపై ఆవరించి ఉన్న తుచ్ఛమైన విషయాలతో నిండిన పొరలు అన్నీ కరిగిపోతాయి. అప్పుడు ఆత్మకుండే స్వభావసిద్ధమైన నిర్మలమైన రూపము, అన్ని రకాల రిద్ధి-సిద్ధులతో పరిపూర్ణతను సంతరించుకుంటుంది.

గాయత్రీ మంత్రం మంత్రములకు రారాజుగా చెప్పబడు తుంది. మిగిలిన ఏ ఇతర మంత్రములతోనైనా చేయగలిగే పనులను గాయత్రీమంత్రముతో కూడా చేయవచ్చు. ప్రజలు తమ యొక్క వివిధ కష్టములను నివారించుకునేందుకై అనేక మంత్రములు, తంత్రములు, జపాలు, సాధనలు, అనుష్ఠానాలు, పురశ్చరణలు వంటివి చేస్తుంటారు. ఈ కార్యములన్నీ కేవలం గాయత్రితో పూర్తిచేయవచ్చు. శరీరములో ఏవైనా విష పదార్థాలు, వికారాలు నిండిపోతే ఆ స్థితినే రోగము అంటారని ప్రకృతి చికిత్సకులకు తెలుసు. ఉపవాసము, ఫలాహారము, ఎనీమా, మట్టినీళ్ళతో చేసే ఉపచారముల ద్వారా ఈ రోగములన్నీ దూరమైపోతాయి. ఈ రోగాలన్నింటికి కారణం ఒకటేనని, అందుకు ఒకే చికిత్స ద్వారా వీటినన్నింటినీ సరిచేయడం కూడా సాధ్యమేనని వారు చెప్తారు. అదేవిధంగా గాయత్రీవిద్య యొక్క ఆచార్యుల ప్రకారము ఆత్మకు సంబంధించి భూమికయందు సత్త్వగుణము తగ్గడమే అన్ని రకాల కష్టాలకు, క్లేశాలకు కారణము. సత్త్వగుణము పెరుగుతూ ఉంటే దోషాలు కూడా తగ్గుముఖం పడతాయి. ఇదే దోషములు, దుఃఖములు పోగొట్టుకునేందుకు మనవద్ద ఉన్న ప్రత్యక్ష ఉపాయము.

పాపము, చెడు అలవాట్లు, సంయమనం లేకపోవడం, అపవ్యయం, స్వార్థము, నీచమైన స్వభావం, దుర్బుద్ధి వలన అనేక రకాల దుఃఖాలు కలుగుతాయి. గాయత్రి వలన పెరిగే సత్త్వగుణశక్తివల్ల ఈ విషవృక్షాల వేర్లు అన్నీ తెగిపోవడం మొదలవుతుంది. ఫలితంగా అనేక కష్టాలు, దుఃఖాలు, భయాలు, శోకము వాటంతటవే చల్లారిపోతాయి. గాయత్రీ ఉపాసకులు తాము చేస్తున్న సాధన తమను అనుకోని ఎన్నో ఆపదల నుండి ఎలా రక్షించిందో అనుభవంతో చూడగలరు. బయట నుండి చూస్తే అది అనుకోకుండా, అనాయాసంగా లభించిన దైవీవరదానంగా అనిపిస్తుంది, కానీ దీని వెనుక ఒక వైజ్ఞానిక ప్రక్రియ ఉంది. లోపల సంస్కరింపబడడం మొదలైతే అది బయటకు ప్రకటమవడం సహజమే. బాగా మురికి, దుర్గంధములతో నిండిపోయి రోతపుట్టించే విధంగా ఉండే కోట శుభ్రపరచబడి, మంచి సుగంధములతో నింపబడితే అది అందరినీ తనవైపుకు ఆకర్షిస్తుంది. గాయత్రీ సాధకులకుండే విరోధులు, శత్రువులు, దుఃఖమును కలుగజేసే వ్యక్తులెవరైనా సరే వారి మిత్రులుగా, సహచరులుగా, సుఖమును కలుగజేసే వారిగా మారిపోతారు. అందులో ఆశ్చర్యపడవలసినదేమీ లేదు.

ఈ ప్రపంచము అద్దము వంటిది. ఇందులో మనం చేసే మంచి, చెడు అన్నీ కనిపిస్తాయి. వాటన్నింటికి కారణం మనమే. మన యొక్క గుణ, కర్మ, స్వభావాలు మన చుట్టూ ఉండే వాతావరణాన్ని నిర్మిస్తాయి. కనుక మనకు మనమే శత్రువులం. ఆత్మ నిర్మాణమనే కార్యక్రమము గాయత్రి ద్వారా చాలా సులభంగా, ఉత్తమంగా, సూక్ష్మవైజ్ఞానిక ప్రక్రియతోపాటుగా జరుగుతుంది. ఈ పరివర్తన మన అజ్ఞానమును, అశక్తిని, అభావమును త్రుంచి వేస్తుంది. ఫలితంగా మనకుండే ఆంతరిక దుఃఖములు, దరిద్రములు అన్నీ పోతాయి.

గాయత్రి అనంత సుఖ-శాంతులకు తల్లివంటిది. దీనివల్ల ఈ జన్మలో ఎదురయ్యే కష్టాలు దూరమై, సుఖసంపదలు పెరుగటయే కాక ఆత్మపరమైన ఆలోచనా సరళి, కార్య ప్రణాళికను సిద్ధంచేసుకోవడం వంటి అతి సుందరమైన మార్పులు జరుగుతాయి. మరుసటి జన్మలో మోక్షం లభించినా, లభించకపోయినా స్వర్గతుల్యమైన సుఖసంపదలు మాత్రం సంపూర్ణంగా లభిస్తాయి.

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 14 (1.14) నుండి*
*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**అహోరాత్రులు కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి**

మనం - మన ఆరోగ్యం

# సరియైన ఆహారవిధానం ద్వారా పౌష్టికాహార లోపమును అధిగమించవచ్చును

పౌష్టికాహారలోపం మరియు ఆహారసమస్యలు అన్నవి తగినంత పోషకాహారము లభించని కారణముగా ఉత్పన్న మవుతాయి అని పెద్దలు అంటుంటారు. శరీరవిజ్ఞానవేత్తల ద్వారా నిర్దేశించబడిన సంతులిత ఆహార జాబితాను అనుసరించి భోజనవ్యవస్థను ధనవంతులు మాత్రమే అమలుపరచి స్వీకరించ గలిగేదే కానీ, సామాన్యులకు తలకుమించిన భారమవుతుంది. అయినా సంతులిత ఆహారము లభించినవారందరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎక్కడ ఉంటున్నారు? పేదప్రజలను చిన్న చిన్న వ్యాధులు, బలహీనతల వంటి ఆరోగ్యసమస్యలు పట్టిపీడిస్తాయి. ధనవంతులను మరోరకము రోగములు చుట్టుముడతాయి. ఆరోగ్యము-అనారోగ్యము అన్నవి ధనము లేక దారిద్ర్యముతో నలుసంతైనా సంబంధము లేని అంశములు అన్న విషయము మనము చుట్టుప్రక్కల దృష్టిని సారించినప్పుడు చక్కగా బోధపడుతుంది. అన్నిరకాల సుఖసౌకర్యాలతోపాటు పౌష్టికాహారము ఇబ్బడిముబ్బడిగా, సులభముగా అందుబాటులో ఉండే ధనవంతులుకూడా రోగాల బారినపడుతున్నారు. అంతగా పౌష్టికాహారము లభించని, అతి సామాన్యమైన భోజనముకూడా లభించడము కష్టమైన నిరుపేదలు సైతము కొన్నిచోట్ల ఆరోగ్యముతో వర్ధిల్లుతుంటారు.

ఇక్కడ పౌష్టికాహారము యొక్క గొప్పతనమును కించ పరచటము లేదు. సరైన పోషణ లేకపోవడము వలన తలెత్తే సమస్యలు చింతాకువలె చిన్నవనీ చెప్పటము లేదు. పోషణ లేకపోవడము అన్నది తనకు తానే ఒక జటిలమైన సమస్య. పౌష్టికాహారము లభించినప్పటికీ జనులు ఎందుకు రోగాల బారినపడుతున్నారు అన్నదే ఇక్కడ ప్రశ్న. అలాగే పుష్టికరమైన భోజనము అందరికీ అందుబాటులో ఉండదు. అయితే లభించిన ఆ కొద్దిపాటి ఆహారమును సరైన పద్ధతిలో భుజించాలి, త్రాగాలి అన్న కొద్దిపాటి జ్ఞానమైనా సామాన్య జనులకు ఉండదు. పేదవారైతేనేమి, ధనవంతులైతేనేమి... అందరూ ఏ ఆహారపదార్థమునైనాసరే సరైన పద్ధతిలో వండకపోవుట చేత ఆహారములో ఉన్న పోషకతత్వములను ఉడికించడము, వేయించడము ద్వారా నష్టపరచుకుంటున్నారు. రుచికోసమైతేనేమి, అజ్ఞానము వల్లనైతేనేమి లోటుపాట్లతో కూడిన పద్ధతులలో వండుట చేత ఆహారములో ఉన్న పోషక తత్వములు నశించిపోతుంటాయి. తత్కారణముగా ఇక సారహీనమైన, పోషకరహితమైన పిప్పిమాత్రమే తినటానికి మిగులుతుంది.

శరీరశాస్త్రవేత్తల అభిప్రాయము ప్రకారము ఆరోగ్య సంరక్షణకు ఆవశ్యకమైన రసాయనములలో ముఖ్యమైనవి- కాల్షియమ్, ఫాస్ఫరస్, ఇనుము, పొటాషియమ్ అన్నవి ప్రకృతి అందించిన ఫలములలో, తాజా కూరగాయలలో సమృద్ధిగా లభ్యమవుతాయి. ఆ రసాయనాలను ఔషధరూపములో స్వీకరించినప్పుడు అవి అంతగా రక్తములో కలవవు. అదే ఫలములు మరియు కూరగాయల ద్వారా సమకూరినప్పుడు అవి శరీరములో అంగములా అని అనిపించేంతగా కలిసి పోతాయి. ఉసిరి, టొమాటో, బత్తాయి వంటివాటిలో విటమిన్-సి అధిక మోతాదులో ఉంటుంది. నిత్యము చౌకగా లభించే క్యారెట్, కాలీఫ్లవర్ వంటి సామాన్యమైన కూరగాయలను తింటే విటమిన్-ఎ సంపూర్ణముగా లభిస్తుంది. ఏ ప్రాంతములోనైనా అవలీలగా పండించగలిగి, చౌకగా లభించే అరటిపండులో విటమిన్-ఎ,బి,సి,డి,ఇ సమృద్ధిగా ఉంటాయి.

ప్రపంచములోని ఇతర దేశములతో పోలిస్తే మన దేశములో పండ్లు, కూరగాయలకు కొంత కొరత కనపడు తున్నది. కొన్ని ఫలములు అధికధరలు పలుకుతున్నప్పటికీ వాటి స్థానములో చౌకధరలకు అందుబాటులో ఉండే ఫలములతో మన పని జరుపుకొనవచ్చును. జామ, మామిడి, రేగు మొదలైనవి ఆయా ఋతువులలో మనకు చౌకగానే దొరుకుతాయి. ఋతువులకు అనుగుణ్యముగా సాగుచేయబడే ఖర్జూరము, ఒకరకమైన తియ్యదోసకాయ, పుచ్చకాయ వంటి ఫలములు సైతము ఖరీదైన ఫలముల స్థానే ఆర్థికముగా బలహీనముగా ఉన్న పేదవారి అవసరములను తీరుస్తాయి. క్యారెట్, టొమాటో, బెండకాయ, ముల్లంగివంటి కూరగాయలను

**చెప్పుకోదగిన స్థాయి వచ్చినా అహంకారాన్ని, అర్భాటాన్ని దరిచేయనీయకూడదు**

పచ్చివిగానే తినవచ్చును. నిమ్మకాయ, ఉసిరిలు అన్ని ఋతువులలో చౌకగానే దొరుకుతాయి. అవి అధికధరలు పలికే ఏ ఫలములకు తీసిపోవు.

అయితే తాజాకూరలను, ఆకుకూరలను వండుతున్నప్పుడు సముచితమైన జాగ్రత్తలు పాటించినచో వాటి ఉపయోగము లాభదాయకంగా ఉంటుంది. అందుచేత తాజా కూరగాయలనే ఎన్నుకోవాలి. చౌకధరకు దొరుకుతాయని ఆశించి వాడిపోయిన, నిల్వచేయబడిన, మెత్తబడినవాటిని కొనరాదు. ఒకవేళ డబ్బుకు కక్కుర్తిపడి అటువంటివాటిని కొన్నామే అనుకోండి, అప్పుడు వాటిని తప్పక వండుకుని తినవలసి వస్తుంది. కొనుక్కున్నాము కదా అని వాటిని వండుకుని తింటే సమస్యలు తలెత్తుతాయి. డబ్బులు ఖర్చయ్యాయి అనే బాధను తగ్గించుకునేందుకు ఆరోగ్యమును పణముగా పెట్టి ఇబ్బందులలో కూరుకుపోవడము బుద్ధిమంతుల, విజ్ఞుల లక్షణము కాదు.

కూరగాయలను, ఆకుకూరలను వండే ముందు పైన పేరుకుపోయిన మాలిన్యము పోయేటట్లుగా తప్పనిసరిగా చాలా శుభ్రముగా కడగాలి. ఆ తరువాత వాటిని తినటానికి వీలుగా మెత్తబడేంతవరకు మాత్రమే ఉడికించాలి, బాగా మెత్తబడి గుజ్జయ్యేంతవరకు ఉడికించినా లేదా బాగా వేయించినా పోషకతత్వములు నష్టమైపోతాయి.

సాధ్యమైనంతవరకు కూరలను, ఆకుకూరలను, పప్పులను, పప్పుదినుసులను నీటిలో మరిగించే బదులు ఆవిరిమీద ఉడికించటమే మేలు. పెద్దమంట మీద కాకుండా సన్ననిమంట మీద వండినప్పుడు పోషకతత్వములు అధికముగా నిలిచి ఉంటాయి. నీరు తెర్లుతున్నప్పుడు, ఆ నీటిలో కూరగాయ ముక్కలను వేయాలి. మొదట్లోనే వేసేస్తే కనుక అవి ఎక్కువసేపు మంటమీద ఉడికి తమ స్వగుణములను పోగొట్టుకుంటాయి. ఆవిరి కుక్కర్‌లు ఉపయోగించడము ఉత్తమము. అయితే వంట చేస్తున్నప్పుడు పదార్థములు ఉడకటానికి సరిపడా నీళ్ళుమాత్రమే పోయాలి తప్ప ఎక్కువ నీరు పోసి చివరన ఆ నీటిని వంపెయ్యకూడదు. అలా చేస్తే ఆ పదార్థములలో ఉండే సారమంతా కొట్టుకు పోతుంది, నీటితోపాటే నేలపాలవుతుంది. లేదంటే ఒకపని చెయ్యవచ్చు. ఆ నీటితో సూప్ చేసుకుని త్రాగినా మంచిదే.

సాధ్యమైనంతవరకు కూరగాయలను తొక్కతోపాటు వండాలి. పైపెచ్చు లేదా పొర గట్టిగా ఉండేవి, తినుటలో ఇబ్బంది కలిగించేవాటి పెచ్చునే తీసివేయాలి. ఫలములను కూడా ఈవిధముగానే భుజించాలి.

ఇనుప బాండీ ఉపయోగించడము చాలా పెద్ద ప్రమాదముతో కూడుకున్న పని. అది పదార్థములను నలుపెక్కేలా చేస్తుంది, పదార్థముల అందము పోతుంది అంటే వండినవి కళ్ళకు ఇంపుగా కనపడవు. అవి కలుషితమైపోతాయి, పైగా సరిగ్గా జీర్ణము కావు. వేయించడము, నూనెలో దేవటము వలన ఆహారపదార్థములు ఎందుకూ కొరగాకుండా పోతాయి. పూరీలు, మిఠాయిలు మొదలైనవి బాణలిలో నూనెపోసి వేయించి లేదా నిప్పులమీద కాల్చి వండుతారు. ఇలా వండబడిన బరువైన ఆహారము తింటే పొట్ట బరువెక్కి భుక్తాయాసము రావడముతోపాటు, పొట్టకూడా ముందుకు వచ్చి శరీరం అందవిహీనమవుతుంది. ఇటువంటి ఆహారమును భుజించినంతసేపు జిహ్వాచాపల్యము తృప్తి పడుతుంది. కానీ దానివలన ధనము, శ్రమ రెండూ ఖర్చయి పోవటమే కాదు, జీర్ణప్రక్రియ దెబ్బతిని, అనారోగ్యము పాలవుతారు. ఇలా జరగటము ఏవిధముగా చూసినా మంచిదికాదు. ఆరోగ్యము మీద దాని దుష్ప్రభావము బాగా పడుతుంది. మనిషి ఆరోగ్యమును దెబ్బతీసే ఆ మూకుడిని వంటిల్లుకు ఎంత దూరముగా ఉంచితే అంత మంచిది!

పంట దిగుబడి వచ్చినప్పుడు తాజా ధాన్యము లభిస్తుంది. ఎండబెట్టి, పొట్టుతీసిన ధాన్యముకంటే అప్పుడే ఇంటికి వచ్చిన తాజా పచ్చి ధాన్యము ఎంతో మెరుగైనది, పోషక విలువలను కలిగి ఉంటుంది. గోధుమలు, బఠాణి, సజ్జలు మొదలైనవాటిని కొద్దిగా కాలిస్తే అవి మరింత పౌష్టికాహార పదార్థములుగా రూపొందుతాయి. కొన్నింటిని పచ్చివిగానే తినవచ్చు లేదా కొద్దిగా ఉడికించి అయినా, మొలకెత్తించి అయినా తినవచ్చు. ఎండిపోయిన వాటిలో జీవనతత్వములు అత్యంత స్వల్పముగా ఉంటాయి. అయితే విత్తనాలను కొద్దిగా పరిమాణములో మొలకెత్తింపజేస్తే వాటిలోని పోషకతత్వములు ద్విగుణీకృతము అవుతాయి. జీర్ణక్రియ అతి తేలికగా జరుపగలిగే నూతన రసాయనములు వాటిలో ఉద్భవిస్తాయి. మొలకెత్తిన

**ఎందుకు ఇలా జరిగిందో ముఖ్యం కాదు, ఇప్పుడు ఏమి చెయ్యాలనేదే ముఖ్యం**

విత్తనాలలోని అణువులు అమినోయాసిడ్ రూపములోకి మారతాయి. అప్పుడు వాటి పోషకశక్తి మరియు త్వరగా జీర్ణమయ్యే సామర్థ్యము ఇనుమడిస్తుంది. మొలకెత్తిన విత్తనములు-ఫలములు, తాజాకూరగాయలు మరియు మాంసాహారముకన్నా ఎన్నో రెట్లు శ్రేష్ఠమైనవి. పోషక విలువలను అధికపాళ్ళలో అందిస్తాయి. గోధుమలు, సోయాబీన్స్, పెసలు, సజ్జలు, సెనగలు, బఠాణి, వేరుశనగ వంటివాటిని పిండిగా గాని లేదా ఉడికించిన పదార్థములుగా కాని తినేబదులు మొలకెత్తిన విత్తనాలుగా వాటి స్వాభావిక రూపములోనే స్వీకరించినచో అవి ఎంతో మేలును కలుగ జేస్తాయి.

ఉడికించని విత్తనాల మీద చేసిన ప్రయోగాలలో 'గోధుమల రసము'ను త్రాగే ఒక క్రొత్త పద్ధతి ప్రస్తుతము ప్రాచుర్యములో ఉన్నది. ఇలా త్రాగటము మెరుగైనదేనని ప్రయోగములు చేసేవారు, త్రాగేవారు ఇద్దరూ వెల్లడిచేస్తున్నారు. అమెరికాకు చెందిన రచయిత్రి విరామోర్ 'వీట్‌గ్రాస్ మాన్యువల్' అనే తన పుస్తకములో తన ప్రయోగాలను, అనుభవాలను విస్తారముగా వర్ణించినది. ఏరకమైన గోధుమల రసమును ఉపయోగించి నట్లయితే పలురకాల రోగముల చికిత్సకు పని కొస్తాయో, తమ ప్రభావమును చూపిస్తాయో విశదీకరించినది. ఈ గోధుముల రసం పేరు 'హరిత రక్తము' (green blood) అని, అది రక్తములో 40% వరకు త్వరగా కలిసిపోతుందని చెప్పింది.

ఆరోగ్యవంతుడైన వ్యక్తి ఈ గోధుమరసమును త్రాగినచో అతని శరీరములో జీవనశక్తి ఇనుమడిస్తుంది. పైగా రోగుల శరీరములో రోగనిరోధకశక్తి ఆశ్చర్యకరమైన రీతిలో వృద్ధి చెందుతుంది. ఒక మంచి ఔషధరూపములో లభించే అతి విలువైన పోషణతత్వములు దీనిద్వారా సమకూరుతాయి. దీనిని ఏ రోగమునకైనా ఔషధముగా ఇవ్వవచ్చును. ఎవరైనా సరే దీనిని ఒక సర్వశ్రేష్ఠమైన టానిక్ రూపములో స్వీకరించవచ్చును అని కూడా చెప్పింది.

గోధుమగడ్డితో ఆకుపచ్చరంగు రక్తమును చాలా సులభ పద్ధతిలో తయారుచేయవచ్చును. కొన్ని చిన్న గిన్నెలు లేదా పాత పాత్రలలో ఎరువును కలిపిన మట్టిని నింపాలి. వాటిలో ఒక చక్కని వరుసక్రమములో గోధుమవిత్తనాలను నాటాలి. వాటిని నీడలో పెంచుతూ, తగుమాత్రపు నీటిని పోయాలి. 3 లేక 4 రోజులలోనే ఇవి అంకురిస్తాయి. 10 రోజులలో సుమారు 7, 8 అంగుళముల పొడవు పెరుగుతాయి. ఈ రీతిలో 10 నుండి 12 రోజులలో మొదట నాటిన విత్తనముల నుండి 30 నుండి 40 అంగుళములు ఎదిగిన మొక్కలను వేళ్ళతో సహా పెకలించి, వేళ్ళను త్రుంచివెయ్యాలి. పై భాగమును బాగా శుభ్రము చేసి కొద్దిగా నీటిని చేర్చి రసమును తయారు చేసి, చివరగా వడకట్టి రసమును వేరు చెయ్యాలి. ఇలా తయారైన రసమును ప్రతినిత్యము ఒక గ్లాసు చొప్పున త్రాగినచో కావలసిన పోషకతత్వములు అమితముగా లభిస్తాయి. మర్నాడు, ఆ తరువాత నాటిన విత్తనముల ద్వారా ఎదిగిన మొక్కల నుండి రసమును తయారు చేసుకుని త్రాగవచ్చును. వేళ్ళతో సహా పెకలించిన మొక్కల స్థానములో మరల క్రొత్త విత్తులను నాటి ఈ క్రమమును ఇలాగే కొనసాగించాలి.

ఈ గోధుమగడ్డి యొక్క అద్భుతమైన సత్పరిణామములను సవిస్తరముగా వర్ణిస్తూ విరామోర్ మరో ప్రయోగమును కూడా వివరించినది. అయితే గోధుమగడ్డికి సమానమైనదికాదుకానీ, ఇదీ మంచి ఫలితాలనే ఇస్తుంది. ఆ పద్ధతి ఇలా ఉంటుంది. ఒక అరకప్పు శుభ్రము చేసిన గోధుమలను ఒక గ్లాసు లేదా పింగాణీ గిన్నెలోకి తీసుకొని 2 కప్పుల నీటిని పోసి, మూత పెట్టి 12 గంటలపాటు నానబెట్టాలి. ఆ తరువాత గోధుమల లోని నీటిని వంపేసి, వాటిని చేత్తో బాగా నలిపి పొట్టుతీసి, వాటితో పిండిని తయారుచేసుకుని ఉపయోగించు కొనవచ్చును. నానబెట్టగా వచ్చిన నీరు కూడా శ్రేష్ఠమైనదే.

ఈరకముగా ఆహారపదార్థములను వాటి స్వాభావిక రూపములోనే సాధ్యమైనంతవరకు భుజించాలి. వాటిని తక్కువ వేయించాలి, ఉడికించాలి. వాటిలోని పోషకతత్వములు నశించి పోకుండా చూసుకోవాలి. చౌకగా లభించే ఆహార పదార్థములలో సైతము వాటి పోషకతత్వములు నిలిచి ఉండేటట్లుగా సాధారణమైన జాగ్రత్తలు వహించి వంటింట్లోనే పౌష్టిక ఆహారమును సులభముగా అందరూ పొందవచ్చును.

*- యుగనిర్మాణ యోజన, మార్చి 1981*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**బాధ్యతను బరువుగా చూడకూడదు.**

సాధనా విజ్ఞానం

# మూలబంధం, ఉడ్డియాన బంధం మరియు జాలంధర బంధముల రహస్యం

ప్రాణమయకోశ సాధనలో బంధాలకు ప్రముఖ స్థానం ఉన్నది. ధ్యానాత్మక ఆసనాల నుండి పూర్తిగా లాభం పొందాలంటే వాటితో పాటు ఈ మూడు బంధాలను సాధన చేయాలనే విధానాన్ని యోగులు ప్రవేశపెట్టారు. ప్రాణాయామానికి ఈ బంధాలు సహకరిస్తాయి, పూరిస్తాయి. విడిగా చేయడం వల్ల వీటి ప్రయోజనం ఉండదు, ధ్యానాత్మక ఆసనాలు, ప్రాణాయామాలతో పాటు మాత్రమే మానసిక, ఆధ్యాత్మిక ఉన్నతి రూపంలో ఫలం లభిస్తుంది. బంధాలు మూడు రకాలు 1) మూల బంధం, 2) ఉడ్డియాన బంధం, 3) జాలంధర బంధం.

## 1. మూల బంధం

ప్రాణాయామం చేసేటప్పుడు గుదా ద్వారాన్ని పైకి ముడిచి పట్టి ఉంచడాన్ని మూలబంధం అంటారు. గుదాద్వారాన్ని ముడిచి ఉంచడం వల్ల 'అపానం' స్థిరపడుతుంది. వీర్యం అధోగతి పాలవకుండా స్థిరంగా ఉంటుంది. ప్రాణం కూడా అధోగతి పట్టకుండా ఊర్ధ్వగతినే పొందుతుంది. మూలబంధం వలన మూలాధారంలోని కుండలినీ చైతన్యం ఉత్పన్న మవుతుంది. పేగులు బలపడతాయి, మలబద్ధకం ఉండదు, రక్తప్రసరణ మెరుగుపడుతుంది. మూలబంధ ప్రభావం అపానం మీద కూర్మం మీద ఉంటుంది. అవి ఏ ఏ కణాల్లో విస్తరించి ఉన్నాయో, చెల్లాచెదురుగా ఉన్నాయో, ఒక చోటకి ఏకత్రిత మవడం మొదలవుతాయి.

ధ్యానపూర్వకంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తే మూలబంధ క్రియ దానంతటదే అర్ధమవుతుంది, ఆచరించడానికి సులువవు తుంది. దీనికి రెండు ఆధారాలున్నాయి. ఒకటి – మల మూత్ర ద్వారాల మధ్య మడమను మెల్లిగా ఒత్తిపెట్టడం. రెండు–గుదా ద్వారాన్ని సంకోచించడంతో పాటు మూత్రేంద్రియ నాడులను పైకి లాగడం.

దీని కోసం ఎన్నో ఆసనాలు ఉపయోగించవచ్చు. వజ్రాసనం వేసుకుని కాళ్ళపై కూర్చుని, జననేంద్రియ మూలం మీద స్వల్పంగా ఒత్తిడి రానివ్వాలి.

రెండవ ఆసనంలో, ఒక కాలుని బారుగా చాచి, రెండవ కాలుని మడిచి, మలమూత్ర మార్గంలోని మధ్య భాగం మీద మడమ ఒత్తుకునేట్టు కూర్చోవాలి. ఒత్తిడి స్వల్పంగానే ఉండాలన్నది ఖచ్చితంగా గుర్తుంచుకోవాలి. ఎక్కువ ఒత్తిడి వల్ల అక్కడి నాడులు దెబ్బతినే అవకాశం ఉంటుంది.

సంకల్పశక్తితో గుదా ద్వారాన్ని మెల్లి మెల్లిగా పైకి లాగి, మెల్లగానే వదిలేయాలి. గుదా ద్వారం సంకోచనం వల్ల మూత్ర నాడులు వాటంతటవే ముడుచుకుని పైకి లాగుతాయి. వాటితో పాటే ఊపిరి పైకి పీల్చుకోవాలి. మొదట్లో ఈ ప్రక్రియ పది సార్లు చేయాలి. తరువాత వారానికి ఒకటి చొప్పున పెంచుకుంటూ 25 సార్ల వరకు చేయవచ్చు. ఈ క్రియ అశ్వినీ ముద్ర లేదా వజ్రోలి క్రియ అనే పేర్లతో కూడా పిలవబడుతుంది. దీన్ని చేసేటప్పుడు కామోత్తేజన కేంద్రం మేరుదండ మార్గం నుండి విడిపోయి, మేరుదండ మార్గం నుండి పైకి పాకుతూ మస్తిష్క మధ్య భాగంలో స్థిరంగా ఉన్న సహస్రార చక్రాన్ని చేరుతోంది అని ధ్యానించాలి. ఈ క్రియ కాముకతను నియంత్రించి, కుండలినీ జాగరణకు సహకరిస్తుంది. దీనిని మూలబంధం అని ఎందుకన్నారంటే, మానవ శరీర మూలాన్ని కట్టేస్తుంది కాబట్టి.

## 2. ఉడ్డియాన బంధం

పొట్టలోని పేగులను వెనుకకు లాగే క్రియని ఉడ్డియాన బంధం అంటారు. పొట్టను ఎంత వీలైతే అంత వెనుకకు లాగే ప్రయత్నం ఈ బంధంలో చేస్తారు. ఈ బంధం మృత్యువును జయిస్తుందని అంటారు. జీవనీశక్తిని పెంచి, దీర్ఘాయువుతో జీవితాన్ని స్థిరంగా ఉంచుకోవచ్చు. పేగులలో నిష్క్రియత దూరమవుతుంది. జలోదరం, పాండురోగం, కాలేయ వాపు, మూత్రపిండ వ్యాధుల వంటి రోగాల నుండి ఈ బంధం వల్ల చాలా ఉపశమనం లభిస్తుంది. నాభిలోని 'సమాన' మరియు 'కృకల' ప్రాణాల్లో స్థిరత్వం మరియు వాత, పిత్త, కఫాలలో శుద్ధి జరుగుతుంది. సుషుమ్న నాడి తెరుచుకుంటుంది. స్వాధిష్ఠాన చక్రంలో చైతన్యం రావడం వల్ల, కొద్దిపాటి కృషితోనే అది జాగృతమవగలదు.

ఈ బంధంలో పొట్ట వ్యాపించాలి, సంకోచించాలి. సామాన్య

**బాధ్యత తీసుకోకుండా పని చేస్తున్నామని అనుకుంటే అది అభివృద్ధికి పనికిరాదు**

ఆసనంలో కూర్చుని మేరుదండాన్ని నిటారుగా ఉంచి పొట్టని సంకోచింపచేస్తూ, వ్యాపింపజేస్తూ ఉండాలి.

ఈ స్థితిలో ముందు ఊపిరి పీల్చి, వీలైనంత ఎక్కువ పొట్టను వ్యాపింపజేయాలి, తరువాత ఊపిరి వదిలేసి, ఎంత వీలైతే అంత పొట్టను లోపలికి లాగాలి. ఇలా మళ్ళీ మళ్ళీ చేయాలి. ఊపిరి తీసుకోవడం, వదలడం మెల్లిగా చేయాలి. తొందరపాటు తగదు.

ఈ క్రియ చేస్తున్నప్పుడు పొట్టలోని అవయవాలకు వ్యాయామం అవుతున్నట్టు ధ్యానించాలి. వాటి సక్రియత పెరుగుతోంది. జీర్ణక్రియ సామర్థ్యం పెరుగుతోంది. మల విసర్జన క్రియ కూడా సక్రమంగా జరుగుతోంది. అత్యాశ, అవినీతి సంపాదన, అసమయమనం, బద్ధకంవంటివన్నీ సమసిపోతున్నాయని ధ్యానించాలి. జీర్ణకోశం, పేగులు, కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు మొదలైన ఉదర అవయవాలన్నింటిపైనా దీని ప్రభావం ఉంటుంది. ఆరోగ్య దౌర్బల్యాలన్నీ పోయి, బలవత్తరంగా మారుతాయి.

**ఉడ్డియానబంధాన్ని మూలబంధానికి ఉత్తరార్థం అని కూడా అనవచ్చు.** ఎందుకంటే ఇందులో కూడా అధోముఖమైన వాటిని ఊర్ధ్వముఖంగా ప్రయాణింపచేసే ప్రయత్నం జరుగుతుంది. స్వాధిష్ఠాన చక్రం జాగృతమై, విద్యుదయస్కాంత ప్రవాహాల ద్వారా అక్కడి ఆటోనామిక్ సంస్థానంలోని (autonomic nervous system) నాడి వ్యవస్థ ఉత్తేజితమై సుషుమ్నలో ప్రసుప్తంగా పడి ఉన్న ద్వారం తెరుచుకుంటుంది. శరీరంలో స్ఫూర్తి, జీవనీశక్తిలో వృద్ధి, పేగుల్లో సక్రియత మరియు అన్నమయకోశ సాధనలో ప్రారంభిక సాధన పూర్తవడం అనేవి మిగిలిన లాభాలు.

### 3. జాలంధర బంధం

తలను వంచి గడ్డాన్ని కంఠ కూపానికి (పక్కటెముకలు అతుక్కునే చోట ఒక గొయ్యిలాగా ఉండే స్థలాన్ని కంఠ కూపం అంటారు) ఆనించడాన్ని జాలంధర బంధం అంటారు. జాలంధర బంధంలో శ్వాస క్రియలపై నియంత్రణ ఉంటుంది. జ్ఞాననాడులు బలపడతాయి. ఈ బంధం 16 ప్రదేశాలను ప్రభావితం చేస్తుందని హఠయోగంలో పేర్కొన్నారు. కాలి బొటను వేలు, చీలమండ, మోకాలు, తొడలు, డయాఫ్రమ్, లింగం, నాభి, హృదయం, గర్భాశయం, కంఠం, తాలువు (అంగిలి), నాసిక, భృకుటి, కపాలం, మూర్ధ్న స్థానం, బ్రహ్మరంధ్రం. జాలంధరబంధం విశుద్ధిచక్ర జాగరణకి చాలా సహాయ పడుతుంది.

జాలంధర బంధంలో మఠం వేసుకుని నిటారుగా కూర్చోవాలి. గడ్డాన్ని వంచి ఛాతికి ఆనించే ప్రయత్నం చేయాలి. గడ్డం ఎంతవరకు ఛాతిని అందుకోగలిగితే అంతవరకే ఆనించాలి. బలవంతంగా వంచకూడదు. మెడ పట్టేసే అవకాశాలు ఉన్నాయి.

ఈ క్రియలో కూడా గడ్డాన్ని వంచి, మళ్ళీ పైకి తెచ్చే క్రమం నడుపుతూ ఉండాలి. శ్వాసక్రియ సామాన్యంగా జరపాలి. దీనివల్ల అనాహతం, విశుద్ధి, ఆజ్ఞా చక్రాలపై ప్రభావం, ఒత్తిడి పడుతుంది. మస్తిష్క సంస్థానానికి 'కపాల భాతి' వంటి ప్రయోజనం కలుగుతుంది. తెలివి, దూరదృష్టి రెండూ పెరుగుతాయి. అహంకారం తొలగిపోతోంది, వినమ్రతతో కూడిన సౌజన్యం వికసిస్తోంది అని మనసులో భావించాలి.

జాలంధర బంధంలో తలవంచి, గడ్డాన్ని కంఠ కూపానికి ఆనించి ధ్యాసను స్థిరపరుచుకోవాలి. చిత్తవృత్తులను శాంతింపజేసి, మెదడును ఒత్తిడి లేకుండా ధ్యానానికి వీలుగా మార్చాలి. విశుద్ధిచక్ర జాగృతికి ఇది ఎంతగానో సహకరిస్తుంది. ప్రాణాయామంలో కుంభకం చేసేటప్పుడు ముఖ్యంగా దీన్ని ప్రయోగిస్తారు. **మూడు బంధాలు ఒకేసారి ప్రయోగిస్తే ఆ స్థితిని మహాబంధం అంటారు.** ప్రాణమయ కోశాలన్నింటిని సంస్కరించి, చక్రాలు జాగృతమవడానికి సహకరిస్తుంది, మానసిక సక్రియత పెంచుతుంది, అతీంద్రియ సామర్థ్యాలను జాగృతపరుస్తుంది.

– *పూజ్యగురుదేవుల వాఙ్మయం 13 (5.3) నుండి*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## సమాజ శ్రేయస్సు

*కలాపి అనే ఆయన ఒక సుప్రసిద్ధ గుజరాతి కవి. ఒకసారి ఒక పండితుడు వచ్చి శృంగారము, కరుణ మొదలైన నవరసాలలో మీకిష్టమైన రసమేది? అని ఆయనను అడిగాడు. దానికి ఆయన 'సమాధానమిస్తూ సమాజ హితమునకు ఏది ఉపయోగపడుతుందో అదే నాకు ఇష్టమైన రసం. అది ఏ రసమైనా ఒక్కటే అని అన్నాడు.*

*– అనువాదం: పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**ఎవరో చెప్పింది చేయడంకంటే మీరే బాధ్యతగా చేస్తేబాధ ఉండదు**

యజ్ఞ విజ్ఞానం

# అణువికిరణాల నియంత్రణ

అణు ఆయుధాల నిర్మాణంలో యురేనియంని ఉపయోగిస్తారు. ఈ ఖనిజం ద్వారా ఏ వస్తువులు తయారైనా, వాటి నుండి దాని వికిరణాలు నలువైపుల విస్తరిస్తాయి. కేన్సర్ రోగులకు రేడియం చికిత్సను హాస్పిటల్‌లో జరుపుతూ ఉంటారు. మొదట్లో దీని ప్రభావం బయటకు తాత్కాలికంగా కనిపించక పోవచ్చు. కానీ కొంతకాలం పిదప మెల్లమెల్లగా శరీరమంతా వ్యాపించి లుకేమియా (blood cancer) వంటి భయంకర రోగాలు పుట్టుకొస్తాయి.

ఆధిపత్య పోటీలో చాలా దేశాలు అణు ఆయుధ నిర్మాణం కొరకు ముందుకు దూకుతున్నాయి. అవి ఎలా పనిచేసేది వాటిని పరీక్షించినప్పుడు తెలుస్తుంది. భూమిలోపల, గాలిలో, సముద్రాలలో, ఇసుక ఎడారుల్లో వాటి ప్రయోగ పరీక్షలు ఎక్కడ జరిపినా కొద్ది సమయంలోనే వాటి ప్రభావం కొన్ని మైళ్ళ పరిధిలో విస్తరిస్తుంది. అయితే ఆ ప్రభావం మెల్లమెల్లగా విస్తరిస్తూ పోయి, వనస్పతులు జీవ జంతు ప్రాణుల మీద, మానవుల మీద తన 'విషాన్ని' వెదజల్లుతుంది. విద్యుత్ తయారీ కొరకు అణురియాక్టర్లు ఏర్పాటు జరుగుచున్నాయి. దానిలో ఆఖరిగా మిగిలే 'అణు బూడిద' ఎక్కడ పోయాలనేది పెద్ద ప్రశ్నగా శాస్త్రజ్ఞుల ఎదుట ఉన్నది. దానిని ఎక్కడ వదిలినా దాని వికిరణాలు దూరదూరాల వరకు విస్తరించి పోగలవు. వాటిని వదిలిన ప్రాంతంలో నివసించే ప్రాణులన్నీ దాని విష ప్రభావం సోకి భయంకర రోగాల పాలై మృత్యు ముఖంలోకి చేరిపోగలవు.

ఒకసారి అమెరికా 'ఏటాల్' నిర్జన ద్వీపం మీద అణు పరీక్ష జరిపింది. అణు వికిరణ ప్రభావం ఎంత దూరం వరకు పడుతుందనేది తెలుసుకొనుట కొరకు ఈ ప్రయోగం జరిపారు. విస్ఫోటనం జరిగిన కొద్ది సమయానికే అక్కడ నుండి 50 మైళ్ళ దూరంలో నివసించే రోజీలాండ్ ద్వీపం వరకు చేరింది. అక్కడ నివాసమున్న ప్రజలు రోగాల పాలవటం తెలియగానే వారందరిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించి వారందరికి వైద్య సహాయం అందించుట జరిగింది. వైద్యం అందినా చాలామంది భయంకర రోగాలకు గురై విలవిలలాడి మరణించారు. కొద్ది సమయంలోనే ఈ వికిరణ ప్రభావం దూరదూరాలకు వ్యాపిస్తుందని ఈ ప్రయోగం ద్వారా శాస్త్రజ్ఞులు తెలుసుకోగలిగారు.

అణు వికిరణ ప్రభావం మెల్ల-మెల్లగా వ్యాప్తి చెందుతుంది. ఒక విధంగా నీటి అలలవలె వాటి ప్రయాణం ఉంటుంది. అది తన ప్రభావాన్ని చూపుతూ ప్రపంచంలోని సమస్త క్షేత్రాలను వదలకుండా అన్నింటిని తమ వికిరణాలతో చుట్టిముట్టి వేయగలవు. అణుశక్తి శస్త్రాల నిర్మాణములోనే గాకుండా ఇంకా ఎన్నో పనులకు వినియోగించుకోగల ప్రయోగాలు జరుగు తున్నాయి. వాటన్నింటిలోని అధికాంశం ద్వారా నాశనకారి వికిరణాలు వ్యాప్తి చెందుతాయి.

మరొక సంఘటన ఇంగ్లాండులో జరిగినట్లు తెలిసింది. 'విదర్‌కేల్' పేరున్న ప్రాంతంలో ఒక అణురియాక్టర్ పని చేస్తూ ఉండేది. అందులో నుండి ఎక్కడో ఒకచోట చిన్న రంధ్రం ఏర్పడి అణు వికిరణాలు బయటకు రావటం ప్రారంభమైంది. దాని ప్రభావం మార్కెట్‌లో అమ్మబడే ఆహార పదార్థాల మీద పడసాగింది. దాంతో వాటిని తిన్నవారు రోగులుగా మారటంతో, విషయం తెలిసిన వెంటనే ఆ రియాక్టర్‌ని మూసి వేయుట జరిగింది.

అలాగే ఒకసారి సూదిబెజ్జమంత రంధ్రం ద్వారా అణు వికిరణం (విషక్తత) సముద్రంలో జారిపడినందున, దాని ఫల స్వరూపంగా 24 గంటలలో 100 మైళ్ళ పొడవు, 15 మైళ్ళ వెడల్పులోని సముద్ర జలానికి ప్రభావం సోకి విషమయ మయ్యాయి.

అణు వికిరణాలు వాయు మండలంలోని చేరి భూమికి రక్షణ కవచం అయిన ఓజోన్ పొరను పలచన చేసి రంధ్రం చేయటంతో, సూర్యుని నుండి వచ్చు అనేక తీవ్రమైన కిరణాలు భూమిని చేరి, అధిక ఉష్ణోగ్రతకు కారణమవుతుంది. దానితో ధృవ ప్రాంతాలలోని మంచుకొండలు కరిగి సముద్రంలో కలిస్తే భయంకర వరదలు వచ్చి భూఖండాలు మునిగిపోయే ప్రమాదమున్నది. కాబట్టి అణు వికిరణాలు వాయు మండలంలో చేరకుండా, సూర్యకిరణాలను శక్తివంతంగా

**ఇష్టంగా బాధ్యత స్వీకరిస్తే అది కష్టం కాదు**

వడపోసే ఓజోన్ పొరకు చిల్లులు పడనీయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోగలగాలి.

వాయు మండలంలో వెదజల్లబడే అణు వికిరణాల సక్రియత వేల సంవత్సరాల వరకు నిలచి ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావాన్ని పూర్తిగా పోవాలనుకొంటే కొన్ని వేల సంవత్సరాలు పట్టవచ్చు. ఈ అవధిలో దాని ప్రభావానికి లోనై ఎందరో రోగాల బారిన పడగలరు. ఎందరో వికలాంగులుగా మారవచ్చు. ఎంతమంది దీనికి బలైపోతారో అనే విషయం ఎంతమాత్రం అంచనా వేయలేము.

అన్నింటికన్నా పెద్ద చిక్కుప్రశ్న ఈ అణు రియాక్టర్లలో మిగిలిపోయే అణుబూడిదను ఏమి చేయాలి? అమెరికాలోని ప్రఖ్యాత ఓకరిజ్ నేషనల్ లేబరేటరీ లోని శాస్త్రజ్ఞులు ఈ పనికిమాలిన చెత్తనంతటిని భూగర్భంలో పాతిపెట్టాలని నిర్ణయించారు. భూమిలో 300 అడుగుల లోతున పెద్ద గుంటను త్రవ్వి అందులో ఈ అణు అవశేషాలను (బూడిదను) పూడ్చివేసారు. కొన్ని రోజుల వరకు ఈ ప్రయత్నం చాలా సఫలమైందని అనుకొన్నారు. అయితే ఒకసారి భూమిక్రింద ఏర్పడిన భూకంపంతో ఏర్పడిన కుదుపుతో ఆ గొయ్యి పేలి, అణు వికిరణశక్తి బయటపడి పరిసర ప్రాంతం లోని వనస్పతులను, ప్రాణులను, మనుషులను తన ఘాతుక ప్రభావాన్ని చూపటం జరిగింది. శాస్త్రజ్ఞులు ఈ ప్రయోగం విఫలమైనట్లు ప్రకటించారు.

అణుశక్తి నుండి అనేక లాభాలను పొందాలని ప్రతివారు అనుకొంటారు. కానీ దాని నిర్మాణ ప్రారంభంలో ఆఖరి సమయంలో వికిరణం చెందగల దాని అవశేషాలను ఏం చేయాలనేది ఎవరికీ తెలియదు. దానికి విరుగుడు ఉపాయం కనిపెట్టకపోతే, చివరకు అదే భస్మాసుర హస్తంలాగా మారి మహావినాశనానికి కారణమవగలదు.

హాస్పిటల్‌లో జరిపిన పరీక్షలలో, కోమల శరీరంగల చిన్న పిల్లల మీద, ఈ వికిరణ ప్రభావం అధికంగా పడినట్లు తెలిసింది. 24 దేశాలలో జరిపిన పర్యవేక్షణల్లో ఆఫ్రికాలో 44 మంది పిల్లలలో నుండి ఒకరు, ఆస్ట్రేలియాలో 53 మందిలో ఒకరు, ఈజిప్టులో 86 మందిలో ఒకరు, మలేషియాలో 93 మందిలో ఒకరు వికలాంగులుగా మారినట్లు తేలింది. అన్ని దేశాల మధ్య సగటున వికిరణం విస్తరించిన మీదట 116 మంది పిల్లల్లో ఒకరు వికలాంగునిగా మారినట్లు తేలింది.

ఇందుకు కారణం అణు వికిరణమేనని అనుకోవడం జరిగింది. ఎక్కడ వికిరణం ఎక్కువగా ఉందో అక్కడ ఈ నిష్పత్తి అధికంగా ఉంది. ఎక్కడ వాయు సంచలనం తక్కువగా ఉందో, అక్కడ దీని దుష్ప్రభావం చాలా తక్కువగా ఉంది.

ఈ అణు వికిరణను విస్తరించకుండా ఆపగలిగే శక్తి యజ్ఞం ద్వారా వెలువడే ధూమానికి ఉందని తెలుసుకోవటం జరిగింది. ఇటువంటి అణువిజ్ఞానం భారతీయులకు కొత్తదేమీ కాదు. భారతీయ మహామనీషులు చాలాకాలం ముందే ఈ అణువాదం మీద విస్తృత శోధనలు జరిపారు. ఇందువలన తేలిందేమి టంటే ఆ కాలంలోనే ఈ శక్తి మీద ఎన్నో ప్రయోగాలు జరిపి ఉండవచ్చు. దీని దుష్ప్రభావం నుండి రక్షింపబడుటకు యజ్ఞ ప్రక్రియ ప్రోత్సాహించబడి ఉండవచ్చు.

మశూచి నిర్మూలన అన్వేషణలో డా॥ డాపకిన్స్ యజ్ఞం ద్వారా ఈ రోగాన్ని నివారించుటలో మంచి ఉపయోగ పడగలదని తెలుసుకున్నాడు. ఫ్రాన్స్‌దేశపు విజ్ఞాని ప్రొ॥ విల్‌వర్ట్ కూడా చక్కెర ధూమం ద్వారా మశూచిని, అగ్నిమాంద్యం వంటి అనేక రోగాలను కలిగించే రోగాణువులను నాశనం చేయుటలో సహాయపడగలదని తెలుసుకొన్నాడు. డా॥బాయలిట్ అనే ఆయన కిస్‌మిస్, ఆవు నెయ్యి, చక్కెర ధూమం ద్వారా 'టైఫాయిడ్' నివారణలో గొప్ప లాభాలను చూపగలదని చెప్పాడు.

రష్యాలో ఆవుపేడతో అలికిన ఇంటి మీద వికిరణ ప్రభావం తక్కువగా పడుతుందని తేలింది.

హరిద్వార్‌లోని 'బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థానం' లో జరిగిన ప్రయోగ పరీక్ష ద్వారా విభిన్న రోగాల కొరకు, వివిధ రకాల యజ్ఞధూమంతో గొప్ప సఫలతను సాధించుట జరిగింది. కాలిఫోర్నియాలోని అగ్నిహోత్రి యూనివర్సిటీ యొక్క పరిశోధనలో (వసంత పరాంజపే-అక్కల్‌కోట్ నివాసి) కూడా మంచి ఫలితాలు పొందుట జరిగింది. యజ్ఞ ప్రక్రియ ద్వారా మానవుల శారీరక-మానసిక రోగాల భయంకరతను ధ్యానంలో ఉంచుకుని సురక్షాత్మక సాధన దృష్టిలో యజ్ఞ విజ్ఞానాన్ని వికసింపచేసుకోగలిగితే, ఇది అత్యంత సామాజిక సేవగా, అత్యంత మహత్వపూర్ణ కార్యంగా మారిపోగలదు.

*- అఖండజ్యోతి, ఆగస్టు 1985*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**మనస్ఫూర్తిగా 'నాది' అనుకుంటుంటే ఇష్టంగా స్పందిస్తారు**

# పరామనోవిజ్ఞానము ఇప్పుడు నిర్ధారించబడిన అంశము

ఇంద్రియముల సామర్థ్యము స్థూలజగత్తు వరకు మాత్రమే పరిమితమై ఉంటుంది. స్థూలజగత్తును దాటి మరికొన్ని అజ్ఞాత లోకాలున్నాయి. అతీంద్రియ సామర్థ్యము కలిగినవారికి మాత్రమే వాటిగురించిన జ్ఞానము కలుగుతుంది. అతీంద్రియ సామర్థ్యము ద్వారా దేవతల దర్శనము, భవిష్యత్తును గురించిన కలలు రావటము మొదలైన అలౌకిక అనుభూతులు లభిస్తాయి. సాధకులు, తపస్వులు అయిన వ్యక్తుల జీవితాలు ఇలాంటి అలౌకిక సంఘటనలతో నిండి ఉంటాయి. సాధారణ మానవులు కూడా తమ మానసికస్థితిని సాత్వికంగా ఉంచుకొనుట ద్వారా ఇలాంటి అనుభూతులను పొందగలరు. నేటి నవీన యుగములో దీనిని 'కల్పన'గా ఎవ్వరూ భావించటము లేదు. ఆధునిక పరామనో విజ్ఞానము అనే ఈ విషయమును గురించి పలువిధములైన పరిశోధనలు, అన్వేషణలు జరుగుతున్నాయి.

ఈ విషయమై కొన్ని ప్రామాణికమైన పరిశోధనా గ్రంథాలు కూడా లభిస్తున్నాయి. వానిలో వాస్తవమైన సంఘటనల గురించి వర్ణించబడి ఉన్నది సీజర్.డీ. వెస్మీ అనే రచయిత వ్రాసిన 'ద హిస్టరీ ఆఫ్ స్పిరిచ్యువలిజమ్' మరియు ఎరిక్ డింగ్‌వాల్ వ్రాసిన 'ఘోస్ట్స్ ఎండ్ స్పిరిట్స్ ఇన్ ఏన్షియంట్ వరల్డ్' అనే రెండు పుస్తకములు ప్రముఖమైనవి. ఈ పుస్తకాలలో వ్రాయబడిన వ్యాఖ్యానాలను బట్టి ఇంద్రియాల పరిధికి ఆవల ఒక జ్ఞానమున్నది, దానినే అతీంద్రియజ్ఞానము అంటారు.

గ్రీకు దార్శనికవేత్త అయిన ప్లూటార్క్ తాను వ్రాసిన 'దజోనియో సోక్రటీస్'లో సుకరాతు జీవితానికి సంబంధించిన అనేక సంఘటనల గురించి వివరించారు. సుకరాతు లోపల ఒక దెయ్యముండేదని, అది జరగబోయే సంఘటనల గురించి సుకరాతుకు సూచనలిచ్చేదని ఈ పుస్తకములో వ్రాయబడినది. ఒక సాయంకాలము సుకరాతు, తిమార్కస్ అనే వ్యక్తి, మరికొందరు స్నేహితులు కలిసి భోజనానికి కూర్చున్నారు. కొంచెముసేపటి తరువాత తిమార్కస్ ఎక్కడికో వెళ్ళటానికిగాను తను కూర్చున్న చోటునుండి లేచి నిలబడ్డాడు. నువ్వున్న చోటు నుండి కదలవద్దు అని సుకరాతు తిమార్కస్‌కు చెప్పాడు. తిమార్కస్ కూర్చున్నాడు. కొద్దిసేపటి తరువాత తిమార్కస్ మరల లేచి నిలబడగా మళ్ళీ సుకరాతు కూర్చో బెట్టాడు. ఈవిధంగా తిమార్కస్ ఎన్నిసార్లు లేస్తే అన్నిసార్లు సుకరాతు కూర్చోబెడుతూ నాకు ఇప్పుడిప్పుడే నీకేదో ప్రమాదము జరుగబోతున్నదనే హెచ్చరిక వస్తున్నది' అన్నాడు. చివరకు తిమార్కస్ సుకరాత్ మాటలను పెడచెవినిపెట్టి చెప్పా పెట్టకుండా నిశ్శబ్దంగా లేచి వెళ్ళిపోయాడు. దారిలో కొంతమంది కుట్రదారులు చేతిలో చిక్కుకుని మరణించాడు.

భవిష్యత్తు స్వప్నాల ద్వారా కూడా తెలుస్తూ ఉంటుంది. వీనిని నమ్మినవారు లాభపడ్డారు. దీనిని కల్పనగా భావించి కొట్టివేసిన వారు ఆపదలో ఇరుక్కున్నారు. స్వప్నాలద్వారా వెల్లడైన భవిష్యత్తును గురించిన ఒక చారిత్రాత్మక సంఘటన ఉన్నది. జూలియస్ సీజర్ భార్యకు ఒకనాటి రాత్రి తన భర్త విగ్రహము నుండి రక్తము కారుతున్నట్లుగా కలవచ్చింది. మరునాడు ఉదయము సీజర్ తన పార్లమెంట్ సమావేశానికి బయల్దేరుతుండగా ఆమె అతనిని వెళ్ళకుండా అడ్డుకున్నది. తన భార్య ఇంతగా కలతచెందటము సీజర్ ఎప్పుడూ చూడలేదు. స్వప్న ప్రభావము వల్ల ఆమె అంతరంగము క్షుబ్ధమై వేదనతో నిండియుండుట చేత ఆమె అతడిని పార్లమెంట్‌కు వెళ్ళనీయకుండా ఒకసారి ఆపింది. కానీ రెండవసారి అతడు పార్లమెంట్‌కు వెళ్ళడము, భయంకరమైన హానికి గురవటం జరగనే జరిగింది.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చరిత్రకారుడు హిరోడోంట్స్, లాడాకు రాజైన కోశస్‌లో ఉన్న అతీంద్రియశక్తుల గురించి వివరించాడు. క్రీ.పూ. 560, 546 సంవత్సరాల మధ్యనున్న తన యొక్క పరిపాలనాకాలములో ఆ రాజు పెరిగిపోతున్న శత్రువుల ప్రాబల్యము వల్ల ఆందోళన చెందాడు. దానికి సరియైన పరిష్కారమార్గమును అన్వేషించేందుకు మంచి జ్యోతిష్కుడి కోసము ప్రకటించాడు. వచ్చినవారిలో ఏడుగురిని పరీక్ష నిమిత్తమై ఎన్నుకున్నాడు. ఏడుగురిలో డెల్ఫీ నుండి వచ్చిన భవిష్యవాణి సత్యమైనదిగా ధృవీకరించబడినది. ఆయన చెప్పిన వివరణకు రాజు ఎంతో ప్రభావితుడైనాడు. తనవద్దకు రాజు యొక్క సందేశమును తీసుకువచ్చిన వ్యక్తితో డెల్ఫీ ఇలా చెప్పాడు. మీ రాజుగారు మూతపెట్టబడున్న ఒక పెద్ద ఇత్తడి పాత్రలో ఒక తాబేలు, కొన్ని గొఱ్ఱెలతో కలిసి వేయించబడుతున్నాడు. ఇది నిజంగా ఆశ్చర్యమును కలిగించే ఒక సత్యము. దీని తరువాత తన పట్ల విశ్వాసమును కలిగిన రాజుకు తన యొక్క అతీంద్రియ శక్తి సహాయముతో డెల్ఫీ ఎన్నోవిధాలుగా మేలు చేకూర్చాడు.

గొప్ప భవిష్యత్‌జ్ఞాతగా పేరుగాంచిన ఏలేశా తనకున్న ఈ అతీంద్రియజ్ఞానమును ప్రయోగించి, సిరియాలోని సైనికుల

**పోయినచోటే వెతుక్కోవాలి**

రహస్యాలను తెలుసుకునేవాడు. ఈ జ్ఞానముతోనే మహాభారత యుద్ధము జరుగుతున్నప్పుడు సంజయుడు ధృతరాష్ట్రునికి యుద్ధసమాచారమును ఎప్పటికప్పుడు అతను ప్రత్యక్షంగా చూస్తున్నాడా అనిపించేటంత స్పష్టంగా విశదీకరించగలిగాడు. స్వీడెన్‌బోర్గ్ అనే వ్యక్తి కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉన్న తన గ్రామంలో జరుగుతున్న భీషణ అగ్నికాండను గురించి తనకున్న అతీంద్రియ జ్ఞానముతో తన కళ్ళకు కట్టినట్లుగా వివరించ గలిగాడు.

గొప్ప దార్శనికవేత్త అయిన కాంట్ ఈ అతీంద్రియశక్తి ద్వారా ప్రత్యక్షీకరణాన్ని నమ్మేవాడు. ఆయన తాను వ్రాసిన 'డ్రీమ్ ఆఫ్ ఎ బిలీవర్' అనే పుస్తకములో ప్రఖ్యాతిగాంచిన వైజ్ఞానికుడు, గణిత శాస్త్రవేత్త అయిన స్వీడెన్‌బోర్గ్ యొక్క ఒక అనుభవాన్ని వివరించాడు. ఆ అనుభవమిలా ఉన్నది. 'ఒక శనివారమునాటి సాయంకాలము సుమారు 4 గంటలకు బోర్గ్ ఇంగ్లండ్ నుండి గోహన్‌బోర్గ్‌కు వెళ్తున్నాడు. ఉన్నట్లుండి ఆయన చికాకు చెందసాగాడు. తన సహాధ్యాయులందరినీ వదలివేసి ఆయన ఒంటరిగా బయటకు వెళ్ళి తిరగసాగారు. తిరిగి లోపలికి వచ్చిన ఆయన తన సహాధ్యాయులతో, 'ఇప్పుడే స్టాక్‌హోమ్‌లోని మా ఇంటికి సమీపంలో పెద్ద భయంకరమైన అగ్ని ప్రమాదము జరిగింది. అగ్నిజ్వాలలు వేగంగా వ్యాపిస్తున్నాయి' అని చెప్తూ ఎంతో ఉద్విగ్నతకు లోనయ్యాడు. సుమారు 8 గంటల ప్రాంతంలో ఆయన కొంచెము సమాధానపడి ప్రశాంతవదనంతో 'భగవంతునికి నా ధన్యవాదాలు! ఆ నిప్పు మా ఇంటికన్నా 20 ఇళ్ళకు ముందే ఆర్పివేయబడినది' అని చెప్పాడు. కాంట్ ఈ ఘటనతో ఎంతో ప్రభావితుడైనాడు.

బొకారియో వ్రాసిన డాంటే యొక్క జీవితములో కూడా కుతూహలమును కలిగించే ఇలాంటిదే ఒక సంఘటన లభిస్తుంది. ఇందులో డాంటే యొక్క మృతాత్మ అతని పుస్తకములో అసంపూర్తిగా ఉన్న భాగమును పూర్తిచేయటానికి సహాయ పడుతుంది. ది డివైన్ కామెడీ అనే పుస్తకమును వ్రాసిన గొప్ప రచయిత యొక్క మరణము తరువాత దాని ఆఖరు భాగములోని కొంత భాగము కనిపించలేదు. ఎంత వెదికినా లభించక పోవడముతో ఆయన పుత్రులు స్వయంగా వ్రాసి ఆ పుస్తకమును పూర్తిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భముగా డాంటే ఒక పుత్రుడు జాకోయాకు కలలో డాంటే కనిపించారు. ఆలోచనలలో ఉన్న జాకోయా వెంటనే డాంటేను ఆ చివరి పంక్తులు గురించి అడిగాడు. అప్పుడు డాంటే అతడిని పాత ఇంటిలోని ఒక గదిలోకి తీసుకువెళ్ళి ఆ గది గోడను స్పృశిస్తూ 'దేనికోసమైతే నీవు దిగులుపడుతున్నావో అది ఇందులో ఉంది' అని చెప్పాడు. జాకోయా వెంటనే లేచి ఇతర కుటుంబ సభ్యులను తీసుకొని తన తండ్రి మరణించటానికి ముందు నివసించిన ఇంటికి వెళ్ళాడు. డాంటే సూచించిన గోడకు ఒక పటము వ్రేలాడుతున్నది. దానిని తొలగించగా దాని వెనుక 13 పద్యాలు కనిపించాయి. వాటిని జోడించడముతో అసంపూర్ణముగా ఉన్న ఆ పుస్తకము పూర్తయ్యింది. అప్పటికే ఆ చేతివ్రాత ప్రతి కూడా చాలా శిధిలావస్థకు చేరుకున్నది.

స్వప్నాల ద్వారా లభించే ఇలాంటి జ్ఞానము నిజంగా అద్భుతమైనది, అలౌకికమైనది. ఇలాంటివే ఇంకా మరికొన్ని సంఘటనలు కూడా ఉన్నాయి. క్రీ.శ. 1857 వ సంవత్సరానికి చెందిన ఈ సంఘటనలో ఎమ్ రావెల్ అనే వ్యక్తి ఎలెన్ కోర్డెక్ పేరుతో అదృశ్య ప్రేతాత్మలచే రచించబడిన ఒక పుస్తకమును ప్రచురించాడు. ఆ పుస్తకము దాదాపు ప్రపంచ భాషలన్నింటిలోకి అనువదించబడినది. అలాగే శివరామకింకర యోగత్రయానంద గారి విషయములో 'పాణిని యొక్క ఆత్మ స్వయముగా వచ్చి ఆయనకు వ్యాకరణ సూత్రాలను బోధించినది' అని ఒక కథగా చెప్పుకునేవారట!

తూర్పుదేశాల ప్రజలకు అతీంద్రియశక్తి సామర్థ్యములతో సంపూర్ణమైన పరిచయమున్నది. ఐతే ఆ జ్ఞానము ఇక్కడివరకే అని చెప్పటంలో అతిశయోక్తి ఎంతమాత్రము లేదు. పాశ్చాత్య ప్రజలకు కూడా దీని గురించి తెలుసు. కాంట్, గేటే, శేలింగ్, హీగల్ వంటి తత్వవేత్తలందరు ఈ సత్యమును హృదయాంగమము చేసుకున్నవారే.

పైన చెప్పబడిన వివరణలు, వర్ణనలు కేవలము కుతూహలానికో, కల్పించి చెప్పినవో కావు. ఇది సత్యమైన ప్రక్రియ. మనస్సే దీనికి సంపూర్ణమైన ఆధారము. మనస్సు సాత్వికతతో నిండి ఉంటే రాబోయే సంఘటనల యొక్క సూచనలు ముందుగా కలలో లభిస్తాయి. మంచి మనస్సులతో సాధన చేయుటద్వారా కూడా అనుభూతులతో తాదాత్మ్యము చెందవచ్చు. ఈవిధమైన భవిష్యత్ వాణిని జాగ్రదావస్థలో కూడా పొందగలము. సాధన, పుణ్యము, ప్రగాఢమైన, ప్రబలమైన సంకల్పము కలిగి ఉన్నట్లయితే సచేతన స్థితిలోనైనాగాని, జాగ్రదవస్థలోనైనాగాని దైవీదర్శనము సంభవమే! మానవుని మానసికస్థితికి అనుగుణముగానే అతనికి ఫలితాలు వస్తాయి. మనస్సు శరీరాలను సాత్వికతకు నిలయంగా చేసుకుని సాధన ద్వారా ఎన్నో అలౌకికమైన అనుభూతులను సాక్షాత్కారము చేసుకొనగలము.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2001*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**తలవంచిన చోటే తలెత్తుకు తిరగాలి**

శరీర విజ్ఞానం

# శబ్దశక్తితో నడుపబడుతున్న శరీరము

అన్నపానాదుల స్వీకరణకు, నవ్వటానికి, ఏడవటానికి మరియు జనన-మరణ చక్రములో బంధితమైన తన సమయమును గడపటానికి మానవ శరీరము యొక్క స్థూల రూపము ఉపయోగపడుతుంది. మస్తిష్కము యొక్క మనో బుద్ధులు ఈ బండిని లాగుతుంటాయి. అన్నము, నీరు అనే ఇంధనములను స్వీకరించి ఇది ముందుకుసాగుతూ ఉంటుంది. అంతేకాక మనుగడకు కావలసిన వినోదసాధనముల సమీకరణలో మునిగిపోయి ఉంటుంది. దీనికంటే లోతైన స్థాయి (తలము) చిత్తము (అచేతన మనస్సు) మరియు అహంకారము, అంతఃకరణము (అతిమానస తలము)లున్న క్షేత్రము నుండి ఆరంభమౌతుంది. ఇప్పటి వరకు ఇక్కడ మనోక్షేత్రము గురించి చెప్పబడినది. భౌతిక శరీరములో షట్చక్రాలు, గ్రంథిత్రయము, నాడీత్రయము, 24 ఉపత్యికలు, పంచకోశములు, కుండలిని, సహస్రారచక్రము యొక్క రహస్యమయ శక్తుల భండాగారములు ఉన్నాయి.

ఈ క్షేత్రమంతా సామాన్యంగా నిష్క్రియముగా పడి ఉంటుంది. ఇక్కడ మనోక్షేత్రమునకు చెందిన అచేతన, అతిమానస చేతనాశక్తులు పనిచేయవు. మరియు షట్చక్రాలు, పంచకోశాలు మొదలగువాటితో సంబంధము ఉండదు. తెలియని అస్తిత్వమునే రహస్యమైనదని చెబుతాము. ఇందువలన మనఃక్షేత్రము మరియు కార్యక్షేత్రములలో ఉన్న తెలియని విశిష్టతలు రహస్యలోకము-దివ్యలోకములని చెప్పబడతాయి. వీటిపైనే ప్రాచీనకాలములో పరిశోధనలు చేసేవారు. అధిక ఖర్చుతో కూడిన, కష్టసాధ్యమైన మరియు భావికాలములో మరమ్మత్తులకు లోనయ్యే వైజ్ఞానిక యంత్రములను రూపొందించే బదులు, ఈశ్వరునిచే అనుగ్రహించబడిన సర్వాంగపూర్ణమైన శరీరములోనే ప్రకృతిలోకమునేగాక, బ్రహ్మలోకమును కూడా అన్వేషించే, ఆకర్షించేవాటిని ఒడిసిపట్టుకునే సామర్థ్యములు ఉన్నప్పుడు మరి బయట ఎందుకు వెదుకులాడాలి? అని ఆలోచించి దానివైపు మొగ్గుచూపేవారు. కస్తూరిమృగమువలె ఎందుకు అపహాస్యం పాలవ్వాలి?

ఋషులందరి ప్రయత్నమొక్కటే! శరీరమును ఒక సర్వాంగ పూర్ణ, సమగ్ర, సుందర, సహజ ఉపలబ్ధి ప్రయోగశాలగా భావించారు. దానితోపాటే ఆ క్షేత్రములోనే సన్నిహితమై ఉన్న సృష్టికర్త యొక్క ఉత్తరాధికారముగా లభించే లాభములన్నీ అనంత రిద్ధి-సిద్ధులు బీజరూపములోనే పడి ఉండుటను గమనించి వాటిని అంకురింపజేసి చివరికి మహావృక్షముగా పరిణతి చెందించే ప్రయత్నము చేయాలి అని ప్రవచించారు. ఈ ప్రయత్నమునకే యోగము, తపస్సులనే పేర్లు ఇవ్వబడ్డాయి. అందులో మరెక్కడో ఉండే దేవీ-దేవతల స్తుతి లేక ప్రార్థనలు లేవు. పైగా ఆత్మదేవుని యొక్క అంగ-ఉపాంగముల యొక్క న్యాసోపచారము చేసే విధివిధానమున్నది. వృక్షమునకు ఆహారము ఆకాశము నుండి ఊడిపడదు. వేళ్ళద్వారా లభిస్తుంది. మానవీయ శక్తియొక్క చరమవికాసము అతని మనోక్షేత్రమును జాగృతపరచుకున్నప్పుడే సంభవమౌతుంది. ఆకాశములో ఉండే దేవతలకు స్తుతిపాఠములను వినిపించి తృప్తిపరచుటకొరకు కానుకలను అమితముగా బుట్టలలో నింపి పదే పదే కోర్కెలను వెల్లడిస్తూ తిరిగే అవకాశమెక్కడుంది?

పొట్టనిండటానికి తన నోటితోనే ఆహారము స్వీకరించవలసి ఉంటుంది. చదువుకొరకు తన బుద్ధికి పదునుపెట్టవలసి ఉంటుంది. ఇతరుల నోటిద్వారా ఎవరి పొట్ట నిండింది? ఇతరుల బుద్ధి ఆసరాతో ఎవరు విద్వాంసులయ్యారు? ఆత్మిక ప్రగతి పొందాలనే ఆకాంక్ష సైతము తన సాధనాత్మక పురుషార్థముతోనే సంపూర్ణమవుతుంది. అందులో అమాయకులైన దేవతల అనుగ్రహము ఒక హద్దువరకే పాత్రత అనుసారముగా వర్షిస్తుంది. పాత్రత విషయానికొస్తే దానికూడా పురుషార్థమనే చెప్పవలసి ఉంటుంది. ఆత్మిక క్షేత్రము యొక్క లోతైన మంథననే సాధన, ఉపాసనాది నామములతో సంబోధిస్తారు.

ప్రాచీనకాలములో అనేకరకములైన దివ్యాస్త్రశస్త్రముల ప్రయోగము జరిగేది. తంత్రశాస్త్రములో ఇటువంటి పద్ధతులే ఎక్కువగా ఉన్నాయి. ఆ క్షేత్రములోనే శక్తులను, సౌకర్యాల మరియు సఫలతల భండాగారమును ఎదుట నిలిపే

**అమృతం కావాలంటే క్షీరసాగరాన్ని మథించవలసిందే**

ఉపలబ్ధులన్నీ చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈరకమైన ఉపాయములనే యోగము–తపస్సు అని చెబుతారు. వాటి ద్వారా భౌతికక్షేత్రములో రిద్ధి–సిద్ధులను హస్తగతము చేసుకొన వచ్చును. వాటితోపాటే అంతఃక్షేత్రమును ఆనంద ఉల్లాసాలతో నింపే స్వర్గము–మోక్షముల లాభము ఒనగూడుతుంది. ఈ మొత్తము ఉపార్జన అంతఃక్షేత్రానికి చెందినది! విశాల బ్రహ్మాండములో ఉన్నదంతా మనిషి శరీరమనే పిండాండములో బీజరూపములో నెలకొని ఉన్నది. ఆ బీజములను జాగృత పరచటానికి తగిన పురుషార్థమును చేయటమే ఆత్మసాధన యొక్క ఉద్దేశ్యము. ఈ తథ్యములను దృష్టిలో పెట్టుకుని విద్యను నిష్ఠా పూర్వకముగా అభ్యసించిన చోట అభీష్ట సఫలత కూడా లభించినది. ఋషియుగపు చరిత్రే ఇందుకు సాక్ష్యము!

శరీర మరియు మానసిక క్షేత్ర సంరచన ఒక సర్వాంగపూర్ణ యంత్ర పరికరములతో పూర్తిగా నిండి ఉన్న ప్రయోగశాలతో సమానము! దానిని అభీష్టపదార్థ ఉత్పత్తిగావించే కర్మాగారము అని కూడా చెప్పవచ్చును. ఈ తథ్యము అవగతమైన వెంటనే మరో ప్రశ్న ఉత్పన్నమౌతుంది. ఈ కర్మాగారమును నడపటానికి శక్తి ఎక్కడనుండి లభిస్తుంది? ఇంధనమును ఎక్కడినుండి సమీకరించుకోవాలి? విద్యుత్తు, ఆవిరి, వేడి మొదలైనవాటికి ఏదైనా ఒకానొక ఉత్పత్తి స్థానము తప్పక ఉండితీరాలి, లేకుంటే బహుమూల్యమైన యంత్రములు కూడా పనిచేయలేవు. పరికరాలన్నింటిని శక్తే నడిపిస్తుంది. ఈ శక్తికొరకు కూడా బయటికి ఎక్కడికి వెళ్ళవలసిన అవసరము లేదు. దానినికూడా తగినంత పరిమాణములో ఆ సమర్థసత్తానే మనిషిలోకి పెంపొందిస్తుంది. అందుచేతనే ఇంత అతి విలువైన శరీర క్షేత్ర రూపమనే బహుమూల్య వరదానము మనిషికి దక్కింది.

ఆ శక్తి ఇంధనమేమిటి? దీనికి సంక్షిప్తమైన, పూర్తిస్థాయి జవాబు–'శరీరము నుండి వెలువడే శబ్దశక్తి'. సాధారణంగా శబ్దము అనగా వాక్కు ఆలోచనలను ఇచ్చి పుచ్చుకునేందుకు ఉపయోగపడుతుంది. దీనికన్నా పై స్థాయిలో శబ్దశక్తి ఉన్నది. అవి నాలుకనుండి కాక ముఖాకృతి, మస్తిష్కము మరియు అంతఃకరణ నుండి వెలువడతాయి. వీటిని మధ్యమ, పరా మరియు పశ్యంతి వాణులని అంటారు. వార్తాలాపము, సలహాలనివ్వటము, పరామర్శలలో ప్రయుక్తమయ్యేది వైఖరీవాణి. అయితే అది మధ్యమ, పర, పశ్యంతివాణులతో కలగలిసి సమన్వయమై ఉచ్చరింపబడినప్పుడే దాని నగణ్యమైన సామర్థ్యములో–సమర్థత, ప్రఖరత అనేవి వస్తాయి. దీనికొరకు సంస్కరించబడిన (వికసింపబడిన) వాక్కు అవసరము. అది వ్యక్తిత్వమంతటిలోని ప్రతి పక్షమును ఉత్కృష్టతతో అనుప్రాణితము చెయ్యగలిగి ఉండాలి. ఒకవేళ వక్తృత్వపు ఆనందమును పొందాలంటే, దానియొక్క చమత్కారవంతమైన సఫలతా ప్రాప్తిని చూడాలంటే జిహ్వావరకు పరిమితమవ్వ కుండా, మరో ఇతర మూడు రహస్యమయ వాణులను వెలువరించటానికి సాధనాత్మక అభ్యాసమే ఆవశ్యకమని అర్థము చేసుకోవాలి. వాక్ చాతుర్యకళ కూడా తన స్థాయిలో ఉపయోగ కరమైనదే! అయితే అంతమాత్రము చేతనే మనుష్యుల మనోదిశా ధార నికృష్టత వైపునుండి దిశ మార్చుకుని ఉత్కృష్టతవైపు మరలదు. దానికొరకు ఉచ్చస్తరీయ శబ్దశక్తి కావాలి.

సాధనాక్షేత్రములో శబ్దశక్తి గురించి చాలా లోతుగా, గంభీరతాపూర్వకముగా ఆలోచించవలసి ఉన్నది. 'శబ్ద బ్రహ్మ నాదబ్రహ్మ' యొక్క మహిమను శాస్త్రకారులు అనంత రూపాలలో, గంభీరతాపూర్వకముగా ప్రస్తుతీకరించారు. శబ్ద బ్రహ్మ అనగా వాక్కు–ఉచ్చారణ, నాదబ్రహ్మ అనగా తాళము–స్వరము మీద ఆశ్రితమైన గతి వాయిద్యములు. మంత్ర విజ్ఞానమును కూడా ఈ క్షేత్రానికి చెందిన గొప్ప ఉపలబ్ధిగా చెప్పవచ్చును. మంత్రములో శబ్దాలకూర్పు యొక్క విశేషత కూడా ఒక తథ్యము! అయితే దానికంటే కూడా చాలా ఎక్కువ విశిష్టత మంత్రజపము చేసే సాధకుని వ్యక్తిగత జీవనచర్యతో పాటు జోడించబడి ఉంటుంది. మంత్రశక్తిలో వాక్కు యొక్క ఉచ్చారణ విధాన మొక్కటే సరిపోతుందని భావించరు. మంత్రసిద్ధికొరకు భావనాపూర్వకముగా పురశ్చరణ సాధన చేసినప్పుడే దీని ప్రాణప్రతిష్ఠ చేయుట సాధ్యపడుతుంది. సాధకుడు తమ జీవనచర్యలో ఉత్కృష్టతను లోతుగా దింపుకొన వలెను. ఇదే ఇందులో దాగి ఉన్న తాత్విక స్వరూపము. అది ఋషికల్పమువలె ఉండాలి. ఇక్కడ దశరథుని పుత్రప్రాప్తికొరకు చేయబడిన పుత్రకామేష్టి యజ్ఞమును స్మరించుకొనవలసి ఉన్నది. ఆ సమయములో వశిష్ఠుడు 'మేము ఈ రాజ్యములోని ధాన్యమును తిన్న కారణముగా మంత్రశక్తిని ఉత్పన్నము చేయుటలో అసమర్థులము' అని తమ అసమర్థతను

**అమృతం కావాలంటే ముందు హాలాహలాన్ని తట్టుకోవలసినదే**

వ్యక్తపరిచారు. ప్రఖర వాక్‌శక్తి గల ఋష్యశృంగమహర్షి ఆ కార్య నిర్వహణకొరకు ఆహ్వానించబడ్డారు. ఆ తరువాతనే కార్యము సఫలమైనది. మంత్రము యొక్క రహస్యము సాధకుని జీవన సాధనతోపాటే అవిచ్ఛిన్నరూపములో జోడింబడి ఉండాలి.

సామాన్య మానవులు గొప్పలుకొడుతూ, వాచాలత్వము ప్రదర్శిస్తూ ఉంటారు. వరిష్ఠులైన మనుష్యులు సంపూర్ణ శ్రద్ధా-విశ్వాసాలతో సారగర్భితమైన, ఆదర్శపక్షము వహించిన, జీవితములో తొంగిచూసిన అనుభవాలను వినిపిస్తుంటారు. వాస్తవానికి ఇది మంత్రప్రయోగమే అవుతుంది. **'మననము చేయబడేదే మంత్రము' అని అంటారు. తపఃపూతమైన ఉచ్చారణనే మంత్రమని చెబుతారు.** ఇది జప అనుష్ఠానములో, శాప-వరదానములలో కూడా పనికొస్తుంది. అయితే సాధారణముగా వాటిని సంభాషణ రూపములోకూడా ప్రయోగించడమును చూస్తూనే ఉంటాం. కానీ భావనా క్షేత్రములో పరివర్తన రావాలి అంటే లోకాభిప్రాయములో చొచ్చుకుపోయి ఉన్న అవాంఛనీయతలను తిరగత్రిప్పివేసి లేక తల్లక్రిందులు చేసి ఆ క్షేత్రములో ఔచిత్యపు నూతన దిశాధార ప్రాణప్రతిష్ఠ అవవలసి ఉంటుంది. అప్పుడు ఆ దశలో వాటికి తగిన సాధనా-సామగ్రిని వెతుకవలసి ఉంటుంది. అక్కడకూడా వాటికొరకు అక్కడా-ఇక్కడా చేయిచాస్తూ తిరుగాడరాదు. మానవుల శరీరమును ఒక సర్వాంగపూర్ణ ప్రయోగశాలవలె ఉపయోగించుటకొరకు మానవుని వ్యక్తిత్వము సంస్కరించబడాలి. శరీరము పవిత్రముగా ఉండాలి. సంస్కరింపబడుట అనగా పవిత్రము, తీక్షణత. దానికొరకు సంయమసాధన మరియు పరమార్థపరాయణతలు అను రెంటినీ ఒకేసారి ప్రయోగించవలసి ఉంటుంది. ఈ ఆలంబన లేకుండా ఆత్మసత్తా ఉచ్చస్తరీయ శక్తులు అవతరించుటకు, వాటిని ధారణ చేయుటకు యోగ్యతను పొందదు.

జీవనసాధనతో మానవ శరీరము ఒక ఉచ్చస్థరీయ యంత్రపరికరములతో నిండిన పెద్ద ప్రయోగశాలవలె పని చేయగలుగుతుంది. ఊర్జయొక్క ఆవశ్యకతను శబ్దశక్తి పూర్తి చేస్తుంది! ఉచ్చారణను మంత్రశక్తి స్థాయివరకు చేర్చవలసి ఉంటుంది. పరిష్కృత (వికసించిన) జీవనము అనగా గాండీవము. మంత్రము అనగా శబ్దభేధి బాణము. అర్జునుని వలె ఈ సమస్త పరికరములను ప్రయోగించే అభ్యాసము చేయుటకు మరియు దానిలో ప్రవీణుడగుటకు ప్రతిసాధకుడు కటిబద్ధుడై ముందుకు సాగాలి. అటువంటి ప్రయోగశాల ప్రతి మనిషికి సృష్టికర్త అనుగ్రహము చేత అనాయాసముగానే ప్రాప్తించింది.

*- అఖండజ్యోతి, జనవరి 1984*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## సంతోషం సగం బలం

*బాలల సమ్మేళనం జరుగుతోంది. దానికి నెహ్రూగారు వచ్చారు. బాలబాలికలతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహిస్తూ ఆనందిస్తున్నాడు.*

*ఒక బాలిక లేచి "చాచాజీ" మీరెప్పుడైనా బరువు చూసుకున్నారా?" అని ప్రశ్నించింది. "నా ఆరోగ్య రక్షణ కోసం అనేకమార్లు చూసుకున్నాను" అని సమాధానం చెప్పారు చాచాజి.*

*"అయితే ఈ విషయం చెప్పండి. ఇప్పటివరకు చూచుకున్న వాటిలో అత్యధిక బరువెంత? అతి తక్కువ బరువెంత?" అని అడిగింది.*

*"నేను అహ్మద్‌నగర్ జైలులో ఉన్నప్పటి నా బరువు 112 పౌన్లు. అదే అత్యధిక బరువు. నేను పుట్టినప్పుడు $7^1/_2$ పౌన్లున్నానట. అదే అతి తక్కువ బరువు."*

*బాలిక ఆశ్చర్యంగా ప్రశ్నించింది. "జైలులో ఉన్నప్పుడు బరువు తగ్గాలి కదా! మీకెట్లా పెరిగింది?"*

*"జైలులో ఉన్నప్పుడు నా దేశానికి నేను సేవ చేస్తున్నానన్న ఆనందంలో ఉన్నాను. సంతోషమే సగం బలం కదా! బరువు పెరిగిపోయాను." అన్నారు.*

*ఆ బాలిక వెంటనే ఆయనను కౌగలించుకుంది. నెహ్రూగారు ఆప్యాయంగా ఆమె తల నిమురుతూ దగ్గరకు తీసుకున్నారు.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*


**సాహసవంతుడికే లక్ష్మీ కటాక్షం**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత యొక్క మొదటి పాఠం-కర్మయోగం-4

*పండిత శ్రీరామశర్మఆచార్యులు తమ ప్రవచనాక్రమములో ఆధ్యాత్మికతలో ప్రథమ సోపానము కర్మయోగమే' అని ప్రకటించినట్లు గత సంచికలో చదివియున్నారు. కర్మయోగము అనగా తన కర్తవ్యాలను సరియైన రీతిలో చక్కగా నిర్వహించడమే అని అర్థము. ఉల్లాసము, ఉత్సాహము, ఆనందములతో చెయ్యబడిన పని ఏదైనాసరే అది 'కర్మయోగము' క్రిందికే వస్తుంది. బరువుగానో, భారముగానో అనుకుంటూ చేసే పని ఆశించిన ఫలితాలను అందించలేదు. మానవుడి హృదయములో చెయ్యవలసిన పని పట్ల శ్రద్ధ, సమర్పణ ఉన్నట్లయితే ఆశ్చర్యము కలిగించే ఫలితాలు, పరిణామాలు మనముందుకు రాగలవు. 'మనోయోగముతో శ్రమించగలిగినవారే కర్మయోగమును సాధన చెయ్యగలరు' అనికూడా గురుదేవులు తెలియజేస్తున్నారు. రండి! రండి! వారి వాక్కులను మరింతగా హృదయంగమము చేసుకుందాము!*

## పనిలో ఏకాగ్రత కలిగి ఉండటమే కర్మయోగము



ఒకానొక కాలములో ఒక శిల్పి కొన్ని శిల్పములను చెక్కుతూ ఉండేవాడు. ఆయనకు ఒక కొడుకు ఉండేవాడు. తన కొడుకుతో కూడా బొమ్మలు చెయ్యమని చెప్తుండేవాడు. తండ్రి నిర్దేశించిన విధముగా కొడుకు కూడా విగ్రహాలను తయారు చేస్తుండేవాడు. తండ్రి చెక్కిన విగ్రహము రెండు రూపాయలకు అమ్ముడుపోతే, కొడుకు చెక్కిన విగ్రహము నాలుగు, ఐదు రూపాయలకే కాక క్రమముగా 15 రూపాయల వరకూ అమ్ముడయ్యేది. అయినా కూడా తండ్రి కొడుకుతో 'నాయనా! నీవు చేసే బొమ్మలలో ఇంకా చక్కని మార్పులు రావాలి. బాగా శ్రద్ధ వహించు! నీవు చేసే పనిని ఒక జపము, యోగము చేసిన రీతిలో చెయ్యాలి. అంటే చేస్తున్న పనిలో మరింత ఏకాగ్రత, అభిరుచిని పెంపొందించుకోవాలి' అని చెప్తుండేవాడు. తండ్రి చెప్పే మాటలకు కొడుకుకు అహం పెరిగిపోతుండేది. 'నాన్నా! నీవు చేసే బొమ్మలు 2 రూపాయలకు మాత్రమే అమ్ముడవుతుంటే, నేను చెక్కిన విగ్రహాలను 15 రూపాయలు చెల్లించి కొంటున్నారు. అయినా మీరు ఇంకా నా పనిని తప్పు పడుతున్నారు' అని ఎదురుతిరిగి సమాధానమిచ్చేవాడు. తండ్రి తలమీద చేతులుపెట్టుకుని కూర్చుని 'నాయనా! నీ ఉన్నతికి మార్గము మూసుకుపోయింది. 15 రూపాయలకు అమ్ముడవుతున్న విగ్రహము 25 రూపాయలకు ఎందుకు అమ్మలేము? అని నేను ఆలోచించాను. కానీ ఇప్పుడు నీవు ప్రవర్తిస్తున్న తీరుచూస్తే 15 రూపాయలకు అమ్ముడైన బొమ్మ ఇప్పుడిక 14, 13, 12 రూపాయలకే అమ్మవలసి వస్తుంది. ఈ పనిలో ఇంకా మనస్సును లగ్నము చెయ్యవలసిన అవసరము లేదని నీవు భావిస్తున్నావు. ఇప్పుడు చేస్తున్నదే చాలు అని అనుకుంటున్నావు. అంటే నీ అభివృద్ధిని నీవు అడ్డుకుంటున్నావు' అని అన్నాడు.

మనందరి ఆలోచన కూడా ఇలాగే ఉంటుంది. జరిగిపోయినది ఏదో బాగానే ఉన్నదికదా అని అనుకుంటాము. కానీ ముఖ్యమైన అంశమేమిటంటే మనము అందులో లోతులలోకి పోవాలనిగాని, లేని కుతూహలమును తెచ్చిపెట్టుకుని ఆ పని యొక్క నాణ్యతను వృద్ధిచెయ్యాలనిగాని అనుకోవలసిన పనిలేదు. కావలసినదల్లా మనము ఏ పని చేస్తున్నామో అందులో లీనమై, ఏకాగ్రతతో మమేకమై పని చెయ్యాలి. మన మానసిక శ్రమ, శారీరిక శ్రమ రెండూ కలసి ఎంతో విలువైన శ్రమను ఆ పనికోసము మనము వినియోగించినట్లుగా అనుభూతి చెందగలగాలి. అదే కర్మయోగము అవుతుంది. పని చెయ్యటానికి, కర్మయోగమునకు మధ్య ఉన్న భేదము ఇదే. 'ఎందుకొచ్చిన కష్టమురా బాబు!' అన్నట్లు,

ముందుచూపు లేకపోతే ఎందుకు కోరగాడు

ఇది మన దురదృష్టమా అన్నట్లు భావిస్తూ కేవలము శారీరిక శ్రమకు మాత్రమే పరిమితమవుతూ చేయబడేదానిని 'పని' అంటారు. అలాకాకుండా 'కర్మయోగము'లో నాణ్యత వృద్ధిచెందుతుంది. అందులో మనిషి ఉత్సాహముగా పనిచేస్తాడు. తన్మయత్వంతో, ఇష్టముతో, మనోయోగముతో 'ఇది నా కర్తవ్యము' అన్న భావనతో పనిచేస్తాడు.

ఏ పనినైనా నిజాయితీగా చెయ్యాలి. కానీ ఈరోజు మనము చేసే ప్రతిపని అన్యాయముతోనే కూడుకొని ఉంటున్నది. 'అన్యాయమైన రీతిలో పనిచేస్తేనే మనము సంపన్నులం కాగలం' అని చాలామంది భావన. నిజాయితీగా పోతే మనకు మిగిలేదేమీ ఉండదు అనుకుంటారు. కానీ అది తప్పు. ఖచ్చితమైన నిజాయితీతో పనిచేస్తే ఒకటికి రెండురెట్లు సంపన్నులము కావచ్చు.

'వెస్టెండ్' గడియారముల ఖరీదు ఇతర గడియారముల కన్నా 20 రెట్లు ఉంటుంది. సంస్థ షేర్ విలువ ఎక్కువగా ఉంటుంది. 2 రూపాయల అసలు ఖరీదుకు 20 అధికముగా అంటే 40 రూపాయలు సంపాదిస్తుంది. వారి నిజాయితీయే దీనికి కారణము. పూర్తిగా తయారై దుకాణములోకి ప్రవేశ పెట్టిన తరువాత గడియారములను 24 గంటలపాటు గమనిస్తారు. ఒక్క సెకెండ్ తేడా వచ్చినా దానిని తిరిగి సంస్థకు పంపేస్తారు. బాగుచేసిన తరువాత తిరిగి అది ఖచ్చితముగా పనిచేస్తున్నది అన్న నమ్మకము కలిగితేనే దానిని దుకాణములో అమ్మకానికి పెడతారు. నిజాయితీ, ప్రామాణికతల ఆధారముగా ఆ సంస్థ యావత్ప్రపంచము యొక్క విశ్వాసమును చూరగొని అగ్రభాగాన నిలిచింది.

మీ నిజాయితి, సౌమ్యమైన నడవడిక మీద నమ్మకము కలిగితే ఎదుటివాడు మీకు బానిసైపోతాడు. మీరు ఎంత కోరితే అంత ధనము, దేనిని కోరితే దానిని క్షణాల మీద సమకూర్చుతాడు. 'నిజాయితి, సరళ స్వభావము, బాధ్యత' ఈ మూడింటివల్లనే మనిషికి అన్నింటికన్నా అధికమైన గౌరవము లభిస్తుంది. ఈరోజు మనము వాటిని మరచి పోయాము. అడుగడుగునా మనము అన్యాయానికి, బాధ్యతా రాహిత్యానికి దాసులమైపోతున్నాము. మనము డబ్బు దొంగిలించకపోయినా సమయమును దొంగిలిస్తున్నాము. విషయము ఏదైనా ఒకటే. మీరు ప్రతిజ్ఞాపత్రమును నింపారు. ఏమని? ఇక్కడ 7 గంటలు పనిచేస్తామని అందులో వ్రాశారు. చేస్తున్నారా? లేదు. 2 1/2 గంటలు పనిచేసి మిగతా నాలుగున్నర గంటలు బయట తిరగటానికి వెచ్చిస్తున్నారు. డబ్బును దొంగిలించినా, సమయమును దొంగిలించినా రెండూ సమానమే కదా? దొంగతనమంటే దొంగతనమే!

## పనిని పూజించండి

దొంగలు, బందిపోట్లు ఎప్పుడైనా సంపన్నులైనారా? ఎప్పటికీ కాలేరు. వాళ్ళకు కుప్పలుతెప్పలుగా ఆదాయము ఉంటుందేమోకాని సంపన్నులు మాత్రము కాలేరు. సంపన్నులు కావాలన్నా, కర్మయోగులు కావాలన్నా అందుకు నిజాయితి చాలా అవసరము. మీరు చేసే పనిలో నిజాయితి ఉన్నట్లయితే మీ మాటకు విలువ ఉంటుంది. తద్వారా మీరు ఈ భౌతిక ప్రపంచములోనే కాదు, భగవంతుని వద్దకూడా గౌరవాన్వితులు కాగలరు. వ్యర్థమైన మాటలు అందరూ మాట్లాడతారు. కానీ అందులో నిజాయితి ఎంతమాత్రమూ ఉండదు. మీరు హనుమంతుడిని, లక్ష్మీదేవిని పూజిస్తారు. మరి పనిని ఎందుకు పూజించరు? పనిని పూజించడమంటే అందులో నిజాయితి కలిగి ఉండటమే! నిజమైన నిజాయితీతో పనిచేసి చూడండి. ప్రపంచము యొక్క ఔన్నత్యమే మీ ఔన్నత్యముగా మారుతుంది. మనస్ఫూర్తిగా పనిచెయ్యండి. ఎంతమంది మీకు సహాయము చెయ్యటానికి ముందుకొస్తారో గమనించండి.

మనిషి తనలోనున్న విశ్వాసము యొక్క శక్తిని ఎప్పుడూ గుర్తించదు. కృతనిశ్చయముతో, ఉత్సాహముతో, సంకల్పము పట్ల నమ్మకముతో ఏ పనిని చెయ్యవలసి ఉన్నదో, దానికి తగిన రీతిలో పనిచెయ్యటము ప్రారంభిస్తే సాధ్యము కానిదే మున్నది? నెపోలియన్ ఆల్ప్సుపర్వతాలను చూర్ణము గావించినట్లు మనము కూడా సంకల్పించిన కార్యమును సాధించి తీరగలుగుతాము. ప్రపంచములో ఆల్ప్సుపర్వతాలను ఎవ్వరూ దాటలేరనే నానుడి ఉండేది. కానీ నెపోలియన్ తన దృఢసంకల్పముతో వాటిని దాటగలిగాడు. నెపోలియన్‌లో గల నమ్మకము, సంకల్పబలమే అతనిని పర్వతాలను దాటించ గలిగాయి.

ఇదే మానవుడి సంకల్పం, శ్రమశక్తి. ఇటువంటి సంకల్పమునకు, శ్రమశక్తికి భగవంతుడు కూడా సహాయము చేస్తాడు.

**వెలిగే దివిటికే విలువ**

బుల్లిపిట్ట కథ కూడా ఇంతే. సముద్రము దాని గుడ్లను తనలోకి లాగేసుకుంది. నా గ్రుడ్లను ఇస్తావా, ఇవ్వవా అని పిట్ట సముద్రుడిని దబాయించింది. నేను ఇవ్వను గాక ఇవ్వను అని అన్నాడు సముద్రుడు. 'అలాగైతే నీలోని నీటినంతా ఇంకింపజేస్తాను. అప్పుడు నా గ్రుడ్లను నేను తీసుకోగలను' అని అన్నది బుల్లిపిట్ట. ఒడ్డున ఉన్న ఇసుకను ముక్కుతో తీసుకు వచ్చి సముద్రములో పొయ్యటము ప్రారంభించినది. ఒక మనిషి యొక్క, ఒక ప్రాణి యొక్క, ఒక చేతనత్వము యొక్క సంకల్పము ఎంత శక్తివంతమైనదో ఆ బుల్లిపిట్ట ప్రత్యక్షముగా చూపించినది. దూరంనుండి ఆ పిట్టను చూస్తున్న అగస్త్యమహర్షి దాని పట్టుదలకు, సంకల్పదీక్షకు ముచ్చటపడ్డాడు. 'ఈ పనిని చెయ్యనైనా చెయ్యాలి, చావనన్నా చావాలి' అన్నట్లు అలుపెరగని కార్యదీక్షతో అది పనిచేస్తున్న తీరుకు ఆయన అబ్బురపడ్డాడు. 'నీ సంకల్పమును నేను నెరవేరుస్తాను' అని చెప్పి ఒక్క గుక్కతో సముద్రములోని నీటినంతటిని పీల్చివేశారు. వినటానికి కథే కావచ్చు, కానీ దీని వెనుక ఉన్న సిద్ధాంతము నూటికి నూరుపాళ్ళ సత్యము!! ఒక పనిని నెరవేర్చటానికి, పురుష ప్రయత్నమును నిర్వహించటానికి కృతనిశ్చయముతో నిలబడితే కొన్నివేలమంది నీకు సహాయము చెయ్యటానికి సిద్ధమవుతారు. భగవంతుడు కూడా సహాయము చేస్తాడు. నీకు మార్గము సుగమమవుతూ ఉంటుంది. ఈ సిద్ధాంతమును మీరు నమ్మండి. మనిషి సంకల్పము ప్రపంచమునే మార్చివేయగలిగేటంత తీక్షణమైనది, పదునైనది కూడా!

## సంకల్పించిన పనితో సత్ఫలితాలు లభిస్తాయి

నిజాయితి, శక్తి, సంకల్పము – ఈ మూడూ కలసి ఉండటమే పనియొక్క ప్రత్యేకత. పనిలో లీనమైపోతే కలిగే ఆనందములో మనిషి ఈ పనివల్ల తనకెలాంటి ఫలితము లభిస్తుందనే విషయము కూడా మరచిపోతాడు. మీరు పరీక్షకు సిద్ధమయ్యారు, కానీ ఖచ్చితముగా ఉత్తీర్ణులవుతారా లేక అవ్వరా అన్నదాని గురించి మేము ముందుగా మాట ఇవ్వలేక పోతున్నాము. ఎందుకంటే ఫలితమనేది పరిస్థితులపైన ఆధార పడి ఉంటుంది. పరీక్షకు మీరు సిద్ధమైనప్పటికీ ప్రశ్నాపత్రములో మీరు అసలు ఊహించని ప్రశ్నలు రావచ్చు. పరీక్ష బాగా వ్రాసినప్పటికీ జవాబుపత్రాలు దిద్దే వ్యక్తి మనోస్థితి సరిగ్గా ఉండకపోతే 80 మార్కులు వెయ్యవలసిన స్థానములో 30 మార్కులే వెయ్యవచ్చు. కాబట్టి ఫలితాలనేవి మీ చేతిలో లేనివి. అవి పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయి. చేసిన పనికి లభించే ఫలితములో మానవుని శ్రమ అనేది ఒక భాగము మాత్రమే. ఎన్నోరకాల అంశములు కలిస్తేనే విజయము లభిస్తుంది. అందుచేత విజయము కోసము ఇతరులమీద ఆధార పడకూడదు. పనిచెయ్యటములోనే ఆనందమును పొందగలిగితే, పని–శ్రమ ఈ రెండూ కూడా 'ఏదో ఒక ఫలితము కోసము మనము ఆనందమును అమ్మకం పెట్టకూడదు' అన్న విషయమును తెలియజేస్తాయి. పనిని, సంతోషమును ఎల్లప్పుడూ కలిపే ఉంచాలి. ఇదే కర్మయోగము అంటే.

మీరు సంకల్పించిన పనిని ఎంతో నిజాయితీగా, మనస్ఫూర్తిగా మొత్తము బాధ్యత వహించి మనస్సును ఏకాగ్రము చేసి చేసినప్పటికీ అపజయము లభిస్తే చెయ్యగలిగేదేమున్నది? అపజయము అనేది ఎంతోమందికి వస్తుంటుంది. అపజయము పొందటమనేది నేరము కాదు, సిగ్గులేనితనం కాదు. ప్రపంచంలో ఎంతోమంది అపజయము పాలైనారు. వాళ్ళు చెయ్యవలసిన పనిని నిజాయితితో చేశారు కాబట్టి అపజయము కలిగినప్పటికీ అందుకు గర్వించవచ్చు.

సుకరాతు, భగత్‌సింగ్, ఝాన్సీలక్ష్మీబాయి, దధీచిమహర్షి వీరంతా తమ జీవితకాలములో ఎంతో శ్రమపడి లక్ష్యం కోసము పనిచేసినప్పటికీ సఫలీకృతులు కాలేకపోయినారు. అయితే మనము ఇప్పటికీ వారిని కీర్తిస్తున్నాము, గౌరవిస్తున్నాము. ఎందుకంటే వాళ్ళు జయాపజయాలను గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. 'మనము మన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నాము, అందుకు మనము సంతోషించాలి' అన్న భావనతో మాత్రమే వారు పనిచేశారు. సంతోషమును తమ గుప్పెటలో బంధించి ఉంచినవారే కర్మయోగులు. ఇలా పని చేస్తే సంతోషము లభిస్తుందా? అలా చేస్తే సంతోషము లభిస్తుందా? అని వారెప్పుడూ ఆలోచించలేదు. కర్మయోగము ఎంతో విలువైనది. అది మీకు ప్రాపంచిక సుఖసంపదలనే కాదు, ఆధ్యాత్మిక ఉన్నతిని కూడా కలుగజేస్తుంది.

## భావాలను సంస్కరించుకొనటమే ఆధ్యాత్మికత

కేవలము మాలత్రిప్పుతూ జపము చెయ్యడమే ఆధ్యాత్మికత అని అనుకుంటే అది చాలా పొరపాటు. ఒక మనిషి యొక్క

**కత్తికి పదునెంత ముఖ్యమో, విశ్వాసానికి ఆచరణ అంత ముఖ్యం**

ఆలోచనలు, పనులు మొత్తము అతని వ్యక్తిత్వముతో ఏకీకృత మయ్యేదే ఆధ్యాత్మికత! దొంగలు, హంతకులు, మోసగాండ్రు కూడా పూజలు చెయ్యడము మనము చూస్తూనే ఉంటాము. కొందరు బందిపోటుదొంగలు నవరాత్రులు 9 రోజులు కేవలము మంచి నీరు మాత్రమే త్రాగి ఉపవాసము ఉంటారు. వాళ్ళు దొపిడీలను యథావిథిగా కొనసాగిస్తుంటారు. చివరి రోజు దేవికి మేకను బలి ఇస్తారు. ఈరకమైన దొంగలు, నేరస్థులు, కుట్రలు పన్నే వారిని 'ఆధ్యాత్మికులు' అని అనగలమా? భగవంతుడిని ఉపాసించటమనే ప్రక్రియను తమ రోమ రోమములో, ఆలోచనలలో, పనులలో నింపుకున్నవారే అసలైన ఆధ్యాత్మిక వేత్తలు. మీరు చేస్తున్న కర్మకాండ లేదా క్రియయొక్క ప్రాముఖ్యతను మీరు అర్థము చేసుకోలేరు. నిజాయితి, శ్రద్ధల యొక్క ప్రాముఖ్యత మీకు తెలియదు. వీటి ప్రాముఖ్యతనే తెలుసుకోలేనివారు, ఆధ్యాత్మికత యొక్క ప్రాముఖ్యతను గురించి ఎంతవరకు అర్థము చేసుకొనగలరు? ఊకదంపుడుగా చెప్పే గాలికబుర్లు, అద్భుతాల పైనే నమ్మకము కలుగుతుంది. మనిషి వీటి వలయములోనే గిరికీలు కొడుతూ అదే ఆధ్యాత్మికత అనుకుంటున్నాడు.

ఉన్నతమైన జీవితము జీవించటానికి, సంపత్తిమయమైన జీవితము జీవించటానికి, భౌతికజీవితములో అభివృద్ధిని పొందటానికి మనము గురువును ఆశ్రయించాలి. మా గురుదేవులైన పండితమదనమోహనమాలవ్యా గారు, ఇంకా హిమాలయాలలోనే నివసించే ఇతర గురువుల వద్ద మేము నేర్చుకున్నదొకటే. **'మనము నిర్వహించవలసిన పనిని పూర్తి మనోయోగముతో, తన్మయత్వముతో, ఏకాగ్రతతో నిర్వర్తించడం చాలా అవసరము.'** మేము నేర్చుకున్న ఈ మంత్రముతో ప్రాపంచిక జీవితములో అభివృద్ధిని, ఆధ్యాత్మిక జీవితములో ప్రగతిని సాధించగలిగాము. కర్మయోగమునకు చెందిన ఈ సూత్రములను మీరు జీవితములోని ఒక అంగముగా మార్చుకొనగలిగితే మీరు కూడా మహామానవులు కాగలరని దృఢముగా చెప్పగలము.

*– అఖండజ్యోతి, అక్టోబరు 2013*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## ధన సంపత్తి కన్నా త్యాగ గుణం మిన్న

*రవిశంకర్ మహారాజు నెలకొకసారి తన రాజ్యములో విభిన్న గ్రామాల్లో సంచరిస్తూ అన్నదానం చేయుట పరిపాటి. ఒక పర్యాయం, అన్నదానంలో భాగంగా ధాన్యాన్ని పంచడానికి వెళ్ళగా ఒక పేద మహిళ ఆయనకు తటస్థపడింది, ఆమెకు కూడా దానంగా ధాన్యాన్ని ఇవ్వచూపగా, ఆమె ఇట్లు పలికింది – "మహారాజా! ఆ పరమాత్ముడు నాకు ఇంతటి గొప్ప శక్తివంతమైన శరీరాన్ని ఇవ్వగా, నేను శ్రమించుట మాని మీ నుండి ధాన్యాన్ని ఉచితంగా ఎలా తీసికొనగలను?" ఈ మాటను విన్న మహారాజునకు ఎంతో ఆనందం కలిగి ఆమెను ఇలా ప్రశ్నించాడు –"నీకు బ్రతుకుతెరువు ఎలా లభిస్తుంది?" జవాబుగా ఆమె "మహారాజా! నేను నా యుక్తవయస్సులోనే విధవరాలినయ్యాను. నాకు నావారంటూ ఎవ్వరూ లేరు. అడవిలో కట్టెలు కొట్టుకొని, వానిని అమ్మి ఆ డబ్బుతో నన్ను నేను పోషించుకుంటూ ఉంటాను" అన్నది. మహారాజు యొక్క ఉత్సుకత పెరిగి నీ భర్త నీకేమి సంపదను వదలిపోలేదా?" అని అడిగాడు. దీనికి జవాబుగా ఆమె "నా భర్త విడచిపోయిన 30 బిఘాల భూమిని అమ్మి నీటిని నిలువ చేసేందుకు ఒక చెరువును గ్రామంలో ఏర్పాటు చేశాను. గ్రామంలోని స్త్రీలు రెండు-మూడు మైళ్ళు కాలినడకన వెళ్ళి నీటిని తెచ్చుకొనే కష్టాన్ని ఈ చెరువు తొలగించింది. ఈ రీతిలో నా భర్త విడిచివెళ్ళిన సంపద గ్రామప్రజల దాహార్తిని తీరుస్తున్నది" అని జవాబిచ్చింది. ఆ నిరుపేద త్యాగనిరతిని కాంచిన మహారాజు మిగుల ఆశ్చర్యచకితుడై తన కన్నులు తెరిపించి, తనకు మార్గదర్శనంగా నిలచిన ఆమె త్యాగం ముందు తాను పేదవాడైపోగా ఇలా బదులిచ్చాడు – "నీవు ధన్యురాలివి దేవీ! ధన సంపత్తిలో పేదరాలివైనా, గుణసంపత్తిలో సాక్షాత్తు కుబేరుడు కూడా నీతో సరితూగజాలడు" అని శిరస్సు వంచి నమస్కరించాడు మహారాజు.*

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2014*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**మంచి రైతు పంట కోసి తృప్తిపడడు, తదుపరి పంటకు విత్తనం కూడా వేస్తాడు**

నా వారితో నా మాట

# ఇచ్చే సంస్కృతి - దేవ సంస్కృతి



భారతీయ సంస్కృతికి మారు పేరు దేవ సంస్కృతి. భారతీయ సంస్కృతిలోని అసంఖ్య గుణాల ప్రవాహాన్ని దేవ సంస్కృతి అనే రెండు పదాలతో నిర్వచించవచ్చు. దేవ సంస్కృతి అంటే, ఇవ్వడ మనే సంస్కారాన్ని అందించి, నేర్పించేది. తీసుకోవాలనే కోరిక అందరికీ ఉంటుంది. దొరికిన దానికన్నా మరింత ఎక్కువ దక్కాలని కోరుకుంటారు. ఇటువంటి మానసిక స్థితి స్థిరపడితే మనిషి స్వార్థపరుడు, లోభిగా మారతాడు. అందినవన్నీ కూడబెట్టుకోవడం వల్ల అతనిలో కొంతకాలం తరువాత అహంకారమనే ఉన్మాదం తాండవిస్తుంది. ఇలాగే జీవితం కొనసాగితే దేవత్వం దూరమై, అసురత్వం తాండవిస్తుంది. గురుదేవులు మనందరికీ జీవనసాధనతో నిరంతరం దేవత్వాన్ని పెంచుకునేట్టుగా శిక్షణ ఇచ్చారు. వారు సంఘటిత పరచిన ఈ దేవకుటుంబంలోని సభ్యులందరు నిరంతరం దేవత్వం వైపుకే తమ ప్రయాణం సాగించాలి.

అందుకు మనందరం ఇవ్వడం నేర్చుకోవాలి. ఇచ్చే సద్గుణమే మనిషిలో దైవత్వాన్ని అవతరింపజేస్తుందన్న గురుదేవుల బోధని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఇది మరచి పోయినవాడు దైవత్వానికి ఎల్లప్పుడూ దూరంగానే ఉంటాడు. మనలో, మన కుటుంబంలో, మనకు కావలసినవారిలో దైవ సంస్కృతి పెంపొందాలా లేక అహంకార ఉన్మాదం తాండవించాలా అనేది మనమే ఆలోచించాలి. ఈ ప్రశ్నకి ఈ రోజే, ఇప్పుడే సమాధానం కావాలి. ఆలస్యం చేయడం, రేపటికి వాయదా వేయడం వల్ల పని జరగదు. వినాశకర అసుర దృశ్యాలు మనం రోజూ చూస్తున్నాం. మనిషి, కుటుంబం, సమాజం, ప్రకృతి, పర్యావరణం అన్నీ దీని గుప్పెట్లో ఇరుక్కుని నష్టపోతున్నాయి. స్వార్థం, అహంకారాల వలన సభ్యత, సంస్కృతి నష్టపోయే లోపల దేవ సంస్కృతిని వికసింపచేసి, విస్తరింపజేసేందుకు సన్నద్ధులమై ఉండాలి.

ఇవ్వడం గురించి మాట్లాడిన వెంటనే దృష్టి డబ్బు వైపుకు మరులుతుంది. అక్కర్లేని గందరగోళాలు ముట్టడిస్తాయి. ఏ విధంగా నెల గడిచిపోతోందా అని ఆలోచిస్తుంటారు. ఇంటి అవసరాలు, పిల్లల కోరికలతో సతమతమవుతుంటే ఇక దానం ఇవ్వాలంటే ఏమివ్వగలం? ఇచ్చే ప్రవృత్తిని వికసింప జేసుకోవాలంటే ఎలా? డబ్బు తక్కువ ఉన్నవాళ్ళు దేవ సంస్కృతి విస్తృతిలో భాగం పంచుకోలేరా? అయినా నీతిగా సంపాదిస్తే చాలాకొద్దిగా మాత్రమే కూడగట్టగలం.

మన వాళ్ళల్లో చాలామంది ఇటువంటి పరిస్థితిలో ఉన్న వాళ్ళే. మన దేశపౌరుల సగటు ఆదాయంతో అరకొరగా మాత్రమే కూడు, గుడ్డ సమకూరుతాయి. వీలైనప్పుడు ఎప్పుడైనా ఎవరికైనా కాస్త సహాయం చేస్తే అదే గొప్ప. ఇక నెల నెలా దానాలు ఇవ్వడం ఎలా వీలవుతుంది?

దేవ సంస్కృతి యొక్క అర్థం, నిర్వచనం ఇటువంటి సంకీర్ణ భావం కన్నా చాలా విశాలమైనది. దాని విస్తారమైన పరిధిలో అందరికీ స్థానం ఉంటుంది, పేద-గొప్ప తేడా ఉండదు. కటిక పేదవాడి దగ్గర కూడా పరమార్థ ప్రయోజనానికి ఉపయోగపడే చాలా సంపద ఉంటుందని గురుదేవులు చాలా సార్లు గుర్తుచేసారు. తన ఉజ్వల వ్యక్తిత్వం వికసింపజేసుకోవడం ఆత్మకళ్యాణానికే కాక, సామాజికంగా కూడా తోడ్పడుతుంది. చందనం తన చుట్టుపక్కల పూల మొక్కలను కూడా సుగంధ భరితం చేస్తుంది. చరిత్రవంతుడు చందనపు వృక్షం వంటి వాడు. చుట్టుపక్కల వారందరికి అతని ద్వారా సుగంధిత ప్రేరణలు లభిస్తూనే ఉంటాయి. మంచి ఆచరణకు తగిన ధైర్యం లభిస్తుంది. లెక్కలేనంత మందికి తను ఆదర్శంగా నిలిచి అనుకరించడానికి తగ్గ సాహసాన్ని కల్పిస్తాడు. కానీ దానం చేసే, పుణ్యకర్మలు చేసే నిష్ఠావంతులు, చరిత్రవంతులు కూడా సమాజానికి గొప్ప అనుదానాన్ని అందిస్తారు.

మృదుభాషణం, ప్రశంసాత్మక ప్రోత్సాహం, సలహాలు ఇచ్చే పని ధనదానంకన్నా ఎన్నో రెట్లు గొప్పది. బాధలతో కొట్టుమిట్టాడే వారు మన చుట్టుపక్కల చాలామందే ఉంటారు. వారితో రెండు తియ్యటి మాటలు మాట్లాడితే వారికి కొత్త జీవితం ఇచ్చినవారే. ఎంతోమందికి నిరాశ, ఆత్మహీనత క్షణక్షణం బాధిస్తుంటాయి. వారి జీవితపు సకారాత్మక (positive) పక్షాన్ని వారి కంటికి చూపించి, ప్రశంసాత్మకంగా ప్రోత్సహిస్తే వారి జీవితంలో కొత్త కోణం తెరిచినవారవుతారు. ఇలా చేయడానికి మన దగ్గర స్వాధ్యాయం, ఆలోచనల

**జీవితంలో వచ్చే ప్రతి చిన్న చిన్న అవకాశము సువర్ణావకాశమే**

పెట్టుబడి ఉండాలి. దాని సహాయంతో మనసులోని అలజడులను, చిక్కుముళ్ళను విప్పవచ్చు. మన రోజు వారీ పనులన్నీ చేసుకుంటూ కూడా ఈ పనులు చేయవచ్చు. గొప్ప పుణ్యాన్ని సంపాదించవచ్చు.

సదాచరణ, నమ్రత, అణుకువ, సరళసౌమ్య స్వభావం అన్నింటికన్నా గొప్ప సంపద. స్నేహ సద్భావన, ఉదార వ్యవహారం చుట్టుపక్కలవారిని ఎంతగా ప్రభావితం చేసి, సాంత్వన కలిగిస్తాయో మనకు తెలియదు. సేవ, సహకార భావనలు ఉండి, ఇతరులను ఉద్ధరించడానికి తగిన ప్రయత్నం చేస్తుంటే బొట్టుబొట్టుగా ఎంతో పుణ్యాన్ని కూడబెట్టుకోవచ్చు. గొప్ప గొప్ప దానవీరులను కూడా వెనక్కు నెట్టి ముందు నిలబడవచ్చు.

డబ్బివ్వడాన్ని మాత్రమే దానం అనబడదని పాఠకులకు మళ్ళీ మళ్ళీ గుర్తుచేయబడుతోంది. ఇవ్వదల్చుకుంటే చాలా ఇవ్వచ్చు. మనదగ్గర ఏదున్నా లేకపోయినా శరీరమైతే ఉందిగా. లోకకళ్యాణానికి సమయాన్ని, శ్రమను ఇచ్చి చాలా పుణ్యాన్నే మూటకట్టుకోవచ్చు. మనం ఆరోగ్యంగా ఉంటే రోగులకు, బలహీనులకు సేవ చేయగలం. మరొకరి ప్రాణాన్ని కాపాడగల రక్తాన్ని దానం చేయవచ్చు. రక్తాన్ని ఇవ్వడం వల్ల ఆరోగ్యం, ఆయుష్షు తగ్గుతుందనుకోవడం భ్రమ. ప్రకృతి కొద్దికాలంలోనే ఈ లోటును పూరిస్తుంది.

పరమాత్మ ప్రసాదించిన శరీరం బతికున్నప్పుడే కాదు, చనిపోయాక కూడా చాలా ఉపయోగకరమైనదే. సాధారణంగా చనిపోయాక శవాన్ని మట్టిలో పూడ్చికాని, దహనం చేసిగాని, అంత్యక్రియలు చేస్తారు. కానీ అలా చేయడం వలన పోయిన వారికీ ఏ లాభం లేదు, ఉన్న వారికీ లేదు. నేటి కొత్త పద్ధతుల ద్వారా మనిషి చనిపోయాడని ధృవీకరించిన కొన్ని గంటల తరువాత కూడా శరీర అవయవాలు తీసి జాగ్రత్తపరచవచ్చు. అవి తరువాత అవసరమున్న వారికి ఉపయోగించవచ్చు. నేత్రదానం కూడా ఇటువంటిదే. చనిపోయినవారి కళ్ళు ఇంకొకరి జీవితంలో ఆనందాన్ని, ఉల్లాసాన్ని, వెలుగుని నింపుతాయి. దీనికి మరే ఇతర దానం సాటి రాదు.

మన దేశంలోనే లక్షలమంది కార్నియా లోపాల వలన అంధులుగా అవుతున్నారు. ఆరోగ్యమైన కార్నియా లభిస్తే వారి జీవితాలు వెలిగిపోతాయి. చనిపోయిన కొద్ది సమయంలో ఈ పొర సేకరించవలసి ఉంటుంది. ఈ పొర పారదర్శక దర్పణం లాంటిది, దీనిలో రక్తసంచారం జరగదు. కాబట్టి టిష్యూ రిజెక్షన్ సమస్యలుండవు. ఈ మార్పిడి నిపుణులు చేస్తే 80% సాఫల్యం సునాయాసంగా లభిస్తుంది. ముసలితనం వల్ల చూపు తగ్గి, కళ్ళు పాడైపోయాయి అని కూడా అనుకోవక్కర్లేదు. సాధారణంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది పాడవదు, దానిని యువకులకు కూడా నిస్సంకోచంగా వాడవచ్చు.

మన దేవకుటుంబంలోని సభ్యులందరు స్వభావతః సాధకులే. పరమపూజ్య గురుదేవుల మార్గదర్శనం అందరినీ నిరంతం ఆధ్యాత్మిక సాధన చేసేట్టు ప్రేరేపించింది. కష్టమైన అనుష్ఠానాలు చేయడానికి మనవాళ్ళు సిద్ధంగా ఉంటారు. సంవత్సరాలబట్టి వాళ్ళు చేస్తున్న సాధన వారికి ఆధ్యాత్మిక పెట్టుబడిగా మారింది. ఎటువంటి ఆర్థిక సంపదకన్నా ఇది చాలా గొప్పది, ముఖ్యమైనది. ఈ వాక్యాలు చదివేవారు దీని ప్రాముఖ్యతను గుర్తించాలి. దానానికి, పుణ్య సముపార్జనకి ఇదే సర్వోత్తమ విధానం.

భావయుక్త ప్రార్థన రూపంలో దీనిని ఉపయోగించాలి. పరిస్థితుల ప్రాభావం వల్ల గాని, ప్రారబ్ధం వల్ల గాని మన జీవితాలలో, చుట్టుపక్కలా ఏదో ఒక కష్టం ఉంటూనే ఉంటుంది. ఈ ఆపదలు, విపత్తుల పీడ ఎలాంటిదో అనుభవించిన వారికే తెలుస్తుంది. ఎవరు పీడితులు అన్నది ప్రశ్న కాదు. పీడితులెవరూ శత్రువులు కాదు, మిత్రులు కాదు. ధనవంతుడు, పేదవాడు, కులీనుడు, దళితుడు కాదు. పీడితుల కోసం మనం భావయుక్త ప్రార్థన చేయగలం. **ఈ ప్రార్థన కోట్ల రూపాయల దానానికన్నా ఎక్కువగా ఉపయోగపడుతుంది.**

పీడితుల పీడను బట్టి వ్యక్తిగతమైన లేదా సామూహిక ప్రార్థన చేయాలి. ప్రార్థించేవారు ఎంత ఎక్కువ తపస్సు చేసి, ఆలోచనాపరులై, ఈశ్వరనిష్ఠతో జీవిస్తున్నారు అన్నదానిని బట్టి ఫలిస్తుంది. **ప్రార్థనతో కఠినాతి కఠిన రోగాలు నయమవుతాయి.** పెద్ద పెద్ద విపత్తులను ఎదుర్కోవడం సులువవుతుంది. ఇందుకు కావలసినదల్లా భావభరిత హృదయం, సామాన్యమైన, కపటం లేని జీవితం. వీటన్నిటితో పాటు పరపీడను చూసి ద్రవించి పోయే అంతఃకరణ. ఈ సంపద ఉన్నవారు, ఏది లేకపోయినా, ఎంతోమందికి తమ ద్వారా అమోఘమైన ఈశ్వర సహకారం అందించగలరు. మనసులో ఔదార్యం, సేవ, పరమార్థ పరాయణ భావాలుంటే నిర్ధనుడు కూడా చాలా ఇవ్వగలడు. మన దగ్గర ధనం లేకపోవచ్చు కానీ ఎంతో ఇవ్వగల యోగ్యత పరమాత్మ మనకు ఇచ్చాడు. దీనిని ఉపయోగించి మనందరం భారతీయ సంస్కృతికి మారు పేరుగా చెప్పబడే దేవ సంస్కృతిని వికసింపజేసి, విస్తరింపజేయాలి.

*– అఖండజ్యోతి, మే 2014*

*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

**పరుషమైన మాట పెదవి దాటితే ఓ అందమైన బంధం బీటలు వారుతుంది**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 2

**శ్రీమతి మాచెళ్ళ సీతామహాలక్ష్మి ఫోన్: 08592-237548**



శ్రీమతి మాచెళ్ళ సీతామహాలక్ష్మి (భర్త లక్ష్మీనారాయణగారు) 1938లో ఒంగోలు సమీపంలోని దొడ్డవరం గ్రామంలో జన్మించారు. వీరు ముప్వురు తోబుట్టువులు. వీరు పెద్దవారు కాగా, ద్వితీయ సోదరి శ్రీమతి రాజ్యలక్ష్మి గారు, కనిష్ఠ సోదరి కృష్ణకుమారిగారు, అన్నింటికి మించి ఆశ్చర్యముగొల్పెడిది వీరు ముప్వురూ ఉద్యోగరీత్యా ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడినారు. ఆధ్యాత్మికంగా వీరు ముప్వురితో పాటు వీరి కుటుంబ సభ్యులు కూడా పరమపూజ్యులు పండిత శ్రీరామశర్మఆచార్య మరియు వందనీయ మాతా భగవతీదేవి శర్మల ఆరాధ్యులు.

శ్రీమతి సీతామహాలక్ష్మిగారు మెట్రిక్ లెవెల్ వరకు ఆంగ్లభాషను అభ్యసించారు. అటుపిమ్మట హిందీ భాషలో విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులై, హిందీ పండిట్ శిక్షణ పొంది, ఒంగోలులోని పి.వి.ఆర్. మున్సిపల్ పురపాలక ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా చేరి 1992లో పదవీ విరమణ చేశారు. 1982లో వీరి మేనత్తగారి కుమారుడైన శ్రీ డి.బి.ఎన్. విశ్వనాథ్‌గారి ద్వారా పరమపూజ్యులు గురు సమానులైన శ్రీ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారిగారితో పరిచయం, తద్వారా గాయత్రీ పరివార్‌తో అనుబంధం ఏర్పడింది. శ్రీరామకృష్ణ మాష్టారిగారి ద్వారా గాయత్రీ మంత్ర దీక్షను యజ్ఞ సంస్కారాదుల అభ్యసించి, అటు పిమ్మట 1984 మేలో భర్తతో కలసి హరిద్వార్‌లోని శాంతికుంజ్‌ను దర్శించి వందనీయ మాతాజీ ఆశీస్సుల అందిపుచ్చుకున్నారు. ఆనాడు పూజ్య గురుదేవులు సూక్ష్మీకరణ సాధనలో ఉండుటచే వారి దర్శన భాగ్యం లభించలేదు. 9 రోజుల సాధనా శిబిరంలో పాల్గొన్నారు. ఆనాటి నుండి మాతాజీతో ఉత్తర ప్రత్యుత్తరాలు హిందీలో చేస్తూ వారి హృదయాన్ని చూరగొన్నారు. 1987లో మాతాజీ ఆహ్వానం మేరకు తిరిగి శాంతికుంజ్‌ను దర్శించి, పూజ్య గురుదేవుల ఆశీస్సులనందుకొనుట జరిగింది. అప్పుడు గురుదేవులు సీతామహాలక్ష్మిని ఉద్దేశించి "గిల్‌హరి భాతి తుమ్హారా నామ్ ఇతిహాస్ మే అమర్ రహేగా" (తెలుగు అర్థము: రాముని సేవలో సేతు నిర్మాణ సమయమందు సేవలందించిన ఉడుత పేరులా నీ పేరు కూడా గాయత్రీ పరివార్ కార్యక్రమాల నిర్వహణ క్రమంలో ఒంగోలులో శాశ్వతంగా నిలచిపోతుంది.) అని ఆశీర్వదించుట జరిగింది. అటు తరువాత, సీతామహాలక్ష్మి గారు ఉద్యోగానికి రాజీనామా సమర్పించి, భర్తతో కలసి శాంతికుంజ్‌లో ఉండాలనే ఆకాంక్షను వ్యక్తం చేయగా వారిస్తూ వందనీయ మాతాజీ ఇట్లు సెలవిచ్చారు – "గాయత్రీ పరివార్‌కు శాంతికుంజ్‌లో కన్నా ఒంగోలులోనే మీ సేవల అవసరము ఎక్కువగా ఉన్నది". పూజ్య గురుదేవులు ప్రారంభించిన దేశవ్యాప్త శక్తి పీఠస్థాపన శృంఖలలో భాగంగా ఒంగోలులోని తన స్వగృహంలో ఈమె గాయత్రీ ప్రజ్ఞామండలిని స్థాపించి ఈ ప్రాంతంలో గాయత్రీ పరివార్ వ్యాప్తికి గురుదేవుల సాహిత్య వ్యాప్తికి, ఆలోచనల వ్యాప్తికి, తద్వారా నూతన యుగనిర్మాణానికి తగిన బీజాలు నాటుట జరిగింది. ఇట్లు ప్రారంభమైన శ్రీమతి సీతామహాలక్ష్మి దంపతుల గాయత్రీ ప్రస్థానం, పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి మార్గదర్శనంలో దిన దిన ప్రవర్ధమానమై విరాజిల్లింది. దీనికి తోడు 1987-1991 వరకు ప్రతి సంవత్సరం వరుసగా శాంతికుంజ్ సందర్శనా భాగ్యంతో వీరిలోని గాయత్రీ పట్ల శ్రద్ధాసక్తులు మరింత దృఢతరమై, చుట్టుప్రక్కల 200 గ్రామాలలో గాయత్రి వ్యాపింప చేయుటకు పురికొల్పింది. దీని ద్వారా వందలాది, వేలాది మందికి గాయత్రిని గురించి, గాయత్రీ యజ్ఞాలు, సంస్కారాలు వాని ప్రాధాన్యత తెలిసి వచ్చింది.

1991 జూన్‌లో ఈ దంపతులిరువురూ, ఆవల్‌ఖేడా వెళ్ళి అచ్చటి ధూళిని చేబూని, శపథ సమారోహణ వేళ తమ శేషజీవితమంతా పూజ్యగురుదేవుల కార్యక్రమాల వ్యాప్తికై పాటుపడుతూ, వారి మార్గంలో తమ జీవితాల పండించు కొనెదమని శపథం చేశారు.

దీని ఫలితంగా 1996 నవంబరులో పూజ్యులు శ్రీరామకృష్ణ మాష్టారి మార్గనిర్దేశానుసారం అనుగ్రహపీఠాన్ని లాయరుపేట ఒంగోలులోని తమ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేయుట జరిగింది. ఆనాటి నుండి నేటి వరకు నిర్విరామంగా నిత్య

**ఇతరులను బాధపెట్టే హక్కు ఎవరికి లేదు**

గాయత్రీ హోమము జరుగుతూ ఉన్నది. దీనితోపాటు పర్వదినాలందు గాయత్రీ అనుష్ఠానాలు, సంస్కారాలు చేయుట జరుగుచున్నది. పూజ్యగురుదేవుల ఆదేశానుసారం ఎవ్వరిని యాచించక, తమకున్న సంపదలో అంశదానాన్ని ఇస్తూ నిరాటంకంగా గత 18 సంవత్సరాల నుండి అనుగ్రహ పీఠాన్ని సంతృప్తికరంగా నడిపించుచున్న ధీమంతురాలు. నిధుల లేమి ఏనాడు ఈ పీఠాన్ని బాధించలేదు. జపశక్తి, తపశ్శక్తి ఈ పీఠానికి పెట్టని కోటలు, తరగని నిధులు. తత్ఫలితంగా ఈ పీఠాన్ని సందర్శించే వారి **అర్థవంతమైన కోర్కెలు** తీరుట అనేకులకు అనుభవేకవేద్యం. అవివాహితులకు-వివాహము, నిరుద్యోగులకు-ఉద్యోగప్రాప్తి, ఈతిబాధల నుండి నివారణ, సమస్యల నివారణ మున్నగునవి వందలాదిమందికి చేకూరింది.

పైరీతిగా 76వ పడిలో ఉండి కూడా శ్రీమతి సీతామహాలక్ష్మిగారు పూజ్యగురుదేవుల హిందీ వాఙ్మయాన్ని తెలుగులో ఇప్పుడు అనువదించుట ఆమె దీక్షాదక్షతలకు, సమర్పణకు నిలువెత్తు ఉదాహరణ.

వీరి జీవితము గాయత్రీ పరివారానికే కాక ఎందరికో సదా అనుసరణీయం మరియు స్ఫూరిదాయకం.

**శ్రీమతి కె. భవానీదేవి, సెల్: 9491646310**



శ్రీమతి కె. భవానీదేవి గుంటూరు జిల్లా, రేపల్లె తాలుకాలోని గూడవల్లి గ్రామంలో 1941 జనవరి నెలలో జన్మించారు. అత్యంత భోగభాగ్యాలతో తులతూగిన సాధ్వీమణి. 1986లో పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారిగారి పరిచయంతో, ఆధ్యాత్మిక మార్గం వైపు ఆమె జీవనయానం మలుపు తిరిగింది. తదుపరి 1989లో హరిద్వార్ యాత్రతో పూజ్యగురుదేవులు, వందనీయ మాతాజీల దివ్య సందర్శన భాగ్యం కలిగింది. అప్పుడే తొమ్మిది రోజుల పాటు అనుష్టానం పూర్తిచేసి పూజ్య గురుదేవుల నుండి గురుదీక్షను తీసికొని వారి పాదస్పర్శ ద్వారా ఆధ్యాత్మిక మార్గంలో తన ప్రయాణాన్ని మరింత ముందుకు తీసికొని వెళ్ళారు. పూజ్య గురుదేవుల సమక్షం నుండి వీడ్కోలు తీసికొనే వేళ, వారి కరుణాదృక్కులు భవాని గారిని మరింత గాఢంగా ఆధ్యాత్మిక చింతనలో పడవేశాయి. తదుపరి శ్రీ మాష్టారి మార్గదర్శనంలో అనేకానేక ఆధ్యాత్మిక సాధనా కార్యక్రమాల్లో పాలుపంచుకొన్నారు. ఈ రీతిగా ఒంగోలు హైస్కూలులో దశసహస్ర దీపయజ్ఞములో గణనీయమైన పాత్రను పోషించుట జరిగింది. శ్రీమతి భవానీదేవిగారిలో, నిబిడీకృతమైయున్న ఆధ్యాత్మిక తత్పరతను తట్టి నిదురలేపి, మాష్టారు, ఆమెను నెల్లూరు జిల్లాలోని పొదలకూరు తాలుకాలో ఉన్న కాకివాయి ఆశ్రమ నిర్మాణానికి సంకల్పం ఇచ్చారు. ఆమెను మాతాజీగా తీర్చిదిద్దారు. ఈ ఆశ్రమ ప్రదేశంలో అలనాడు వశిష్ఠ మహర్షి, దూర్వాస మహాముని మరియు కణ్వమహర్షులు చేసిన తపస్సులతో పునీతమై శక్తి క్షేత్రంగా విలసిల్లింది. తదుపరి వరుసగా శ్రీ షిర్డిసాయి, శ్రీ సొరకాయ స్వామి మరియు శ్రీ గొలగమూడి వెంకయ్య స్వాములు నడియాడి అలనాటి ఋషులు అందించిన దివ్యశక్తుల పదిలపరచగా, అదే నేటి స్మర్తుగామి సిద్ధ క్షేత్రం - శ్రీరామహంస ఆశ్రమంగా రూపు దాల్చింది. పూజ్యులు శ్రీరామకృష్ణ మాష్టారు అందించిన శక్తితో, భవానీదేవి తనకు అప్పగించిన ఆశ్రమ నిర్మాణ కార్యక్రమాన్ని తనకు గల **"తన్, మన్, ధన్"** (శారీరక, మానసిక, ఆర్థిక) శక్తుల పూర్తిగా వినియోగించి అత్యంత సమర్పణాభావంతో గత 18 సంవత్సరాలుగా (బీజం నాటిన దగ్గర నుండి నీరు, ఎరువు వేసి, పెంచి, పోషించి, పుష్పించి, ఫలాలనందించే స్థాయికి చేర్చింది) విస్తరిస్తూ, అగ్ని విద్యాకేంద్రంగా విస్తరింప జేసింది ఈ మాతాజీ. ఈ క్షేత్ర నిర్మాణంలో ఆది నుండి నేటి వరకు అణువణువులో తన కృషిని నింపుతూ నిజమైన నారీశక్తికి ప్రతిరూపంగా పేరుకు తగ్గ (భవాని) రీతిలో అవిశ్రాంత కృషి సల్పిన ప్రేరణామూర్తి - ధృఢ సంకల్పశాలి ఈమె.

ద్వాపర యుగంలోని పాండవమాత కుంతీదేవి, ఈ యుగంలో ఒక అవధూత రూపంలో వచ్చి ఈ క్షేత్ర ప్రాంగణ సమీపంలో తన తుదిశ్వాసను శ్రీమతి భవానీగారి సాన్నిధ్యంలో విడచిపెట్టుట, భవానీగారిలోని ఆధ్యాత్మిక ప్రగతికి పరాకాష్ట. పూజ్యగురుదేవుల అనుగ్రహానికి నిలువెత్తు ఉదాహరణ ఆ దివంగత అవధూతకు ఒక స్మారకాన్ని నిర్మించి నివాళులు అర్పించింది.

**మంచివారిని వారి జీవితాంతం కష్టాలు వరిస్తాయి.** కారణం ఏమిటని ప్రశ్నించగా పూజ్యగురుదేవులిచ్చిన సమాధానం **"మంచివారు అనుక్షణం తమని తాము సంస్కరించుకొనుటకై కష్టాలను స్వాగతిస్తూ ఉంటారు"** అనే దానికి అక్షర సత్యంగా శ్రీమతి భవానీ మాతాజీగా ఆధ్యాత్మిక

**బంధాలను నిలబెట్టుకోవాలంటే ఒక్కోసారి తగ్గాలి**

జీవితం నిలుస్తుందనుటలో సందేహం లేదు. వీరి జీవితం మనందరికి స్ఫూర్తిదాయకం, సదా ఆచరణీయం.

**డా॥ పులి సత్యన్నారాయణ, సెల్: 94405 16042**



పులి సత్యన్నారాయణగారు ఇంటి పేరులో ''పులి''ని తలపించినా ప్రవృత్తిలో ప్రేమాస్పదులు, స్ఫూర్తి దాతలు, స్నేహశీలి, మృదుభాషి. ఆయుర్వేద వైద్యంలో వైద్య విశారద వరకు' బీహారులోని పాట్నానగరంలో విద్యనభ్యసించారు. 1968 నుంచి బొంబాయి మహానగరంలో 8 సంవత్సరాల పాటు వైద్యం చేస్తూ నూలుమిల్లులో వీవర్‌గా పనిచేశారు. 1992లో మహారాష్ట్రలోని భివాండి పట్టణంలో గాయత్రీ పరివార్‌తో పరిచయం అచ్చట తెలుగువారిని సంఘటిత పరచి వారితో ప్రజ్ఞాపీఠాన్ని ప్రారంభించుట ద్వారా గాయత్రీ ఉపాసనకు అంకురార్పణ జరిగింది. ఆ రోజులలోనే గుంటూరు జిల్లా నారాకోడూరులోని గాయత్రీ శక్తిపీఠము నుండి 108 మాస పత్రికలు తెప్పించి పంపిణీ చేసేవారు.

అటుపిమ్మట శ్రీ సత్యన్నారాయణగారి ఆధ్యాత్మిక ప్రస్థాన వేదిక మహారాష్ట్ర నుండి ఆంధ్రప్రదేశ్‌లోని వేములవాడకు మారింది. ఇచ్చట నుండి సిరిసిల్ల, జగిత్యాల, ధర్మారం, వెల్లటూరు ప్రాంతాలలో గాయత్రిని పరిచయం చేసి పూజ్య గురుదేవుల వాణిని కరీంనగర్ జిల్లా అంతటా వినిపించుటకై అవిరళ కృషి చేశారు. దీనిలో భాగంగా మాన్యులు శ్రీ తుమ్మూరి శివరామకృష్ణారెడ్డి, నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠం వ్యవస్థాపకులు మార్గదర్శనంలో గాయత్రీ యజ్ఞాలు, అనుష్ఠానాలు జిల్లా అంతటా వ్యాప్తి చేయుటకై తన శక్తిని సద్వినియోగపరచారు. తిరుపతి అశ్వమేధయాగం వేళ రెండు మాసాలపాటు సమయదానమిచ్చి తన సేవలనందించారు. తదుపరి మధురై (తమిళనాడు) అశ్వమేధ యాగంలో కూడా పాల్గొన్నారు.

పై సుదీర్ఘ అనుభవాన్ని ప్రోదిచేసికొన్న మన శ్రీ సత్యన్నారాయణగారు వేములవాడ స్థానదేవత భీమేశ్వరుని ఆశీస్సులతో గాయత్రీ ప్రజ్ఞాపీఠాన్ని నిర్మించుటలో నిమగ్నమై ఉన్నారు. ఈ రీతిగా ఆయుర్వేద వైద్య విశారద సత్యన్నారాయణ గారు మనందరికీ స్ఫూరిదాత, ప్రేరణాప్రదాతగా నిలిచారు.

## గృహస్థ కర్తవ్యం

*ఆ రోజుల్లో జబల్‌పూర్‌లో మత కల్లోలాలు ఎక్కువయ్యాయి. నగరంలో కర్ఫ్యూ విధించారు. ఎప్పుడో ఒకసారి గంట, రెండు గంటలు మాత్రమే ప్రజలను బయటకు వదిలేవారు. ఆ కొద్దిపాటి సమయంలోనే అత్యవసరమైన పనులు చేసికోవాల్సి వచ్చేది. ఒకరోజున ఖాన్ అనే ఆయన తన స్నేహితుడిని స్టేషన్ వరకు పంపించటానికి వెళ్ళాడు. తిరిగి వస్తూ ఉండగా కర్ఫ్యూ సడలింపు సమయం అయిపోయింది. ఇంటిదాకా వెళ్ళటం చాలా కష్టం. ఎదురుగా పోలీసు వాహనం వస్తోంది. ఖాన్ ప్రక్కనున్న సందులోకి దూరిపోయాడు. కాని నిజానికది సందు కాదు. ఒక ఇంటివెనుక భాగం. ఖాన్ చాలా భయపడిపోయాడు. ఏమీచేయలేక అలాగే నిలబడిపోయాడు. ఇంతలో లోపలి నుండి "ఎవరది? ఎవర్నడిగి లోపలకు వచ్చావు?" కఠినంగా ప్రశ్నించటం వినిపించింది. భయంతో నోటమాట రావటం లేదు. "నా పేరు ఖాన్. కొద్దిసేపట్లో వెళ్ళిపోతాను" భయం భయంగా గజగజలాడుతూ చెప్పాడు. అప్పటివరకు కఠినంగా ప్రశ్నించిన స్వరం మృదువుగా మారిపోయింది. స్నేహపూర్వకంగా "నాయనా! రాత్రి అయింది. ఈ పరిస్థితిలో ఇంటికెలా వెళ్తావు? రేపు ఉదయం వెళ్ళవచ్చు" అన్నాడు గృహ యజమాని. తెల్లవారిందాకా బ్రతకనిస్తారో లేదోనన్న భయంతోనే రాత్రంతా అక్కడే గడిపాడు. తెల్లవారింది. యజమాని వచ్చి "నీవు ఇక క్షేమంగా ఇంటికి వెళ్ళిపో. నీవు ముసల్మానువని త్రోవలో నీకేదైనా ఆపద కలుగుతుందన్న భయంతోనే నిన్ను ఆపివేశాను" అన్నాడు ఆప్యాయతగా. అతని ఉదారతకు ఖాన్ కరిగిపోయాడు. వంగి పాదాలకు నమస్కరించపోయాడు. ఆ యజమాని అతనిని ఆపి గట్టిగా కౌగలించుకున్నాడు. "ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం ఒక గృహస్తుగా నా కర్తవ్యం" అంటూ సాదరంగా సాగనంపాడు.*

– *అనువాదం:* పొన్నూరు హైమవతీ శాస్త్రి

**ఒక్కసారి సారీ (sorry) అని చెప్తే ఏం పోతుంది?**

# దేవసంస్కృతి విశ్వవిద్యాలయం - వార్షిక విద్యా సంవత్సరము 2014-15

**(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు పొందినది)**

**విశ్వసంస్కృతి మరియు ఆధ్యాత్మిక పునర్వికాసానికై ఏర్పడిన ఏకైక విశ్వ విద్యాలయం**

### ఒక దివ్య దార్శనికుని కల

దేవసంస్కృతి విశ్వ విద్యాలయం ఏబది సంవత్సరాల క్రితం కులపతి పండిత శ్రీరామశర్మ ఆచార్య (1911-1990), పండితుడు, ఋషి మరియు విశ్వ గాయత్రీ పరివార్ వ్యవస్థాపకుడు, ఒక విశిష్ఠ విశ్వ విద్యాలయాన్ని గురించి కలకన్నారు. అది ఆచరణాత్మకమైన ధర్మాన్ని (శిక్ష) మరియు ఆధ్యాత్మిక విద్య (విద్య) ను కలగలిపి శిక్షణ ద్వారా వారిని జ్ఞానప్రకాశవంతమైన విద్యార్థులనుగా తయారు చేసెడి విశ్వవిద్యాలయం. దీని ద్వారా విద్యార్థులు తమలోని అంతర్గత శక్తులను క్రమానుగతంగా వెలికి తీస్తూ తద్వారా దైవత్వ విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించెడి లక్ష్యదిశగా అడుగులు వేస్తూ ప్రగతి పథంలో సాగెదరు. ఈ విద్యార్థులంతా సామాన్య ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అనుసరించెదరు. వీరికి ఆధునిక విద్యాప్రగతికి సంబంధించిన జ్ఞానంతోపాటు వివేక వంతమైన మన ప్రాచీన ఆచార వ్యవహారముల, ఆచరణలో పెట్టుట నేర్పుతూ జ్ఞానమును అందించుట జరుగుతుంది.

### ఆదర్శయుక్తమైన సంస్థానము

వందనీయ కులమాత భగవతీదేవిశర్మ (1926-1994) పూజ్యగురుదేవుల శ్రద్ధాంజలి సమారోహ సమయమందు (1990)లో **ఈ స్థలములో నిక్షిప్తమై ఉన్న దైవీ సంస్కారాల ప్రకంపనల గుర్తించి, దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ నిర్మాణానికి అనువైన స్థలంగా దీనిని ఎంపిక చేశారు.**

ఈ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన ఏప్రిల్ 2002న శాంతికుంజ్, హరిద్వార్ వారి సారథ్యంలో జరిగింది. తదుపరి భారత ప్రభుత్వ విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపుతో దీనికి సంపూర్ణ గుర్తింపు లభించింది. ఆనాటి నుండి జాతి, మత, కుల, వర్ణ, వర్గ విభేదాలకతీతంగా దేవ సంస్కృతిని విశ్వవ్యాపితం చేయుటలో ఒక మాధ్యమంగా నిలచింది. అనేక ఇతర విశ్వవిద్యాలయాల మాదిరిగా కాక, ఈ దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం విద్యార్థి జీవితానికి సంబంధించిన, విద్య సంస్కృతి, సామాజిక మరియు ఆధ్యాత్మిక రంగాల అవసరాలను తీర్చుటలో విశిష్ఠ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నది. **దీనిలో విద్య నభ్యసించెడి వారి అంతిమ లక్ష్యము సిరిసంపదల ప్రోది చేసికొని వానిని పెంపొందించుకొనుట కాక, బాధ్యతాయుత పౌరులుగా తమను తాము మలచుకొని తద్వారా న్యాయ బద్ధతతో కూడి దినదిన ప్రవర్ధమానం చెందే సమాజ నిర్మాణానికి పాటుపడుట.** ఈ విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులతో పాటు, విద్యార్థులు కూడా ఈ లక్ష్యసాధనకై అంకితమైయున్నారు. **కలిసికట్టుగా విశ్వంతో ముడిపడి ఉన్న సమస్యలకు, సమీపంలో అందుబాటులో ఉన్న సృజనాత్మక పరిష్కారాలను కనుగొంటూ ఉంటారు. ఆరోగ్యవంతమైన సామాన్య జీవితాన్ని గడుపుతూ, మన ప్రాచీనులు మనకు అందించిన సంస్కృతి విలువల ఆచరిస్తూ, పరిరక్షిస్తూ, వేదామోదమైన యోగ, యజ్ఞము, సామూహిక ప్రార్థన మరియు జపములను అనునిత్యం ఆచరిస్తూ వారి వారి విద్యా వ్యాసంగాలను కొనసాగించుట ఇచ్చటి విద్యాబోధనలోని ప్రత్యేకత.**

ప్రాచీన గురుకుల విధానాన్ని అనుసరించి విద్యాబోధన జరుగుతూ ఉంటుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి విద్యార్థులు ఇచ్చట విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరితోపాటు కొరియా, జపాన్, ఇరాన్, మలేషియా, చైనా, రష్యా, స్పెయిన్, జర్మనీ, చెక్ రిపబ్లిక్, అమెరికా, ఆస్ట్రేలియా, శ్రీలంక, భూటాన్ మున్నగు దేశాల నుండి వచ్చిన విద్యార్థులు విద్యను అభ్యసించు చున్నారు.

**అంతర్జాతీయ విద్యాసంస్థలతో అవగాహన:**

ఈ క్రింద ఉదహరించిన అంతర్జాతీయ విద్యాసంస్థలతో విద్యాబోధన ఒప్పందాలు కలిగియున్నది.

| | దేశము పేరు | విద్యాసంస్థ పేరు |
|---|---|---|
| 1. | అర్జెంటీనా | మైమోనైడ్స్ యూనివర్సిటీ బోనేస్ ఐర్స్ |
| 2. | చైనా | జింగ్స్ యూనివర్సిటీ ఆఫ్ ట్రెడిషనల్ చైనీస్ మెడిసిన్, నాన్‌ఛంగ్ |

**ఒక్కసారి మనస్ఫూర్తిగా (sorry) అంటే ఎదుటివారి కోపం దూదిపింజలా ఎగిరిపోతుంది**

3. కజకిస్తాన్ యం.యుటెమిస్సోవ్ వెస్ట్ కజకిస్తాన్ స్టేట్ యూనివర్సిటీ, కజకిస్తాన్

4. జర్మనీ వేడెన్ అకాడమీ, బెర్లిన్

5. ఇండోనేషియా యూనివర్సిటాస్ హిందూ ఇండోనేషియా, డెన్‌పసర్, డెన్‌పసర్ స్టేట్ హిందూ ధర్మ యూనివర్సిటీ డెన్‌పసర్

6. ఇటలీ అకాడమీ ఆఫ్ ట్రెడిషనల్ ఇండియన్ సైన్సెస్, పిసా

7. కొరియా డోన్గుక్ యూనివర్సిటీ, కొరియా

8. లత్వియా యూనివర్సిటీ ఆఫ్ లత్వియా, రిగా మ్యూజిక్ & ఆర్ట్స్ ఫౌండేషన్, రిగా

9. పోలండ్ కజిమియర్జ్ వియల్కి యూనివర్సిటీ, పోలండ్

10. రష్యా యుజిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, క్రాస్‌నోదర్, రష్యా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ & జెనెటిక్స్ క్రాస్‌నోదర్, రష్యా

11. యునైటెడ్ కింగ్‌డమ్ ది లీడర్‌షిప్ హిబ్ లిమిటెడ్, లండన్, యు.కె. ఎ.బి.ఎమ్.ఎ. ఎడ్యుకేషనల్ లిమిటెడ్, లండన్, యు.కె.

12. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ కల్చరల్ స్టడీస్ వరల్డ్ అసోసియేషన్ ఫర్ వేదిక్ స్టడీస్

**విశ్వవిద్యాలయ ఆదర్శాలు మరియు చేరుకోవలసిన లక్ష్యాలు:**

1) భారతీయ సంస్కృతి విలువలను, మానవతా విలువలను విశ్వవ్యాపితం గావించుట.

2) దేవ సంస్కృతిని బోధించుట మరియు దానిపై పరిశోధనలు చేయుట. అటు పిమ్మట శాస్త్రవిజ్ఞానాన్ని, ఆధ్యాత్మికతతో సరియైన రీతిలో అనుసంధానం గావించి, ఒకదానికొకటి పరస్పర పూరకాలని, ఋజువు చేయుట.

3) శాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన అన్ని రంగాలలో, ప్రాచీన వైదిక సంస్కృతి జ్ఞానాన్ని ఆధారంగా చేసికొని ఈ క్రింది రంగాలలో పరిశోధనలను ప్రోత్సహించుట. ఆయుర్వేదం, మంత్రాలకు సంబంధించిన శాస్త్ర విజ్ఞానం, యోగా, మనోవిజ్ఞాన శాస్త్రము, జ్యోతిష్యం, యజ్ఞము దాని శాస్త్ర విజ్ఞానం, ఖగోళ విజ్ఞానం, ప్రత్యామ్నాయ వైద్యవిజ్ఞాన శాస్త్రముల మున్నగు రంగాలలో పరిశోధనలు చేపట్టుట.

4) స్వయం ఉపాధి, స్వావలంబన, గ్రామ పరిపాలన మరియు వాని యాజమాన్య విధి విధానాల (పండిత శ్రీరామశర్మ ఆచార్య దర్శించిన, ప్రబోధనల ఆధారంగా) బోధన మరియు పరిశోధనల చేపట్టుట

5) ప్రాచీన గురుకుల విద్యాబోధన వాతావరణాన్ని సృష్టించి తిరిగి దానిని ప్రాచుర్యంలోనికి తెచ్చుట.

## ఈ విశ్వవిద్యాలయ ప్రత్యేక విశిష్టతలు

**శాస్త్ర విద్యను, ఆధ్యాత్మిక విద్యతో అనుసంధానం:**

విశ్వవిద్యాలయ ప్రధాన లక్ష్యాలలో అతి ప్రధానమైనది. శాస్త్ర మరియు ఆధ్యాత్మిక విద్యల మధ్య చక్కని మేళవింపు సాధించి తద్వారా రెండింటి మధ్య స్పష్టమైన అవగాహన కల్పించి తద్వారా మానవజీవితానికి పరిపూర్ణతను చేకూర్చుట. శాస్త్రవిద్య మనిషిలో వివేకపూరిత తర్కాన్ని పెంపొందించగా, ఆధ్యాత్మిక విద్య మనిషి పరిపూర్ణతకు కావలసిన భావ సంవేదనలతో కూడిన సహనశీలతను, ప్రేమను పెంపొందిస్తుంది.

పై లక్ష్యసాధనను మనస్సునందిడుకొని, వ్యవస్థాపక పితృ సమానులు, వేదమూర్తి, తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్య పరిశోధనా సంస్థయైన బ్రహ్మవర్చస్ వ్యవస్థకు జూన్ 1979న గాయత్రీ జయంతి రోజున శంకుస్థాపన చేయుట జరిగింది.

దీనిలో ఎలక్ట్రోఫిజియాలజి విభాగం, న్యూరాలజీ, కార్డియాలజి, బయోకెమిస్ట్రీ, హెమటాలజీ మున్నగు విభాగాలు ఏర్పాటు చేశారు.

విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఒక ప్రక్క భగవద్గీత ద్వారా ఆధ్యాత్మిక విద్యాబోధన జరుగుతూ ఉంటుంది. మరో ప్రక్క కంప్యూటర్ టెక్నాలజీ, శాస్త్ర, సాంకేతిక, విద్యాభోధన జరుగుతూ ఉంటుంది. మరో ప్రక్క కంప్యూటర్ టెక్నాలజీ,

**భయాన్ని వదిలించుకున్న క్షణం నుంచే నిజంగా జీవించగలుగుతాము**

యానిమేషన్ మరియు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌ల ద్వారా ఆధునిక ఆర్యభట్ భవనంలో జ్యోతిష్యశాస్త్రవిజ్ఞానంపైన మరియు వైదిక విజ్ఞానాభివృద్ధికై పలు విస్తృత పరిశోధనలు జరుగుతుంటాయి. వీని ద్వారా శాస్త్ర, ఆధ్యాత్మిక విద్యల మధ్య చక్కని మేళవింపు పటిష్ఠంగా సాధించుటకు కృషి చేయుటకు అనుకూలమైన వేదికను రూపొందించుట జరిగింది.

**జ్ఞాన దీక్షా ప్రక్రియ (దైవీశక్తుల ప్రార్థించుట) ఈ విశ్వ విద్యాలయం స్వంతం:**

ప్రణాళికాబద్ధంగా ప్రారంభించినదేదైనా సగము పూర్తి చేసినట్లే అనేది పెద్దల నానుడి. ఈ విశ్వవిద్యాలయం ఒక వినూత్న విశిష్ట ఆనవాయితీని "జ్ఞానదీక్షా" (దైవీశక్తుల ప్రార్థించుట) అనే పేరుతో ప్రతి విద్యా శిక్షణ ప్రారంభానికి ముందు ప్రవేశపెట్టింది. ఈ ప్రక్రియ ద్వారా విద్యార్థి అంతరంగాన్ని, మనస్సును, ఆలోచనలను, తాను పొందబోయే విద్యపై కేంద్రీకరించుటకు కావలసిన వాతావరణం కల్పించ బడుతుంది. ఈ ప్రక్రియ విశ్వవిద్యాలయ కులపతి చేపట్టి, విద్యార్థులను తమను తాము ఆ దైవీ సంస్కృతికి అర్పణ గావించుకొనే విధంగా ప్రేరేపిస్తున్నారు. తదుపరి వీరికి విశ్వవిద్యాలయ అధికారిక చిహ్నాన్ని అందజేస్తారు.

**మానవజీవిత యాజమాన్య నిర్వహణ (లైఫ్ మేనేజ్‌మెంట్)**

మనిషి యొక్క జీవన ప్రగతి మరియు జీవన లక్ష్యాన్ని చేరుకొనుట అనేవి, అతడు / ఆమె తమ జీవన విధానాన్ని మలచుకొనుటపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ప్రతివాడు తన విద్యా వ్యాసంగాన్ని మరియు తదితర అంశాలను నిర్వహించుటలో తగిన శ్రద్ధ వహిస్తాడు. కానీ తమ జీవనశైలిని నిర్వహించుటలో తరచు ఒడుదుడుకులకు లోనవుతూ ఉంటాడు. నేటి కాలపు యువతకు, వారి నిత్యజీవన శైలిని నిర్వహించుటకై శిక్షణ అత్యంత ఆవశ్యకంగా మారింది. అందువలన ప్రతి విద్యార్థికి ఈ మానవ జీవిత యాజమాన్య నిర్వహణ (లైఫ్ మేనేజ్‌మెంట్) పాఠ్యాంశాన్ని తప్పనిసరి అంశంగా వారి విద్యాభ్యాసంలో చేర్చారు. దీనిలో నిత్య జీవన నిర్వహణ, పాఠ్యంశముల పఠనా నిర్వహణ, సమయ నిర్వహణ, ఒత్తిడి నిర్వహణ, పొరుగువారితో సత్సంబంధాల నిర్వహణ, భావవ్యక్తీకరణ నిర్వహణ, సృజనాత్మకశైలిలో ప్రగతిసాధన, నాయకత్వ లక్షణాల పెంపొందించుకొనుటలో శిక్షణ, మున్నగు వానిలో తగిన శిక్షణ ఇస్తారు. దీనిలో సంపూర్ణ ప్రగతిసాధన కొరకై 5 రోజుల అంతర్ ఊర్జా సత్ (అంతర్గత శక్తుల పెంపుదల శిబిరము) విశ్వవిద్యాలయం చేపట్టింది. దీని ద్వారా పొందిన శిక్షణ అద్భుత ఫలితాల సాధన, విద్యార్థులకు మరపురాని మధురానుభూతులు మిగుల్చుకున్నది.

**ప్రాంగణంలో నిత్య ఆధ్యాత్మిక జీవనశైలి:**

ఉపాధ్యాయులతోపాటు, విద్యార్థులు కూడా బ్రహ్మ ముహూర్తాన (ఉదయం 5 గం॥లకు) నిద్ర మేల్కొంటారు. ఆధ్యాత్మిక త్రివేణి అయిన ప్రార్థన, జపము మరియు యజ్ఞములో పాల్గొంటారు. అటు పిమ్మట విద్యార్థులు వారి వారి వ్యాసంగాలలో నిమగ్నమవుతారు.

**విశ్వవిద్యాలయ కులపతిచే విద్యాబోధన:**

ప్రతివారము విశ్వవిద్యాలయ కులపతి అనగా పరమా చార్యుల వారు భగవద్గీతపై తరగతులు నిర్వహించెదరు. విద్యార్థులంతా దీనికి తప్పనిసరిగా హాజరు కావాలి. దీని ద్వారా విద్యార్థులు తమ ఆలోచనల నియంత్రించుకొనే విధానాన్ని నేర్చుకొని తద్వారా వారిలో సద్వివేకం జాగృతి గావింపబడుతుంది. అట్లే జపము ద్వారా విద్యార్థులలో మానసిక చైతన్యము కలిగి మనస్సుపై నియంత్రణను సాధించుటకై ప్రయత్నించెదరు. ఉదయించే సూర్యునిపై ధ్యానం తద్వారా ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకొనుట, అట్లే భక్తి, జ్ఞాన, కర్మ యోగాల గురించి విద్యార్థుల అవగాహనను పెంపొందించుటకు కృషి చేసెదరు.

**సమయ-అంశ దానములు:**

ఇచ్చట ఉపాధ్యాయులు మొదలుకొని విద్యార్థులు మరియు పరిపాలనా విభాగములోని వ్యక్తులందరు, చిన్న పెద్ద తేడా లేకుండా వారి వారికి గల జ్ఞానాన్ని, పనితనాన్ని నైపుణ్యాలను, వనరులను ఎదుటివారి ఎదుగుదలకు తద్వారా సమాజ ప్రగతికి, సమాజ కళ్యాణానికి స్వచ్ఛందంగా వినియోగించెదరు. ఈ రీతిగా వారికి గల ప్రతిభా పాటవాలను తమ స్వార్థానికి కాక, ఆర్థిక సంపాదనకు కాక, సమాజ ప్రగతికై వెచ్చించుట అత్యంత ముదావహం. ఈ విశ్వవిద్యాలయానికి గల ప్రత్యేక విశిష్టతలలో ఇది కూడా ఒకటి.

**కరెంటు పోతే తిట్టుకుంటూ కూర్చోవడం కన్నా చిరుదివ్వెను వెలిగించడం మిన్న**

## లభ్యములోనున్న కోర్సులు

| డిపార్ట్‌మెంట్ పేరు కోర్సు కోడ్ | కోర్సు వివరాలు | కాలపరిమితి | సీట్లు | సాంవత్సరిక ఖర్చు (రూ.) |
|---|---|---|---|---|
| **1. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్స్** | | | | |
| యం-05 | యం.ఎ. జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్ | 2 సం॥లు | 15 | 45,000/- |
| పి-03 | పి.జి. డిప్లొమా జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్ | 1 సం॥ | 15 | 45,000/- |
| డి-02 | అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ విజువల్ ఎఫెక్ట్స్-3డి కంప్యూటర్ గ్రాఫిక్స్ | 2 సం॥లు | 15 | 1,17,000/- |
| డి-01 | డిప్లొమా ఇన్ విజువల్ ఎఫెక్ట్స్, కంపోజిటింగ్ | 1 సం॥ | 20 | 1,32,000/- |
| హెచ్-03 | పి.హెచ్.డి. జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్ | - | - | - |
| **2. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్స్ సైన్స్** | | | | |
| యం-53 | యం.ఎస్.సి. కంప్యూటర్ సైన్స్ | 2 సం॥ | 15 | 45,000/- |
| బి-04 | బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బి.సి.ఎ.) | 3 సం॥ | 40 | 82,000/- |
| హెచ్-07 | పి.హెచ్.డి. కంప్యూటర్ సైన్స్ | - | - | - |
| **3. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్** | | | | |
| యం-04 | యం.ఎ. అప్లైడ్ ఎడ్యుకేషన్ | 2 సం॥ | 5 | 36,000/- |
| బి-03 | బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బి.ఇ.డి.) | 1 సం॥ | 100 | 60,000/- |
| హెచ్-06 | పి.హెచ్.డి ఎడ్యుకేషన్ | - | - | - |
| **4. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్** | | | | |
| యం-56 | యం.ఎస్.సి. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ | 2 సం॥ | 10 | 36,000/- |
| హెచ్-11 | పి.హెచ్.డి | - | - | - |
| **5. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియన్ కల్చర్ & టూరిజం** | | | | |
| యం-07 | యం.ఎ. టూరిజం మేనేజ్‌మెంట్ | 2 సం॥ | 10 | 36,000/- |
| యం-06 | యం.ఎ. ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్ | 2 సం॥ | 10 | 36,000/- |
| హెచ్-08 | పి.హెచ్.డి. టూరిజం | - | - | - |
| హెచ్-09 | పి.హెచ్.డి. హిస్టరీ | - | - | - |
| **6. డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజెస్** | | | | |
| యం-09 | యం.ఎ. సంస్కృతం | 2 సం॥ | 5 | 36,000/- |
| యం-10 | యం.ఎ. హిందీ | 2 సం॥ | 5 | 36,000/- |
| హెచ్-10 | పి.హెచ్.డి. సంస్కృతం | - | - | - |
| హెచ్-12 | పి.హెచ్.డి. హిందీ | - | - | - |
| **7. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్** | | | | |
| సి-03 | సర్టిఫికెట్ థియాలజీ | 6 నెలలు | 20 | 18,500/- |
| హెచ్-04 | పి.హెచ్.డి. ఓరియంటల్ స్టడీస్ | - | - | - |

**జీవిత భాగస్వామి ఆలంబనగా ఉండటంలోనే ఉన్నది అసలైన విజయం**

| | | | | |
|---|---|---|---|---|
| **8. డిపార్ట్‌మెంట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్** | | | | |
| యం-57 | యం.ఎస్.సి. అప్లైడ్ మెడిసినల్ ప్లాంట్ సైన్స్ | 2 సం॥ | 5 | 36,000/- |
| డి-03 | డిప్లొమా సెల్ఫ్ ఎంట్రాప్రెన్యూర్‌షిప్ రూరల్ డెవలప్‌మెంట్ | 1 సం॥ | 15 | 36,000/- |
| సి-05 | సర్టిఫికెట్ వాటర్ రిసోర్స్ కన్సర్వేషన్ & మేనేజ్‌మెంట్ | 6 నెలలు | 10 | 18,500/- |
| సి-07 | సర్టిఫికెట్ హ్యాండ్‌ల్యూమ్ టెక్నాలజీ | 6 నెలలు | 10 | 18,500/- |
| **9. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజి** | | | | |
| యం-01/యం.ఎస్.టి. యం.ఎ. / యం.ఎస్.సి. క్లినికల్ సైకాలజి | | 2 సం॥ | 30 | 36,000/- |
| **10. డిపార్ట్‌మెంట్ ఆఫ్ యోగ & హెల్త్** | | | | |
| యం-02 | యం.ఎ. అప్లైడ్ యోగ & హ్యూమన్ ఎక్సలెన్స్ | 2 సం॥ | 30 | 36,000/- |
| యం-54 | యం.ఎస్.సి. యోగ సైన్స్ & హోలిస్టిక్ హెల్త్ | 2 సం॥ | 30 | 36,000/- |
| యం-08/యం55 | యం.ఎ. / యం.ఎస్.సి. హ్యూమన్ కాన్షియస్‌నెస్ యోగ | 2 సం॥ | 20 | 36,000/- |
| పి-01 | పి.జి. డిప్లొమా హ్యూమన్ కాన్షియస్‌నెస్ యోగ & ఆల్టర్‌నేటివ్ థెరపీ | 1 సం॥ | 10 | 36,000/- |
| సి-04 | సర్టిఫికెట్ యోగ హ్యూమన్ కాన్షియస్‌నెస్ యోగ & ఆల్టర్‌నేటివ్ థెరపీ | 6 నెలలు | 20 | 18,500/- |
| సి-01 | సర్టిఫికెట్ హోలిస్టిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ | 6 నెలలు | 20 | 18,500/- |
| హెచ్-01 | పి.హెచ్.డి. హ్యూమన్ కాన్షియస్‌నెస్ & యోగ సైన్స్ | - | - | - |
| **11. బ్యాచిలర్ ఆఫ్ డిగ్రీ** | | | | |
| బి-01 | బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (బి.ఎ.) | 3 సం॥ | 50 | 36,500/- |
| బి-02 | బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బి.ఎస్.సి.) | 3 సం॥ | 50 | 36,500/- |

**గమనిక:** పి.హెచ్.డి. కోర్సును గురించిన వివరాలను పి.హెచ్.డి. సెల్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆఫీసు నుండి పొందగలరు.

**యం.ఎ. (యం-01), యం.ఎస్.సి (యం-51) క్లినికల్ సైకాలజి మాస్టర్ డిగ్రీ కోర్సుకు ప్రవేశ వివరాలు**

**కాలపరిమితి:** 2 సం॥

**ప్రవేశం:** ప్రవేశ పరీక్ష మరియు వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా

**ప్రవేశ అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ 50% మార్కులతో ఉత్తీర్ణత, గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి. 10+2+3 విద్యా విధానాన్ని అనుసరించి

**వయోపరిమితి:** 30 సం॥లు

**విశ్వ విద్యాలయంలో ప్రవేశాన్ని కోరే వారికి ముఖ్యమైన సమాచారం:**

- ప్రవేశాన్ని కోరే విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నేరుగా విశ్వవిద్యాలయ కార్యాలయం నుండి రూ. 200/- చెల్లించి పొందవచ్చును.
- డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా రూ. 250/- చెల్లించి పోస్ట్ ద్వారా కూడా పొందవచ్చును.
- పరీక్ష ఫీజు రూ. 500/- అదనంగా చెల్లించాలి.
- వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని పొంది రూ. 700/- డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా చెల్లించి పోస్టు ద్వారా దరఖాస్తు చేయవచ్చు.
- ప్రవేశ పరీక్షకు ఆఖరి తేది 23.06.2014, పరీక్షా కేంద్రం హైదరాబాదు

మరిన్ని వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం: 01334-261367, ఎక్స్‌టెన్షన్: 5407, 5409
మొబైల్: 9258369877, 9258369724
ఫ్యాక్స్: 01334-260723
e-mail: admissions@dsvv.ac.in, info@dsvv.ac.in
Website: www.dsvv.ac.in

**దేని మీద ఆసక్తి ఉన్నదో ఆ పని చేస్తే విజయం లభిస్తుంది**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## కొత్తపాలెంలో

2014 ఏప్రిల్ 15న గుంటూరు జిల్లా కొత్తపాలెం గ్రామంలోని గాయత్రీ శక్తిపీఠం యొక్క చతుర్థ వార్షికోత్సవ వేడుకలు, కన్నుల పండువగా నిర్వహింపబడ్డాయి.

సంపూర్ణ సమర్పణాభావంతో పూజ్యగురుదేవుల ఆలోచనా సరళితో మమేకమై, మనోవాక్కాయ కర్మల ఏకీకృతం గావించిన వ్యక్తులు ఎంత సాధించగలరు అనే దానిని, అనతికాలంలో గాయత్రీ శక్తిపీఠము కొత్తపాలెం సాధించిన ప్రగతిని పరిశీలించినచో మనకు తేటతెల్లమవుతుంది. శక్తిపీఠము చుట్టుప్రక్కలనున్న 25 నుండి 30 గ్రామాలలో తన ఉనికిని విశిష్టతను చాటి చెప్పుచూ దేవాలయాలు జన జాగరణ కేంద్రాలు కావాలి అనే పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యుల ఆకాంక్షను పూరించే దిశగా ఈ శక్తిపీఠము అడుగులు వేయుట అత్యంత ముదావహం.

24 గ్రామాలలో జ్ఞానఘటాలతోపాటుగా దాదాపు 250 కలశములను ఔత్సాహిక కార్యకర్తల గృహాలలో శక్తిపీఠ సారథ్యంలో నెలకొల్పుట జరిగింది. వీని స్ఫూర్తితో ఆయా గృహాలలో నిత్యగాయత్రీ జపముతోపాటు అంశదానము కూడా సమాజ కళ్యాణానికై ప్రోదిచేయుట, ఒక నిత్య కృత్యముగా మారింది. దీనితోపాటుగా గాయత్రీ శక్తిపీఠము సమాజ కళ్యాణానికై మార్గదర్శనమీయగలదనే నమ్మకము భక్తులలో ఏర్పడింది.

భక్తులు కలశములద్వారా, జ్ఞానఘటముల ద్వారా తాము గత 40 దినాల నుండి ప్రోది చేసిన అంశదానాలను చేబూని, అందుబాటులోనున్న ట్రాక్టర్లు, ఆటోలు, వ్యాన్లు, కాలినడకన 54 కుండముల యజ్ఞములో పాల్గొనుట మిగుల ఆనంద దాయకం. యజ్ఞ ప్రాంగణమంతా నారీ జనంతో నిండిపోయి నారీజాగరణ అంతర్లీనంగా సమాజంలో జరుగు చున్నదనెడి దానికి భరోసాను కల్పించింది. యజ్ఞ సమయంలో కొన్ని ఇబ్బందికర అసౌకర్యములు, ఆటంకాలు ఏర్పడినప్పటికి, వచ్చినవారంతా సంపూర్ణ సహకారమందిస్తూ తమ సహనశీలతను, ప్రదర్శించి, పూజ్యగురుదేవుల ఆకాంక్షలను, మార్గదర్శకాలను తమ జీవన సరళిలో ఆచరిస్తూ పరీక్షకు నిల్చి ఉండుట మిగుల ప్రశంశనీయం.

అన్నింటికన్నా మిగుల ప్రశంసనీయకరమైనది. పరస్పర సహకారంతో, ఉన్నత శిఖరాలను సమాజం అధిరోహించ గలదనెడిది ఇచ్చట నిరూపితమైనది. “నాటు-కోసుకో” అనెడి పూజ్యగురుదేవుల తారక మంత్రం ఈ శక్తిపీఠ పరిధి గ్రామాలలో అద్భుతంగా పనిచేస్తున్నదనే దానికి ఉదాహరణ. శ్రీ సీతా రామయ్య రైసుమిల్లు యజమాని బాపట్ల, యజ్ఞానికి కావలసిన బియ్యాన్ని అంశదానంగా అందించారు. అట్లే అనేక గ్రామాల నుండి కార్యకర్తలు భక్తులు పాలు, చక్కెర, బెల్లం, నూనెలు, నెయ్యి, తదితర సరకులను వారి వారి అంశదానాలుగా అందించి ఇతరులకు మార్గదర్శకులైనారు.

గాయత్రీ శక్తిపీఠాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్ది, పూజ్యగురుదేవులు మరియు వందనీయ మాతాజీల సూక్ష్మ సంరక్షణలో, స్వావలంబన దిశగా శక్తిపీఠాన్ని నడిపించుచున్న కొత్తపాలెం గ్రామ గాయత్రీ పరివార్ సభ్యులు మిగుల అభినంద నీయులు.

## ప్రార్థన

*రోజు వారి ప్రాతఃకాల వేళ నడిచే పనిలో నేను నిమగ్నమై ఉన్నాను. వీధులలోని చెత్త చెదారాన్నీ తీసుకు పోయే ట్రక్కు నడుస్తున్న నా ప్రక్కకు వచ్చి నిలిచింది. ట్రక్కు డ్రైవర్ తన జేబులోని ఒక ఫోటో తీసి నాకు చూపించాడు. బాలుని మోము ముద్దులొలుకుచున్నది. “ఈ బాలుడు నా మనుమడు-ఆసుపత్రిలో చావు బ్రతుకుల మధ్య ఉన్నాడు” అని చెప్పాడు. ధన సహాయ ఆశించు చున్నాడని భావించి, పర్సు కొరకు, జేబులో చేయి పెట్టాను. కాని అతడు ధనాన్ని మించిన సహాయాన్ని కోరాడు- “నేను అందరినీ అడుగుతున్నాను నా మనుమని ప్రాణ సంరక్షణకై ఒక ప్రార్థన చేయమని” అని అన్నాడు ట్రక్కు డ్రైవర్.*

*- అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**భార్యభర్తలు ఇద్దరు కుటుంబాన్ని సంతోషంగా ఉంచడానికి నిరంతరం ప్రయత్నించాలి**